ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 08.01.2025 | సంపుటి : 11 సంచిక : 181 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను

మిగతా 2లో..



## మరో రెండు హెచ్‌ఎంపీవీ కేసులు


నాగ్‌పుర్‌లో ఇద్దరు చిన్నారులకు సోకినవైరస్

నాగ్‌పూర్(జనంసాక్షి): చైనాలో ఇటీవల కలవరం సృష్టిస్తున్న 'హ్యూమన్ మెటాన్యుమో వైరస్' (హెచ్ ఎంపీవీ) మన దేశంలోను విస్తరిస్తుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో తొలి కేసులు వెలుగుచూడగా.. తాజాగా మరో రెండు కేసులు నమోదయ్యాయి.

మిగతా 2లో..



# కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత



- ఆధారాలున్నాయి.. అరెస్టు ఆపలేం
- స్పష్టం చేసిన న్యాయస్థానం
- ఎసిబి విచారణకు అనుమతి

హైదరాబాద్(జనంసాక్షి): భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలం టూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 31న ఇరువైపుల వాదనలు ముగించిన హైకోర్టు.. మంగళవారం తీర్పు వెలువరిం చింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. ఏసీబీ అరెస్ట్ చేయకుండా 10 రోజుల పాటు మధ్యంతర ఉత్తర్వులు పొడిగించాలన్న కేటీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చిస్తున్నారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్

మిగతా 2లో..




- బీఆర్ఎస్ మాజీ మంత్రికి హైకోర్టులో చుక్కెదురు
- కేబినెట్ అనుమతి లేకుండా నగదు బదిలీ జరిగింది
- ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎలా చేశారు?
- విదేశీ సంస్థకు నేరుగా నగదు తరలింపుపై విస్మయం
- ఈ లావాదేవీలపై లోతుగా ఎంక్వైరీ జరగాల్సిందే
- విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

## కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు

- 16న విచారణకు రావాలని దర్యాప్తు సంస్థ ఆదేశం
- ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటా : కేటీఆర్

# మెట్రో పనుల్లో వేగం పెంచండి

**శామీర్‌పేట్,మేడ్చల్ నూతన మార్గాలకు మార్చి నెలాఖరుకు డీపీఆర్లు పూర్తి చేయాలి**

**మెట్రోల ప్రారంభంలో భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలి • హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం**

**ఉన్నతాధికారులతో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష**


హైదరాబాద్(జనంసాక్షి): ఫ్యూచర్ సిటీ, శామిర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్ లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్-శామిర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్‌మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. శామిర్ పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని... అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే

మిగతా 2లో..



## భారీ భూకంపంతో వణికిన టిబెట్

**126 మందికి పైగా మృతి.. అనేక మందికి గాయాలు**



- రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో కంపించిన భూమి
- మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం
- భారత్‌లోనూ ప్రకంపనలు

లాసా(జనంసాక్షి): హిమాలయ ప్రాంతాలైన నేపాల్-టిబెట్ సరిహద్దులను భారీ భూకంపం వణికించింది. మంగళవారం ఉదయం ఇక్కడ రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తు కారణంగా టిబెట్‌లో ఇప్పటివరకు కనీసం 126మంది మృత్యువాత పడినట్లు చైనా అధికారిక మీడియా సంస్థ పేర్కొంది. మరో 188 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.నేపాల్-టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో

మిగతా 2లో..

**ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారం..**

## సుప్రీంకు కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వా హక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది.దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ తరఫున న్యాయవాది మోహిత్‌రావు ఈమేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు.



## మా వాదన కూడా వినండి

సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ పిటిషన్

హైదరాబాద్(జనంసాక్షి): ఫార్ములా ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కెవియేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ కేసులో ఒకవేళ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు గానే ఆశ్రయించింది. ఫార్ములా?ఈ కార్ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. అరెస్ట్ చేయొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులును కూడా హైకోర్టు ఎత్తివేసింది. ఏసీబీ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోలేమని కేటీఆర్ తరఫు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించింది. అందరికి 'రూల్ ఆఫ్ లా' వర్తిస్తుందని కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన సందర్భంగా తెలంగాణ

మిగతా 2లో..

## గ్రీన్ కో కార్యాలయంపై ఏసీబీ దాడులు

హైదరాబాద్(జనంసాక్షి): మాదాపూర్‌లోని గ్రీన్‌కో కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి ఈ సోదాలు కొనసాగుతున్నాయి. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్ట్స్ జెన్ కంపెనీ కార్యాలయాల్లోనూ

మిగతా 2లో..

## పార్టీ కార్యాలయాల ముట్టడికి భాజపా, కాంగ్రెస్ కార్యకర్తల యత్నం

స్వల్ప ఉద్రిక్తత



హైదరాబాద్(జనంసాక్షి): బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడులతో హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని ఈ రెండు పార్టీ ఆఫీసుల వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ కాల్కాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతోంది. రమేష్ బిదురి వ్యాఖ్యలకు నిరసనగా, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కేంద్ర మంత్రులను అడ్డుకోవాలని యూత్ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు.

మిగతా 2లో..

**ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలు చేస్తే.. భాజపా ఎందుకు ఖండించలేదు?: భట్టి విక్రమార్క**

వార్త 2లో

## తెలంగాణ హైకోర్టు సీజే బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



న్యూయార్క్(జనంసాక్షి) తెలంగాణ, బాంబే హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఆలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్‌ను దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. 2023 జులైలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆలోక్ అరాధే నియమితులైన విషయం తెలిసిందే.అలాగే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా నియమించేందుకు సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు జడ్జిలతో కూడిన కొలీజియం సిఫారసు చేసింది. 2011 నవంబర్‌లో కేరళ హైకోర్టు

మిగతా 2లో..

## శ్రీతేజకు అల్లు అర్జున్ పరామర్శ

నిర్మాత దిల్‌రాజ్‌తో కలసి ఆస్పత్రికి రాక

2లో

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా

**10న నోటిఫికేషన్ విడుదల • 17 వరకు నామినేషన్ల స్వీకరణ**

**20 వరకు నామినేషన్ల ఉపసంహరణ • ఫిబ్రవరి 5న పోలింగ్**




న్యూఢిల్లీ (జనంసాక్షి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని

మిగతా 2లో..


**రిటైర్మెంట్ తర్వాత మీ అందరికీ దూరంగా వెళతా**

సీఈసీ రాజీవ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు

వార్త 2లో

## 3 బిలియన్ డాలర్లు

**భారత్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి • సీఈఓ సత్యనాదెళ్ల ప్రకటన**



బెంగళూరు(జనంసాక్షి): ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. దేశంలో క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలను విస్తరించడం, డేటా సెంటర్ల విస్తరణ కోసం 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడించారు.అలాగే, 2030 నాటికి 10 మిలియన్ల మందికి (కోటి మందికి) ఏఐ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బెంగళూరు వేదికగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు.ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న సత్య నాదెళ్ల సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఏఐ విషయంలో భారత్‌ను ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బెంగళూరులో జరిగిన ఈవెంట్‌లో పెట్టుబడులపై ప్రకటన చేశారు. ఎప్పుడూ లేని స్థాయిలో భారత్‌లో 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నందుకు సంతోషంగా ఉందని సత్య నాదెళ్ల తెలిపారు. ఈ పెట్టుబడి భారత్‌లో ఏఐ ఆవిష్కరణలకు ఊతం ఇస్తుందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధాని మోదీ ఆలోచనల్లో కీలక భూమిక పోషిస్తుందన్నారు.భవిష్యత్‌లో ఏఐ నిపుణుల అవసరం పెద్ద సంఖ్యలో ఏర్పడుతుందని సత్య నాదెళ్ల అన్నారు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. లింక్డిన్‌లో ఏఐ స్కిల్స్‌ను తమ ప్రొఫైల్‌కు జోడించిన వారి సంఖ్య గ్లోబల్‌గా 71 శాతంగా ఉండగా.. భారత్‌లో 122 శాతం వృద్ధి నమోదైందన్నారు. అందుకే 2025 నాటికి 2 మిలియన్ల మందిని ఏఐ

మిగతా 2లో..



## ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం

ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి):: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగులకు నూతన టెక్నాలజీతో కూడిన ఫోటో కెమెరాలను మంత్రి అందచేశారు. రాష్ట్రంలో జిల్లా, క్షేత్ర స్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందచేయడం వలన ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫోటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చునని కమిషనర్ డాక్టర్ హరీష్

మిగతా 2లో..

## మా వాదన కూడా వినండి

హైకోర్టు గుర్తుచేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం రూ.55 కోట్లు విదేశీ కంపెనీలకు చెల్లించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులను విదేశీ సంస్థలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసింది. ఏసీబీకి కూడా మున్సిపల్ శాఖ ఫిర్యాదు చేసింది. ఏసీబీ రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఫార్ములా ఈ రేస్ కోసం జరిగిన బ్యాంక్ లావాదేవీలపై ఏసీబీ ఆరా తీసింది. హెచ్ఎండీఏ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిన నిధులు.. ఏ అకౌంట్స్?లోకి చేరాయనేది కూడా గుర్తించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే డబ్బులు ట్రాన్స్?ఫర్ అయినట్లు తేల్చింది. ఈసీ నుంచి అనుమతులు తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించారని తేలింది. 2023 అక్టోబర్ 3, 11వ తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచి రూ.45.71 కోట్లు లండన్‌లోని ఫార్ములా?ఈ ఆపరేషన్స్‌కు తరలించారు. ఇందుకు గాను ఆర్బీఐ రూల్స్ పాటించనందున హెచ్ఎండీఏ రూ.8 కోట్లను ఐటీ శాఖకు పెనాల్టీగా చెల్లించాల్సి వచ్చింది. ఫెడరేషన్ ఆఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఐఏ)కు రూ.1.10 కోట్లు చెల్లించారు. ఇలా మొత్తం రూ.54.89 కోట్లు మున్సిపల్ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దుర్వియోగం చేశారని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

## గ్రీన్ కో కార్యాలయంపై ఏసీబీ దాడులు

అధికారులు తనిఖీలు చేస్తున్నారు. రూ. 41 కోట్ల ఎన్నికల బాండ్ల కొనుగోలు వ్యవహారంలో అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం, గన్నవరంలోని ఏస్ నెక్ట్స్ జెన్ కార్యాలయాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## 3 బిలియన్ డాలర్లు

నిపుణులగా తీర్చిదిద్దే ఉద్దేశంతో గతంలో 'అడ్వాంటేజ్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నిర్దేశిత గడువు కంటే ముందే ఆ లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. అదే కార్యక్రమం కింద 2030 నాటికి 10 మలియన్ల మందికి ఏఐ స్కిల్స్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సత్యనాదెళ్ల తెలిపారు.

## భారీ భూకంపంతో వణికిన టిబెట్

10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ రీజియన్‌లో మరో రెండుసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వీటి తీవ్రత 4.7, 4.9గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం ఉన్న టిబెట్ ప్రాంతంలో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం.

భారత్‌లోనూ ప్రకంపనలు..

ఈ ప్రకంపనల ప్రభావం భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాలపైనా కనిపించింది. దిల్లీ-ఎన్‌సీఆర్, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు వార్తలు వెలువడ్డాయి. అటు చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి.

## శ్రీతేజకు అల్లు అర్జున్ పరామర్శ

### నిర్మాత దిల్‌రాజ్‌తో కలసి ఆస్పత్రికి రాక

హైదరాబాద్(జనంసాక్షి): సినీ నటుడు అల్లు అర్జున్ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి లోపలికి వెళ్లారు. సుమారు 20 నిమిషాల పాటు ఆస్పత్రిలో ఉన్న అల్లు అర్జున్.. వైద్యులతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తోనూ మాట్లాడారు. మరోవైపు ఆస్పత్రి వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు..

## యూత్ కాంగ్రెస్ దాడి దుర్మార్గం

### తీరుమార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రం:కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ.. తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. పోలీసులను వెంట తీసుకొచ్చి భాజపా కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసులు ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజమని హైదరా బాద్ సీపీని ప్రశ్నించారు. భాజపా తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరని హెచ్చరించారు. రోజు రోజుకూ కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిరాశతో భౌతిక దాడులకు దిగడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు, భౌతిక దాడులకు తావు లేదన్నారు.

## మరో రెండు హెచ్ఎంపీవీ కేసులు

మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇద్దరు చిన్నారులకు హెచ్ఎంపీవీ వైరస్ నిర్ధరణ అయ్యింది. 7, 14 ఏళ్ల చిన్నారులు ఇద్దరూ దగ్గు, జ్వరంతో బాధప డుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో భార త్‌లో ఇప్పటివరకు ఏడు కేసులు నమోదయ్యాయి. సోమవారం కర్ణాటక, తమిళ నాడు, గుజరాత్ లలో తొలి కేసులు వెలుగు చూశా యి. అయితే, దీనిపై ఆందోళన చెంద ాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సైతం పేర్కొన్నారు. 'హెచ్ఎంపీవీ కొత్త వైరస్ కాదని ఆరోగ్య రంగ నిపుణులు స్పష్టంచేశారు. ఈ వైరస్‌ని 2001లో గుర్తించారు. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచవ్యాప్తిలో ఉంది.

# కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత



న్యాయస్థానం ప్రశ్నించారు. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. నగదు బదిలీలో కేటీఆర్ ఎక్కడా లబ్దిపొందలేదని, అవినీతి జరిగినట్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ల రేసు నిర్వహణపై జరిగిన ఒప్పందంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఫార్ములా -ఈ ఆపరేషన్స్ సంస్థ సంతకాలు చేశాయని ఆయన వాదించారు. పురపాలక శాఖకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదన్నారు. ఈ మేరకు పలు హైకోర్టు తీర్పులను సిద్దార్థ్ దవే ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ కేసులో ఏసిబి వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు కొద్దిసేపటిక్రితమే కెటిఆర్ క్వాష్ పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కాగా, సోమవారం ఏసిబి విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. కెటిఆర్ దుమ్మా కొట్టిన సంగతి తెలిసిందే. తన లాయర్ ను ఏసిబి కార్యాలయంలోకి అనుమతించక పోవడంతో ఆయన విచారణకు హాజరవ్వకుండానే తిరిగి వెళ్లిపోయారు. దీంతో విచారణకు హాజరవ్వాలని మరోసారి ఏసిబి అధికారులు కెటిఆర్ కు నోటీసులు ఇచ్చింది.మరోవైపు, ఇదే కేసులో ఇవాళ ఈడీ విచారణ పిలవగా.. తనకు సమయం కావాలని కెటిఆర్ కోరారు. దీంతో ఆయనకు కొంత సమయం ఇస్తున్నట్లు తెలిపింది. కేబినేట్ అనుమతులు లేకుండా భారీగా నగదు బదిలీ ఫార్ములా ఈ కార్ రేసు కేసులో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు వెలువడిన వెంటనే, ఏసీబీ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రీన్‌కో సంస్థ , దాని అనుబంధ సంస్థల కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, మచిలీపట్నం కార్యాలయాల్లో సోదాలు సాగాయి. నిందితుల ఇళ్లపై సోదాలు చేపట్టేందుకు కోర్టు నుండి సెర్చ్ వారెంట్‌ను కూడా పొందింది. అయితే.. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఆర్డర్ కాపీ సిద్ధమైంది. ఈ ఆర్డర్ కాపీలో జడ్జి లక్ష్మణ్ సంచలన అంశాలు ప్రస్తావించారు. హెచ్ఎండిఎ పరిధికి మించి డబ్బు బదిలీ జరిగిందని హైకోర్టు వెల్లడించింది.. కేబినెట్ ఆమోదం లేని లావాదే వీలపై విచారణ జరగాలని హైకోర్టు సూచించింది. కేటీఆర్ ఆదేశాలతోనే చెల్లింపులు జరిగాయని అంటున్నారని, చెల్లింపులతో ఎవరు లబ్ది పొందారో తెలియాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణకు తగిన సమయం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుపై ఏసీబీ ఆధారాలు సేకరించాలని, ఫార్ములా ఈ-రేస్ కేసులో మేం ఇప్పడే జోక్యం చేసుకోమని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఈ-రేస్ వ్యవహారంలో ఏం జరిగిందో దర్యాప్తులో తేలుతుందని, ఈ తీర్పు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌కు మాత్రమే వర్తిస్తుందని హైకోర్టు వెల్లడించింది.ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బును నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూర్చి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ది చేకూర్చారని అభియోగాలున్నాయి. ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పురపాలక మంత్రిగా ఉన్న కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి బాధ్యుడిగా ఉండాలి. ఉత్తమ పరిపాలన అందించే బాధ్యత మంత్రులపైనే ఉంటుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఉత్తర్వులను హైకోర్టు ఉదహరించింది. కాగా.. ఫార్ములా ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం వేగంగా పరిణామాలు మారిపోయాయి. హైకోర్టు తీర్పుపై ఓవైపు బీఆర్ఎస్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో కేటీఆర్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక పిటిషన్‌ను దాఖలు చేసింది. తమ వాదనలు వినకుండా కేటీఆర్ పిటీషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దంటూ సర్కార్ కేవియట్ దాఖలు చేసింది. దీంతో కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ వెంటనే మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే సుప్రీం కోర్టు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి కేటీఆర్‌కు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న విచారణకు రావాల్సిందిగా ఈడీ నోటీసుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ఈడీ విచారణకు కేటీఆర్ హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. అటు హైకోర్టు తీర్పు తర్వాత ఏసీబీ అధికారులు సమావేశమయ్యారు. తీర్పు నేపథ్యంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు చర్చించారు. సర్చ్ వారెంట్ కోసం కోర్టు నుంచి ఏసీబీ అనుమతి పొందింది. కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై సోదాలకు కోర్టు సర్చ్ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా కేటీఆర్ ఇంటికి ఏసీబీ అధికారులు చేరుకోనున్నారు.

### తెలంగాణ హైకోర్టు సీజే బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

జడ్జిగా నియమితులైన జస్టిస్ చంద్రన్.. ఆ తర్వాత పట్నా హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. 2023 మార్చి 29 నుంచి అదే హోదాలో కొనసాగుతున్నారు. కొలీజియం సిఫారసును కేంద్రం ఆమోదిస్తే.. సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 33కి చేరుకోనుంది.



## మెట్రో పనుల్లో వేగం పెంచండి

అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సీఎం ఆదేశించారు... హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం

తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాలకు, డివిజన్ స్థాయి సిబ్బందికి ఫోటో కెమెరాలను అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ ఫోటో కెమెరాలు సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో సమాచార శాఖ సిబ్బంది విరివిగా పాల్గొంటు ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ డా.హరీష్, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలు చేస్తే.. భాజపా ఎందుకు ఖండించలేదు?

- భట్టి విక్రమార్క

**ఖమ్మం(జనంసాక్షి):** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై దిల్లీకి చెందిన భాజపా నేత రమేశ్ బిదూరీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల పట్ల గౌరవ మర్యాదలున్న అందరూ ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో భాజపా అగ్రనాయకత్వం క్షమాపణ చెప్పా?లని భట్టి డిమాండ్ చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు. ఈ మేరకు ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు.' 'క్షణికావేశంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు భాజపా కార్యాలయంపై దాడి చేశారని తెలుసుకున్నాను. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడాను. విషయం తెలియగానే సీఎం, పీసీసీ అధ్యక్షుడు కూడా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా చాలా స్పష్టంగా చెప్పారు. మనది గాంధేయ వాదం.. దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి కాదన్నారు. ఇదే కాదు.. ఏ రకమైన దాడులనూ కాంగ్రెస్ ప్రోత్సహించదు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోంది. ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటం మా బాధ్యత.లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరైనా ఒక్కటే. ఏ పార్టీ అయినా సరే.. ఎక్కడైనా అన్యాయం జరుగుతుందనిపిస్తే ప్రజల్లోకి వెళ్లాలి.. అభిప్రాయాలు వ్యక్త పరచాలి. ఇలాంటి దాడులకు మాత్రం దిగొద్దు. అసలు విషయం తెలుసు కోకుండా భాజపా నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్లమెంట్ సభ్యురాలు, ఒక మహిళపై భాజపా నేత ఇష్టానుసారం మాట్లాడితే.. భాజపా అగ్రనాయకత్వం ఏం చేస్తోంది? " అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు

- 16న విచారణకు రావాలని ఆదేశం
- ఎదురు దెబ్బల నుంచి బలంగా పుంజుకుంటా
- ఎక్స్‌లో వేదికగా బీఆర్ఎస్ అధ్యక్షుడి పోస్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):**ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 16న విచారణకు రావాలని కేటీఆర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి ఈడీ ఎదుట కేటీఆర్ మంగళవారమే హాజరు కావాల్సి ఉంది. అయితే, ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని ఇప్పటికే హైకోర్టులో వేసిన కేసులో తీర్పు రిజర్వ్‌లో ఉందని తెలిపారు. హైకోర్టుపైనున్న గౌరవంతో.. తీర్పును వెలువరించేంత వరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ సమాధానం పంపారు.అయితే ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ క్రమంలో ఈడీ తాజాగా మళ్లీ నోటీసులు జారీ చేసి 16న విచారణకు రావాలని కేటీఆర్‌ను ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారు. కాగా, క్వాష్ పిటన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందీనగర్‌లోని కేటీఆర్ నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు.

**ఎదురు దెబ్బల నుంచి బలంగా పుంజుకుంటా**

ఫార్ములా ఈ కేసుకు సంబంధించి ఏసీబీ కేసుపై కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివే యడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కూడా ఎత్తివేయడంతో ఏ క్షణమైనా కేటీఆర్ అరెస్ట్ పక్కా అంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఎదురు దెబ్బల నుంచి బలంగా పుంజుకుంటామని అన్నారు.కుట్రలతో తన నోరు మూయించలేరని.. ఇవాల్టి అడ్డంకులే రేపటి విజయానికి సోపానాలు అని ట్వీట్ చేశారు. న్యాయం కోసం పోరాటం సాగిస్తామని.. త్వరలోనే ప్రపంచానికి వాస్తవాలు తెలుస్తాయని మాజీ మంత్రి అన్నారు. 'నా పునరాగమనం ఎదురుదెబ్బ కంటే బలంగా ఉంటుంది. అబద్దాలు నన్ను విచ్ఛిన్నం చేయవు. నీ మాటలు నన్ను తగ్గించవు. మీ చర్యలు నా దృష్టిని మరుగుపరచవు. కోపోద్రిక్తత నన్ను నిశ్శబ్దం చేయదు! నేటి అడ్డంకులు రేపటి విజయానికి దారి తీస్తాయి.. సత్యం కాలంతో పాటు ప్రకాశిస్తుంది! నాకు మన న్యాయవ్యవస్థపై గౌరవం ఉంది. న్యాయం గెలుస్తుందని నా అచంచలమైన నమ్మకం. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది, త్వరలో ప్రపంచం కూడా దానికి సాక్ష్యమివ్వనుంది' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్టు చేశారు. కేటీఆర్ చేసిన ఈ ట్వీట్ ఆసక్తికరంగా మారింది. జైలుకు వెళ్ళటానికి కేటీఆర్ మానసికంగా సిద్ధమయ్యారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజ యవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.

## రిటైర్మెంట్ తర్వాత మీ అందరికీ దూరంగా వెళతా

### సీఈసీ రాజీవ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవీ విరమణ తర్వాత తాను హిమాలయాలకు వెళ్లి కొన్ని నెలలు అక్కడే ఉంటానని వెల్లడించారు. తాను డీటాక్స్‌పై కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 18న రిటైర్మెంట్ కానున్న ఆయన.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా పదవీవిరమణ తర్వాత ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇలా స్పందించారు."నాకు కొంచెం ఏకాంతం, స్వీయ అధ్యయనం కోసం సమయం కావాలి. ఇందుకోసం మీ అందరికి దూరంగా వెళ్తా. హిమాలయాల్లో సుదూర ప్రాంతానికి వెళ్లి నాలుగు, ఐదు నెలలు అక్కడే ఉంటా. అనవసర అంశాల నుంచి పూర్తి విముక్తి పొందుతా" అని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు.వ్యక్తిగత విషయాలు పంచుకున్న ఆయన.. తాను మున్సిపల్ స్కూల్లో చదువుకున్నానని చెప్పారు. చెట్టుకింద తరగతులు విన్న రోజులను గుర్తుచేసుకుంటూ.. ఏబీసీడీలను ఆరో తరగతిలో నేర్చుకున్నానని చెప్పారు. అందుకే అణగారిన వర్గాల చిన్నారులకు బోధించడం తనకెంతో ఇష్టమన్నారు.ఇదిలాఉంటే, రాజీవ్ కుమార్ బిహార్ కేడర్‌కు చెందిన 1984 ఐఏఎస్ అధికారి. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా సెప్టెంబర్ 2020లో బాధ్యతలు చేపట్టిన రాజీవ్ కుమార్.. మే 15, 2022 నుంచి సీఈసీగా కొనసాగుతున్నారు.

## ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్

పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు.

### పార్టీ కార్యాలయాల ముట్టడికి భాజపా, కాంగ్రెస్ కార్యకర్తల యత్నం

రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేసి, రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ దాడిలో ఓ బీజేపీ కార్యకర్త తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి ప్రతిగా, కోపోద్రికులైన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలపై కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించడంతో, ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తరవాత బిజెపి కార్యకర్తలు దాడికి దిగడంతో గాంధీ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ భవన్ ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెద్దఎత్తున గాంధీ భవన్ వద్దకు చేరుకున్న కాషాయం కార్యకర్తలు అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చింపివేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున ఘర్షణ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు.తెలంగాణలో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నారు. దాడి అనంతరం, బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.


**శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిదేవస్థానము,ధర్మపురి పట్టణం-జగిత్యాల జిల్లా**

ఆర్.సి.నెం.ఇ/1592024 తేది: 07.01.2025

బహిరంగ వేలముపాట-కం-సీల్డ్ కొటేషన్ టెండర్-కం-ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన-3

| క్ర.సం | అంశము | కాలపరిమితి | డిపాజిట్ | సెక్యూరిటీ డిపాజిట్ | షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|---|
| 1 | దేవాలయ ఆవరణలో పూజాసమాగ్రి & ఫోటోలు & ఇతరత్రా సామాగ్రి అమ్ముకొనుహక్కు | 18.01.2025 నుండి 17.01.2026 వరకు ఒక(01)సంవత్సరం | 3,00,000/- | 50,000/- | 2000/- |

1)పైన పేర్కొన్న అంశమునకు ఆసక్తిగల & అర్హతగల వారు https://tender.telangana.gov.inవెబ్‌సైట్ సందర్శించగలరు. 2)తేది:08.01.2025 ఉ॥ 11.00గం॥ల నుండి తేది: 16.01.2025 సా॥5గం॥ల వరకు సీల్డు టెండరు పొందవచ్చును./ఆన్‌లైన్ టెండరు దాఖలు చేయవచ్చును. 3)బహిరంగవేలములో పాల్గొను వారు. తేది: 17.01.2025 రోజున ఉ॥ 11గం॥లకు నేరు పాల్గొనవచ్చును.

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR No.8754-PP/CL/ADVT/1/2024-25


# ఎస్సీ అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు హాస్టల్లో రాత్రి బస (నిద్ర)





**ఖమ్మం(జనంసాక్షి):** షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహం బనిగండ్లపాడులో మంగళవారం రాత్రి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం జిల్లా ఉపసంచాలకులు కస్తాల సత్యనా రాయణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహంలో విద్యార్థులతో భోజనం చేసి, విద్యార్థులతో కలిసి నిద్రించారు. వారికి ప్రభుత్వం నుంచి అందించిన కార్పెట్, బెడ్ షీట్, ఉలెన్ రగ్గులు, స్వెటర్స్, స్పోర్ట్స్ డ్రెస్, నాలుగు జతల బట్టలు, నూతన మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాలను ఉపయోగించుకొని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. విద్యార్థులతో పాటు రాత్రి వసతి గృహంలో నిద్రించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఏ ఎస్ సి డి ఓ కె.వెంకటేశ్వరరావు, వసతి గృహ సంక్షేమ అధికారి టి.దసరద్ ,ట్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనువాదంపై మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్

**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** హిందీ విభాగం వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హిందీ విభాగం సీతాఫల్‌మండి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, సెంట్రల్ హిందీ డైరెక్టరేట్ భారత ప్రభుత్వం, ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ అకాడెమీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో 'అనువాదం: మారుతున్న దృక్పథాలు, అభివృద్ధి చెందుతున్న అవకాశాలు' అనే అంశంపై ఓయూ ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. జనవరి 8, 9 ,10 తేదీల్లో మూడు రోజులు ఈ సెమినార్ జరుగుతుందని ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం అధ్యక్షురాలు ప్రొ. మాయాదేవి, వివేకానంద ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ప్రభు, సీతాఫల్ మండి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హిందీ అకాడమీ డైరెక్టర్, ప్రొ. రామచంద్రం సంయుక్తంగా ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో భారతదేశంతోపాటు విదేశాలకు చెందిన పలువురు మేధావులు అనువాదానికి సంబంధించిన వివిధ దృక్కోణాలపై మాట్లాడతారని, ఈ రంగంలో ఆవిర్భవిస్తున్న అవకాశాలను కూడా తెలియజేస్తారని సెమినార్ కన్వీనర్ ప్రొ. అనుపమ గారు తెలియజేశారు. అనువాద సందర్భంలో సంస్కృతి, ప్రపంచీకరణ, యంత్ర అనువాదం, ఏఐ వంటి అంశాలపై అర్థవంతమైన చర్చ జరుతదని పరిశోధకులు ,భాషాభిమానులు,విద్యార్థులు సదస్సు విచ్చేసి విజయవంతం చేయాలని సదస్సు నిర్వాహకులు తమ ఆకాంక్షను తెలియజేశారు.

# జిన్నింగ్ మిల్లులో కార్మికుడు మృతి

**బోథ్ జనవరి 07(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మహారాష్ట్రకు చెందిన అరె శంకరం గైక్వాడ్ (55) అదిలాబాద్ జిల్లా కేంద్రంలో కురుషధ్ కాలనీలో కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. రెండు నెలల క్రితం బోథ్ స్వప్న జిన్నింగ్ మిల్లులో కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే పని నిమిత్తం పత్తి గటన్ లను లోడింగ్ చేస్తున్న నేపథ్యంలో అకస్మాత్తుగా తల పై పడటంతో స్పృహ కోల్పోయి పడిపోయాడు.. వెంటనే తోటి కార్మికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# కాంగ్రెస్ దాడిని ఖండించిన బిజెపి నేతలు

- తలచుకుంటే గాంధీభవన్ పునాదులు ఉండవు
- ఘాటుగా హెచ్చరించిన బండి, ఏలేటి.,ధర్మపురి



**హైదరాబాద్, జనవరి7 (జనంసాక్షి) :** బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని బిజెపి తీవ్రంగా ఖండించింది. పార్టీ నేతలు ఈ దాడిని తీవ్రంగా తీసుకున్నారు. తాము తలచుకుంటే గాంధీభవన్ ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదో తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దన్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ.. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నానన్నారు. బీజేపీ కార్యాలయం పై కాంగ్రెస్ దుండగులను పంపించి దాడులు చేశారని, కార్యకర్తల తలలు పగలగొట్టారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వ ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. ఏం చెప్పాలని అనుకుంటున్నారు.. ఏమిటి ఈ సంస్కృతి.. రాష్ట్రానికి హోంమంత్రి లేరు.. సీఎం ఏం చెప్పాలని అనుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ దీనికి బాధ్యత వహించాలని, మహేష్ కుమార్ గౌడ్ వి చిల్లర చేష్టలు అని ఆయన ధ్వజమెత్తారు. దాడికి బాధ్యత వహించి మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేయాలని, హోం మంత్రి సీఎం చేతుల్లో ఉంది ఆయన రాజీనామా చేస్తారా ? అని ఆయన దుయ్యబట్టారు. దీంతోపాటు.. ఫార్ములా ఈ రేసు కేసు గురించి మాట్లాడుతూ.. కేటీఆర్ అధికారుల ప్రమేయం ఉందని అంటున్నారని, అధికారులను కేటీఆర్ బెదిరించారన్నారు. కేటీఆర్ నిర్దోషి ఐతే నిలబడి ఎదుర్కోవాలని, వాస్తవాలను బయటపెట్టాలన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు మహేశ్వర్ రెడ్డి. ఈ పరిస్థితులపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ, 'బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి దురదృష్టకరమైన ఘటన. ఇది కాంగ్రెస్ పార్టీ అసహనాన్ని, బీఆర్ఎస్ తరహా విధానాలను ప్రతిబింబిస్తోంది. మేము కూడా ప్రతిగా ఇలానే ప్రవర్తిస్తే, మీ జాతీయ నాయకులు ఎక్కడికి దాక్కుంటారో" అని ప్రశ్నించారు. అదే సమయంలో, తెలంగాణలో అవినీతి విషయాలపై ఆయన తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'కేటీఆర్ ఎంతకాలం తప్పించుకుని తిరుగుతారు? చంచల్‌గూడ జైలుకు వెళ్లాలా లేక తీహార్ జైలుకు వెళ్లాలా అనేది కేటీఆర్ నిర్ణయించుకోవాలి. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. ప్రజల డబ్బును దోచుకుని కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. బీజేపీ మాత్రం తెలంగాణలో త్వరలో అధికారంలోకి వస్తుంది,' అని ధర్మపురి భరోసా వ్యక్తం చేశారు. తెలంగాణలో పాలనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల విధానాలను విమర్శిస్తూ, బీజేపీ తన రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టంగా పేర్కొన్నారు.

# జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య పిరికిపంద చర్య


- దోషులను కఠినంగా శిక్షించాలి
- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ డిమాండ్

**భూపాలపల్లి, జనవరి 7 (జనం సాక్షి) :** చత్తీస్గఢ్ జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య చేయడం పిరికి పందల చర్య అని,దోషులను కఠినంగా శిక్షించాలి అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్.యు.జె (ఐ) స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్ లు యూనియన్ తరుపున డిమాండ్ చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వాస్తవాలను వెలికి తీసే జర్నలిస్టులను హత్యాలతో,భౌతిక దాడులతో భయభ్రాంతులకు గురి చేయాలను కోవడం అవినీతిపరుల అవివేకమే అవుతుంది తప్ప,హత్యలు,భౌతిక దాడులకు జర్నలిస్టులు భయపడరనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుతెరగాలని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన అవినీతి కాంట్రాక్టర్లు తీరును,వారికి కాపలా కాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంను తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ దోషులకు కఠినంగా శిక్షించాల్సిందిగా యూనియన్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ దారుణ హత్య వ్యవహారంలో విచారణను వేగవంతం చేసేందుకు కాలపరిమితి విధించాలని,హంతకులను చట్ట ప్రకారం శిక్షించాలని టీ.ఎస్.జే యూ డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జరల్నిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముకేశ్ చంద్రకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



# నేడు చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సదస్సు

**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** లింగ సమానత్వ చట్టాలా? అన్న అంశంపై నేడు విజయవాడ ప్రెస్ క్లబ్ ఉదయం 11 గంటలకు చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వమిస్తున్నట్లు చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి తెలిపారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కర్నూలు జిల్లా బాధ్యురాలు లక్ష్మి మనకు భౌతికంగా దూరమై 20 ఏళ్ళు అయిందని, 2005 జనవరి 8న లక్ష్మిని అప్పటి కాంగ్రెస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసి హత్య చేసిందని గుర్తు చేశారు. భర్తలతో హింస ఎదుర్కుంటున్న సమాజిక స్పృహలేని కొందరు మహిళలు సైతం పురుషులకు చట్టాలు లేవని వారు అన్యాయానికి గురవుతున్నారని నమ్ముతున్నారని, అతుల్ సుభాష్ మరణ వాంగ్మూలంలో తన భార్యను దోషిగా చెబుతూ న్యాయవ్యవస్థను కూడా అంతే దోషిని చేశాడని, ఇంకొంతమంది ఇంకొంచెం ముందుకెళ్లి లింగ సమానత్వం చట్టాలను తేవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అందుకే భార్యలను భర్తలు కొట్టడం తప్పుకాదని ప్రజలు నేటికీ కూడా భావిస్తున్నారని, కోర్టులు, పోలీసులు కూడా ఇదే వైఖరితో ఉండడంలో ఆశ్చర్యం లేదని అన్నారు. "ఏ చట్టమైనా బలహీనులకు అండగా ఉండాలి. స్త్రీ పురుష సమానత్వ సూచిలో మన దేశం కింది స్థాయిలో ఉన్నది. అంతే ఎ కాదు స్త్రీ పురుష సమానత్వం సాధించడానికి మరో 200 సంవత్సరాలు పడుతాయని సర్వేలు చెబుతున్నాయని నేడున్న పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలో ఈ అసమ సమాజంలో లింగ సమానత్వ చట్టాల వల్ల మహిళలు మరింత హింసకు గురవుతారని తెలిపారు. 498ఏ (84)పై వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకోవాలని పిలుపునిస్తూ చట్టం దుర్వినియోగం అవుతోందనే ప్రచారంలోని వాస్తవాలపై మరింత అవగాహన అందించడానికి జనవరి 8న లక్ష్మీ వర్ధంతి సందర్భంగా చైతన్య మహిళా సంఘం సదస్సు నిర్వహిస్తున్నది. ప్రజలు మహిళలు హాజరై సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**మహదేవపూర్, జనవరి 7 (జనం సాక్షి) :** జనసాక్షి 2025 నూతన క్యాలెండర్ ను మంగళవారం మంథని ఎమ్మెల్యే రాష్ట్ర ఐటీ శాఖ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా జనంసాక్షి నూతన క్యాలెండర్ అవిష్కరించారు. ఈ సందర్భముగా ఐటీ శాఖ మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ. జనంసాక్షి పత్రిక మరింత ముందుకు సాగాలని ఎప్పటి వార్తలు అప్పుడు ప్రచురిస్తూ ప్రజలసమస్యలను వెలికితీస్తూ పత్రికలకు సరైన గుర్తింపు వస్తుందని ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడుతున్న జనంసాక్షి దినపత్రిక రానున్న రోజుల్లో మంచి గుర్తింపు పొందాలని అదేవిధంగా పత్రికలు సమాజంలో నిష్పక్షపాతంగా ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మహదేపూర్ మండల జనంసాక్షి పత్రిక రిపోర్టర్ అయిత రాజిరెడ్డి . బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు .కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరు ప్రభాకర్ రెడ్డి. మహదేవపూర్ మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్ పాల్గొన్నారు.

# నిరుద్యోగులు కష్టంతోనే పైకి ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



గోవిందరావుపేట (జనంసాక్షి) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రైవేటు రంగంలో ఉద్యోగ కల్పన కొనసాగిస్తూనే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని, అనేక కష్టాలు పడుతూనే పైకి ఎదగాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పిఎస్ఆర్ గార్డెన్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఈజీ ఎంఎం సంస్థల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని సి జి ఎం ఎం స్పెషల్ కమిషనర్ సీఈవో బి. షఫీ ఉల్లా, కలెక్టర్ దివాకర టి. ఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పలు కంపెనీల సహకారంతో రాష్ట్రంలోనే మొట్ట మొదటి సారిగా మన జిల్లాలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరంగా ఉందని, ఇదే తరహాలో గత సంవత్సరం జూలై నెలలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. ఉపాధి జీవన ఉపాధి కోసం ప్రైవేటు ప్రభుత్వ రంగాలలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు నిరుద్యోగులు కష్టపడి సాధించాలని, జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే జిల్లా నుండి 250 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని అన్నారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు చేయడం అవమానంగా భావించవద్దని, ఆయా కంపెనీలలో కష్టపడుతూ ఉన్నత స్థాయికి ఎరిగి మరో నలుగురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. కొంతమంది నిరుద్యోగులు ఉద్యోగ వేటలోనే ఉంటూ వ్యవసాయం వ్యాపార రంగాలపై దృష్టి సారిస్తున్నారని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయల రుణాలను మంజూరు చేస్తున్నదని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన వారు నేడు అదే కంపెనీలకు సీఈఓ గా కొనసాగుతున్నారని, వేతనాలు తక్కువ ఇస్తున్నారని నిరాశ చెందకుండా ముందుకు సాగాలని సూచించారు. పితాను చిన్నతనం నుండే అనేక కష్టాలు ఇబ్బందులు పడి నేడు ఈ స్థాయికి ఎదిగానని తనను ఆదర్శంగా తీసుకొని నిరుద్యోగులుముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగా నేడు 12 వేల 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఉద్యోగ అవకాశాలు రాని పక్షంలో నిరుద్యోగులు నిరాశ చెందకుండా పుస్తక పట్టణ చేస్తూ వివిధ అంశాలపై అవగాహన కల్పించుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. రానున్న రోజులలో ఇదే తరహాలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ పాత్రలను మంత్రి అందచేశారు.

# ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

హైదరాబాద్, జనవరి 7 (ఆర్ఎన్ఎ): ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేటీఆర్‌ను అందులో ఇరికించేందుకు ప్రయత్నిస్తుందని పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజంగా కేటీఆర్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షను భరించేందుకైనా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి న్యాయపరంగా పోరాడుదామని కేటీఆర్ చెప్పారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని కేటీఆర్ సూచించారు. కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కాగా,ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చిందన్నారు. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యతంర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేస్తున్నారని తెలిపారు.



# దివ్యాంగుడికి ఉచిత ఉపకరణాలు అందజేత

**వరంగల్, జనవరి 7 (జనంసాక్షి) :** వరంగల్ చార్ బౌలి కి చెందిన ఆరవ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థి జాఫర్ అలీ బాల్యంలో పోలియో వ్యాధికి గురవడంతో నడకను కొనసాగించడం ఇబ్బందిగా మారిందని తెలుసుకున్న విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ వైద్యుల సలహా మేరకు హైదరాబాదుకు చెందిన దాతలు కవి, రచయిత తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షులు, గురజాడ శోభాపేరిందేవి సహకారంతో రూ.18000/-లు విలువ చేసే ఉపకరణాలను తయారు చేయించి సంస్థ కార్యాలయంలో విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, అనాథలకోసం గురజాడ శోభ చేస్తున్న కృషి చాలా విలువైందని పేర్కొంటూ చేయూతనందించినందుకు ఫౌండేషన్ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శైలజ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



**నస్పూర్, జనవరి 7, (జనంసాక్షి):** సింగరేణి కార్మికుల చిరకాల కోరికైన సొంతింటి కల నెరవేర్చే వరకు తమ యూనియన్ పోరాడుతూనే ఉంటుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి 3 గని ఆవరణలో సిఐటియు ఏరియా ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికులపై గుర్తింపు,ప్రాతినిత్య సంఘాలకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. స్ట్రక్చర్ సమావేశాల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు చర్చించకుండా కార్మికులను మోసం చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు సిఐటియు యూనియన్ ఎల్లవేళలా పోరాటాలు చేస్తూనే ఉంటుందని,భవిష్యత్తులో నిర్వహించబోయే ఉద్యమాలకు కార్మికులందరూ యూనియన్లకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ట్రెజరర్ కస్తూరి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి,ఆర్జీ 1 అధ్యక్షుడు రాజమౌళి,బ్రాంచ్ నాయకులు బోడకుంట శంకర్, చీకట్ల సాగర్,శ్రీపతి బానేష్, సదానందం, శ్రీధర్, శ్రీనివాస్,నరహరి,వెంకట్ రెడ్డి,రమేష్,విజయ్, ప్రతాప్,వెంకటేష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ జన్యు సృష్టికర్త మన భారతీయుడే



ఎంతో మంది శాస్త్రవేత్తల అంకితభావం, పరిశోధనల కృషి ఫలితాలే మనల్ని రాతి యుగం నుండి డిజిటల్ యుగానికి తీసుకువచ్చింది. వీరిలో మన దేశానికి చెందిన అనేక మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. వారిలో జన్యు శాస్త్రంపై పరిశోధనలు చేసి అత్యంత విలువైన 'నోబెల్ ' బహుమతిని అందుకున్న ఒక మహావ్యక్తి ఉన్నారు. ప్రపంచ జీవశాస్త్రవేత్తలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రశ్న ? ప్రయోగశాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా ? అని ! వంశపారంపర్యముగా సంక్రమించే జీవ నిర్మాణానికి దోహదం చేసే "కృత్రిమ జన్యువును"ను సృష్టించి ఈ కలను నిజం చేసి చూపించారు ఓ మహానుభావుడు ఆయనే 'హరగోవింద్ ఖొరానా'. ఈ ఆవిష్కరణ జన్యు సాంకేతికత (జెనిటిక్ ఇంజనీరింగ్) అనే నూతన శాస్త్ర అధ్యయనానికి నాంది అయింది. 2019లో ప్రపంచాన్నే గడగడలాడించిన 'కొవిడ్ వైరస్' నిర్ధారణలో ఉపయోగించే 'పిసిఆర్' పరీక్షలో ఈయన చేసిన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడ్డాయి. పిసిఆర్ పరీక్ష అంటే 'పాలిమరేజ్ చైన్ రియాక్షన్. ' ఇది వైరస్ వంటి నిర్దిష్ట జీవి నుండి జన్యు పదార్థాన్ని గుర్తించే పరీక్ష. ఈయన ప్రత్యేకంగా సృష్టించబడిన కృత్రిమ జన్యు శకలాలు (ఫ్రాగ్మెంట్స్) మానవులలో జన్యు ఆధారిత వ్యాధులను, మానవ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి, డిఎన్ఎ విశ్లేషణా వినియోగానికి కీలకమయ్యాయి.కొత్త మొక్కలు, జంతువులను క్లోనింగ్, రూపకల్పన చేయడంలో 'కృత్రిమ జన్యువు' ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. డాక్టర్ ఖొరానా వినయంతో సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి. లక్ష్యాల సాధనలో నిరాడంబరంగా ఎలా ఉండాలో మిగిలినవారికి నేర్పారు. ఖొరానా తన ఆత్మకథలో ' పేదవాడైనప్పటికీ మా నాన్న తన పిల్లలను చదివించడానికి అంకితభావం చూపారు. దాదాపు 100 మంది నివసించే గ్రామంలో మేము ఏకైక అక్షరాస్యత కుటుంబం' అని పేర్కొన్నారు.

**నోబెల్ బహుమతి :** ప్రతి అమైనో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందుపరచడి ఉన్నదని ఖొరానా కనుక్కొన్నారు. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డిఎన్ఎ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారిగా సృష్టించారు. డిఎన్ఎ ముక్కలను అతికించు లైగేజ్ ఎంజైమును కనుగొన్నారు. "జన్యు సంకేతం మరియు ప్రోటీన్ సంశ్లేషణలో దాని పనితీరు గూర్చి వివరించారు. జీవి వెలుపల ఒక క్రియాత్మక జన్యువు మొత్తం సంశ్లేషణను పూర్తి చేసారు. ఇది ఒక బాక్టీరియంలో తగిన విధంగా పనిచేస్తుందని కూడా అతను చూపించారు. ఈ పరిశోధనల మూలముగా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవము వచ్చింది. దీనికి గాను 46 యేండ్ల వయస్సులోనే 1968 లో వైద్యశాస్త్రములో మార్షల్ డబ్ల్యూ. నిరెన్‌బర్గ్, రాబర్ట్ డబ్ల్యూ హెూలీతో కలిసి నోబెల్ బహుమతి అందుకున్నారు.

89 సంవత్సరాల వయస్సులో 9 నవంబర్ 2011న మసాచుసెట్స్‌లోని కాంకార్డ్‌లో మరణించారు. ఆయన మరణానంతరం శాస్త్రీయ జర్నల్స్ "జీవశాస్త్రం ప్రాథమిక ప్రశ్నలను పరిష్కరించడానికి రసాయనశాస్త్రం, భౌతిక శాస్త్రం నుండి భావనల మార్గదర్శకుడిగా పేర్కొన్నాయి. విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక మాజీ సహెూద్యోగి ఈయన పని గురించి ' ఖొరానా రసాయన జీవశాస్త్ర రంగానికి ప్రారంభ అభ్యాసకుడు. బహుశా వ్యవస్థాపక తండ్రి. అతను ట్రైన్యూక్లియోటైడ్ల విభిన్న కలయికలపై ఆధారపడి జన్యు సంకేతాన్ని అర్థంచేసుకోవడానికి రసాయన సంశ్లేషణ శక్తిని తీసుకువచ్చాడు' అని తెలిపారు.డాక్టర్ ఖొరానా ఆయన జీవితం తరతరాల యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకం.

జనక మోహన రావు దుంగ, ఫోన్ : 8247045230

# మతోన్మాద రాజకీయాలతో బద్నామ్



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223





> కులం, మతం పిచ్చిలో ముంచి వేయడం రాజకీయ తానా షాహిల కు అలవాటు అయిపోయింది. వీరి ఉచ్చు నుంచి బయట పడి సోయి లోకి రావాలి! ఎవరికీ ఏం కావాలో తెలుసుకోవాలి! ఈరోజు దేశంలోని పెరిగిన అసమానతలు, అధికధరలు, నిరుద్యోగం గురించి పట్టదు. అన్నీ అబద్ధాలే చెబుతారు.

భారతదేశం ప్రపంచం లోనే 198 దేశాల్లో మత విద్వేషాలలో నెంబర్ వన్ దేశంగా ప్యూ రీసెర్చ్ సెంటర్ వెల్లడించింది. భారత్ తర్వాత జాబితా లో నైజిరియా, పాకిస్థాన్, సిరియాలు ఉన్నాయి. సామాజిక వర్గాలలో శత్రుత్వ భావన రెచ్చ గొట్టే రాజకీయాలు గత పది ఏండ్ల నుంచి మన దేశంలో పరాకాష్టకు ఎక్కినాయి. 198 దేశాల్లో 2022లో ఈ అధ్యయనం జరిగింది. 2021,2022 నుంచి పోల్చితే ఈ పరిస్థితి ప్రస్తుతం రాజకీయాల కారణంగా, ఓట్ల కోసం, అధికారం కోసం సిగ్గు, ఎగ్గూలేకుండా మతోన్మాద రాజకీయాలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగ్వత్ లాంటి వాళ్ళు సైతం ఈ రాజకీయాల పై అసంతృప్తి వ్యక్తం చేసిన దాఖలాలు ఉన్నాయి. ప్రతి మస్జీద్ కింద శివలింగం వెతకడం మంచిది కాదని ఆయన బహాటంగా పేర్కొంటే ఆయన మీద కొందరు స్వాములు ద్వజం ఎత్తుతారు. మరోవైపు దేశం రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన హెూమ్ మంత్రి అమిత్ షా కు బీజేపీ నేతలు సపోర్ట్ చేస్తారు. ఎన్నికల్లో గెలువడానికి ఎన్ని యాగిలో.. ఎన్ని అబద్దాలో.. భారతదేశంలో మతోన్మాద రాజకీయాలు ఎవరి కోసం? ఎందుకోసం? ఎవరిని ఉద్ధరించడం కోసం?అవును మనమంతా మనుషులు గా కలిసి ఉందాం.కులం,మతం అనే కుచ్చితాలకు,ఆ పేరుతో ఓట్లు గడించడానికి,అధికారం లో ఉండడానికి కుట్రలు, కుహకాలు చేస్తున్న వారికి దూరంగా ఉందాం.

**విభజన రాజకీయాలతో ప్రపంచంలో బద్నాం**

కేవలం విభజన రాజకీయాలతో జనాన్ని పిచ్చివాళ్ళను చేస్తూ రాజకీయ గేమ్ ఆడుతున్న వారిని,అలాంటి రాజకీయ పార్టీ లను దరికి రాకుండా,వాటి దరికి పోకుండా ఉందాం.దేశంలో వివిధ మత సంస్థల,కుల రాజకీయాలు ఇటీవల దేశం యువతను క్రికెట్ మాదిరి ఎడిక్ట్ చేస్తున్నాయి. ప్రపంచం లో భారత్ బద్నామ్ అవుతున్నది.ఎక్కడ ఏ సంఘటన, క్రైమ్ జరిగినా, దానికి అవసరం లేని, సామాజిక వర్గం యాంగిల్ వెతుకుతారు. హిందూ, ముస్లిం యాంగిల్ వెతికి మరీ వారి ఐటి సెల్ ను అలర్ట్ చేసి, టూల్ కిట్ ను పట్టుకుని తిరుగుతూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. ఆదివాసీలు, దళితుల కు, క్రిస్టియన్స్,పిడిత, తాడితులకు అసలు గౌరవం లేదు!గతం లో మధ్యప్రదేశ్ లో ఒక ఆదివాసీ మీద మూత్రం పోసిన బీజేపీ కార్యకర్త పై కేసు పెట్టి జైలుకు పంపిన విషయం విధితమే!అక్కడి వరకు ఒకే,కాని అతని తల్లి,దండ్రులు ఉండే ఇంటిని ప్రభుత్వం అప్పట్లో బుల్ డోజర్ పెట్టి కూల్చి వేసిన అమానవీయ చర్య గురించి ప్రశ్నించినోళ్లు లేరు!తప్పు తమ ఎదిగిన కొడుకు చేస్తే,ఆ శిక్ష తల్లి తండ్రులకు ఎందుకు?బీజేపీ,ఆర్ఎస్ఎస్,బజరంగ్ దళ్,సంఘ్ పరివార్ ఇలా పలు హిందూ వాద సంఘాల మతోన్మాద విధానాల వల్ల యువత వారి ఉచ్చులో పడి,కులం,మతం ఉచ్చు రాజకీయాల్లో పడి పోతున్నారు.అరాచక శక్తులు గా మారి తమ జీవితాలను జైలు పాలు చేసుకుంటున్నారు. గో రక్షణ పేరిట అతి ఆరాచకమైన రాజకీయ పావులుగా వీరు మారుతున్నారు. కుల,మతాలకు అతీతమైన భారతదేశం లో కేవలం ఇవే రాజకీయాలతో పబ్బం గడుపుకునే నేతల కు పావులుగా మారుతున్నారు. దేశంలో పదకొండు,ఏండ్ల పీఎం నరేంద్ర మోడీ పాలన లో నిరుద్యోగం భారీగా పెరిగింది.ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ కాలేదు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు.ధరలు చాలా ఎక్కువ పెరిగాయి. ఆడబిడ్డలకు రక్షణ లేదు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీల మీద దాడులు పెరిగాయి. విద్యా, వైద్యం సామాన్యునికి అందుబాటులో లేని పరిస్థితి ఉంది. అసమానతలు పెరిగాయి. పేదరికం పెరిగింది. మధ్యతరగతి కుటుంబాలు లో 35 శాతం మంది పేదరికంలోకి వెళ్ళిపోయి ప్రభుత్వం ఇస్తున్న 5కేజీ ల రేషన్ తీసుకుంటున్న పరిస్థితి ఉంది.పీఎం మోడీ ఏమో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాము అంటారు. ఒక వైపు 80 కోట్ల మంది పేదలకు ఐదు కేజీ ల ఉచిత రేషన్ ఇస్తున్నారు.




**9 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారు**

పది ఏండ్లలో 9 కోట్ల మందికి ఉద్యోగాలు ఇచ్చాము అంటారు. లెక్క చెప్పండి, అంటే చెప్పరు. అంతమందికి ఉద్యోగాలు ఇస్తే ఇంకా 23 కోట్లమంది చదువుకున్న నిరుద్యోగులు ఎందుకు ఉన్నట్లు? పేపర్ లీకులు 70 సార్లు ఈ పది ఏండ్లలో జరిగాయి. దానికి వివరణ ఉండదు. కుటుంబాలలో 65 శాతం మంది బడ్జెట్ కింద,మీద అయిపోయింది.ఫలితంగా ప్రతినెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది.ఇలా చాలా కుటుంబాలు కకా వికలం అయ్యాయి అంటే అతిషయోక్తి కాదు.కేంద్రం పిఎస్యుల ను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేయడం కూడా కొనసాగించడం వల్ల కూడా లక్షలాది మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయిన పరిస్థితి వచ్చింది.ఈ విషయాలు ఏవీ ఈ యువకులకు పట్టదు.

**కులం, మతం అంటూ గుడ్డిగా...**

గుడ్డిగా కులం,మతం అంటూ ఏమాత్రం సమాజానికి ప్రయోజనం లేని విషయాల మీద శ్రద్ధ ప్రదర్శిస్తూ వివాదాల్లో ఇరుక్కు పోతున్నారు.గతంలో కర్ణాటకలో జైన ముని హత్య కేసులో నారాయణ ఈ జైన ముని ఒకరికి డబ్బులు ఇచ్చాడు,వాటిని వాపసు అడిగినందుకు ఈ హత్య వారే చేసారు అని పోలీస్ లు అన్నారు.బాసప్ప మాది,హస్సన్ దహయాత్ పేర్లు బయటకు వచ్చాయి.ఈ హత్య ను సైతం బీజేపీ ఇప్పుడు హిందూ,ముస్లిం రంగు పూసే పరిస్థితిని కల్పించే ప్రయత్నం చేసి విఫలం అయ్యారు.నిజానికి ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే గొడవలు జరుగుతాయని హెూమ్ మంత్రి అమిత్ షా చెప్పారు.అయినా ఓటర్లు బీజేపీ ని ఓడించారు.ఒక వైపు భాగేశ్వర్ ధాంలో ధిరేన్ శాస్త్రి ఆడుతున్న నాటకాలు,భక్తుల బలహీనతలతో ఆడుకుంటున్న తీరు ను బీజేపీ నేతలు పట్టించుకోరు,పైగా అతని దగ్గరకు వెళ్లి ఆయన కాళ్లకు శాష్టాంగ నమస్కారాలు చేస్తారు. గతంలో ఉత్తరఖండ్ లో ఒక బాలిక కిడ్నాప్ ప్రయత్నం లో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో రెండు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు ఉండగా,ముస్లిం యువకుడి ని చూయించి అక్కడ ముస్లిం వ్యాపారుల దుకాణాలను బంద్ చేయించి వారు వెళ్లి పోవాలని హెచ్చరికలు చేస్తారు.చివరికి వాస్తవాలను ఆ అమ్మాయి బందువు బయటకు వచ్చి నిజం బయట పెట్టడం తో విద్వేశాలు రెచ్చ గొట్టే విద్వేశ జీవులు మౌనంగా ఉండి పోయే పరిస్థితి వచ్చింది.కరోనా సందర్భంగా తబ్లిక్ జమాత్ ముస్లిం ల మీద చాలా పెద్ద ఎత్తున విష ప్రచారం చేశారు.చివరికి కోర్ట్ వారిని నిర్దోషులుగా పేర్కొనడం తో విషయం సద్దు మణిగింది.ముస్లింలను బద్నామ్ చేసే ఒక్క చిన్న అవకాశం ను కూడా ఈ సంప్రదాయక అబద్దాలు చెప్పే,విద్వేషాలు ప్రచార అస్త్రాలు గా ఉపయోగించే ఈ తప్పుదారి పట్టించే బ్రేన్ వాష్ జీవుల ఉచ్చులో పడకుండా యువత ఉండాలి!ప్రస్తుతం అబద్దాలు ప్రతీ రోజు ట్రోల్ చేస్తూంటాయి.ఇలాంటి అబద్దాలు వ్యాపింప చేయడానికి ప్రత్యేకంగా ఒక ఐటీ వింగ్ ఉంది.వాట్సాప్ గ్రూప్ లలో ఇవి నిమిషాల్లో చెక్కర్లు కొడుతూ ఉంటాయి.ప్రతీ దినం ఇవి జరుగుతాయి.కనీసం అది అబద్ధం అని తేట తెల్లం అయ్యాక కూడా ఆ తర్వాత దాని వివరణ ఉండదు.

**యువతకు మోసం**

ఇందులోను యూత్‌నే ఎక్కువ ఉపయోగిస్తున్నారు. వారు ప్రభుత్వంను ప్రశ్నించకుండా వారిని కులం, మతం పిచ్చిలో ముంచి వేయడం రాజకీయ తానా షాహిల కు అలవాటు అయిపోయింది. వీరి ఉచ్చు నుంచి బయట పడి సోయి లోకి రావాలి! ఎవరికీ ఏం కావాలో తెలుసుకోవాలి! ఈరోజు దేశంలోని పెరిగిన అసమానతలు, అధికధరలు, నిరుద్యోగం గురించి పట్టదు. అన్నీ అబద్దాలే చెబుతారు.అబద్దాల మీద అబద్దాల, తో మభ్యపెట్టే ప్రయత్నం మరోసారి జరుగుతుంది. ఇదో పరం పర అయిపోయింది.

# విశ్వవ్యాప్తం అయిన కలుషితం, కల్తీని నియంత్రించలేమా..!

ఈ సృష్టిలో నింగి నేల ఎంత ప్రధానమో గాలి నీరు కూడా అంతే ముఖ్యమైనవి. ఈ భూమిపై నేడు కలుషితం లేని నీరు లేదు గాలి లేదు ఎందుకంటే పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త వస్తువు తయారు చేయాలంటే దాని నుండి వచ్చే వ్యర్థాలు నదులు, సముద్రాలు, గాలిలో కలుస్తూ మొత్తం కలుషితం అవుతున్నాయి. రోజు రోజుకు ఓజోన్ పొర కూడా క్షీణిస్తుంది. గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుందని పర్యావరణ నిపుణులు తెలుపుతున్నారు. దేశంలో ఆహార పదార్థాల విషయానికి వస్తే పిల్లలు తాగే పాల నుండి మాంసకృత్తుల వరకు మొత్తం కల్తీ జరుగుతుంది. ప్రస్తుతం ఫుడ్ సేఫ్టీ అధికారులు చేస్తున్న తనిఖీలలో హెూటల్స్, రెస్టారెంట్ లలో కల్తీ ఆహార పదార్థాలు వాడుతున్నట్లు బయట పడుతుంది. నాణ్యత లేని ఆహార పదార్థాలు తిని ప్రజలు అస్తవ్యస్తకు గురయ్యే ప్రమాదం ఉందని దీంతో పాటు దీర్ఘకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. కావున సంబంధిత అధికారులు నిరంతరము తనిఖీలు చేస్తూ సాధ్యమైనంత వరకు కల్తీని నియంత్రించాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే కంపెనీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉండే చూడాలి. నేడు ఫ్యాక్టరీలు, ఇంధనాల నుండి వచ్చే వాయు కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యామ్నాయంగా సోలార్, ఎలక్ట్రానిక్ వాహనాలను వాడుతూ కాలుష్య నియంత్రణకు సహకరించాలి. ఆహార కల్తీ అనేది ఆహార పదార్థాలు లేదా పానీయాలలో కలుషితాలను చేర్చి, పదార్థ పరిమాణాన్ని పెంచడానికి, వస్తువుల ధరను తగ్గించడానికి నాణ్యత లేని వాటిని వాడుతున్నారు. భారతదేశంలో కలుషితం, కల్తీ ప్రధాన సమస్యగా మారింది. ఇది ఆహారం యొక్క నాణ్యతను తగ్గిస్తూ మానవులు, జంతువులలో తీవ్రమైన అనారోగ్యాలకు మూల కారణం అవుతుంది. ఈ సమస్యలను అరికట్టడానికి ఇంకా కొత్త చట్టాలను తీసుకు వస్తూ ఉన్నటువంటి చట్టాలను తప్పక అమలు చేస్తే కొంత వరకైనా కాలుష్యాన్ని కల్తీని ఆరికట్టవచ్చు. భారతదేశంలో 1899 నుండి ఆహార కల్తీ చట్టాలు చట్టంలో ఉన్నాయి. ఇది స్వాతంత్ర్యానికి పూర్వం కాబట్టి, రాష్ట్రాలు మరియు ప్రావిన్సులు ఆహార కల్తీని నిరోధించడానికి వారి స్వంత నియమాలు నిబంధనలను కలిగి ఉన్నాయి.

రాష్ట్ర లేదా ప్రావిన్స్ – నిర్దిష్ట చట్టాలు ఏ విధమైన ఏకరూపత లేని అనేక చట్టాలు నిబంధనలున్నాయి. ఈ చట్టాలు అంతరాష్ట్ర ఆహార ప్రచార రవాణాకు అడ్డంకిగా మారింది. ఈ చట్ట, నిబంధన విశ్లేషణ శిక్ష అమలు ప్రమాణాల పద్ధతులు మధ్య వ్యత్యాసం ఉంది. ఇది ఆహార కల్తీని నిరోధించడానికి కేంద్రంగా వ్యవస్థీకృత చట్టాని తీసుకురావడానికి దోహద పడింది. 1943లో భారత ప్రభుత్వం ఆహార కల్తీ కమిటీని ఆమోదించింది. కమిటీ ఆహార కల్తీకి సంబంధించిన అంశాన్ని అధ్యయనం చేసి సమీక్షించి కేంద్ర చట్టానికి సలహా ఇచ్చింది. ఆ విధంగా ఆహార కల్తీ నిరోధక చట్టం (PFA) చివరకు 1954లో ఆమోదించింది. భారతదేశం మొత్తం ఆహార కల్తీ నిరోధక చట్టం 1954 లో విస్తరించింది. ఈ చట్టం 1955 జూన్ 15 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం కల్తీని నిర్వచిస్తూ కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గెజిట్‌లో తెలియజేయడం ద్వారా అధికారిక ప్రతినిధిని నియమించవచ్చు. నేడు జీవ నదులైన గోదావరి, తుంగభద్ర, కృష్ణ, కావేరి వంటి నదులు వ్యర్థాలతో నిండిపోయాయి అదే నీరును శుద్ధి చేసి త్రాగునీరుగా వాడుతున్నాము. పెద్ద పెద్ద ప్యాక్టరీల నుండి వచ్చిన వ్యర్థాలను నదులలో కలుపుతున్నారు అలా కలువ కుండా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. ఎక్కువ మొత్తంలో కలుషిత నీటిని వ్యవసాయానికి వాడుతున్నారు. దీంతో పంట దిగుబడి తగ్గడమే కాకుండా నాణ్యత కోల్పోతుంది. సముద్ర తీరాల వెంట కూడా సందర్శకులు వాడిన కవర్లు, వ్యర్థ పదార్థాలు ఎక్కడ అంటే అక్కడ వేస్తున్నారు సముద్ర తీర ప్రాంతాలు కూడా వ్యర్థాలతో నిండి పోయినవి. నదులు, సముద్రాలలో ఉండే జీవ రాసులు సైతం కలుషిత నీటికి మృత్యువాత పడుతున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని మన వంతుగా సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ కవర్లు వాడకుండా స్వదేశీయులు తయారు చేసిన బట్ట సంచులను ఉపయోగిస్తూ చేతి వృతుల వారు తయారు చేస్తున్న మట్టి పాత్రలు, వెదురు బొంగుతో తయారు చేసిన బుట్టలు వాడుతూ వారి ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ఆనాడు గాంధీ చెప్పినట్లు స్వదేశి వస్తువులను మాత్రమే ఉపయోగిద్దాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కలుషితం, కల్తీపై నియంత్రణకు కఠినమైన నిబంధనలు తీసుకువచ్చి సమర్థవంతంగా అమలు చేసినప్పుడే కొంత వరకైన నియంత్రించి సకల జీవరాసులను కాపాడగలము.

మిద్దె సురేష్
కవి, వ్యాసకర్త
9701209355

## అభినందనలు తెలుపుకోవడమేనా..


# శాస్త్రీయత హేతుబద్ధత ఉందా!



ప్రతి సంవత్సరం జనవరి ఒకటవ తేదీ వచ్చేలోపు యువత, వ్యాపార వర్గాల వారు, పోలీసులు, ప్రభుత్వము, న్యాయ వ్యవస్థ సమాయాత్తంకావడం..,అంతకుమించి క్లబ్బులు పబ్బులు ఈవెంట్ల నిర్వాహకులు పెద్దఎత్తున సమాయత్తం కావడం నూతన సంవత్సర వేడుకలను విజయవంతం చేయడంతో పాటు తమతమ వ్యాపారాలతో కోట్ల రూపాయలు దండుకోవడానికి చేస్తున్న కృషిని మనం గమనించవలసిన అవసరం ఉంది. కొత్త సంవత్సర సందర్భంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీ దుకాణాలు క్లబ్బులు, పబ్బులు అన్ని రకాల వేదికలు ప్రభుత్వపరంగా కొన్ని స్థావరాలు రంగురంగుల వెలుగు దివ్వలతో సంసిద్ధం కావడాన్ని గమనిస్తే దీని వెనుక రాబోయే సంవత్సరంలో ప్రతి వ్యక్తి జీవితంలో మార్పు రావాలని కోరుకునే ఆత్రుత, అంతకుమించి ఆరాటం, తపన, కమిట్మెంట్ దాగి ఉందా? లేక ఇది సాంప్రదాయబద్దంగా కేవలం ఆడంబరాల కోసం చేస్తున్న పన్నాగమా? అని ఆలోచించుకోవాల్సిన సందర్భంయిది. ప్రతి వ్యక్తి జీవితంలోనూ కష్టసుఖాలు సాధారణమైనప్పటికీ భవిష్యత్తు సంతోషంగా సుఖవంతంగా ఆత్మస్థైర్యంతో ప్రగతి దాయకంగా జరగాలని కోరుకుంటారు అందులో ఎలాంటి తప్పులేదు. అదే సందర్భంలో ఇతరులకు సంబంధించి కూడా తన మిత్రులు శ్రేయోభిలాషులు ఆత్మీయులు బంధుమిత్రులు కూడా బాగుండాలని కోరుకోవడం కూడా మానవతా వాదానికి దర్పణంగా భావించాల్సిందే. అయితే ఈ పేరుతో కొనసాగుతున్నటువంటి ఆడంబరాలు, కేకుల కటింగు, వెలుగు దివ్వెలు, టపాసులు పేల్చడం, అంతకుమించిన టువంటి క్లబ్బులు పబ్బులు ఈవెంట్ల నిర్వహణ పూర్తిగా వ్యాపార ధోరణితో జరగడం వలన పేద వర్గాలు కనీసం వాటిని కూడా చూడడానికి అవకాశం లేకుండా పోతున్నది. అయితే ఆ సందర్భాలలో మాత్రం జరుగుతున్నది ఏమైనా దేశాన్ని ఉద్ధరించే పని అంటే ఆదిలేదు.

క్లబ్బులు పబ్బులు ఈవెంట్లో జరుగుతున్నది ఏమిటి?గత సంవత్సరంలో అనుభవించిన కష్టాలు లేదా ఎదుర్కొన్న బాధలు ఇబ్బందులు అన్ని రాబోయే కాలంలో మరిచిపోవాలని దాని స్థానంలో మెరుగైన జీవితం గడపాలని ప్రతి వ్యక్తి కోరుకునే సందర్భం నూతన సంవత్సర ప్రారంభం.అయితే ప్రైవేటు రంగంలో కొనసాగుతున్నటువంటి క్లబ్బులు పబ్బులు ఈవెంట్ల నిర్వహణ అంతా కూడా వ్యాపారమయమై వందలు వేల రూపాయల టికెట్ తో నిర్వహించడం రాత్రి ఒకటి వరకు కూడా వాటిని కొనసాగించడం ఆ సందర్భంలో అనేక రకాలైన అకృత్యాలు అఘాయిత్యాలకు తెరతీయడాన్ని మనం గమనించవచ్చు. ఇక ఆడంబరాల పేరుతో మద్య పానం మత్తు పదార్థాలు వినియోగం అంతా ఇంతా కాదు. 2025 జనవరి ఒకటవ తేదీ సందర్భంగా 31 నాడు జరిగినటువంటిమద్యం అమ్మకాలు వినియోగాన్ని గమనించినప్పుడు పత్రికల్లో ప్రకటన ఆధారంగా 420 కోట్ల రూపాయల మద్యం అమ్మినట్లు ధ్రువీకరించడం అంటే ఇదేదో గొప్ప సాధించినట్టుగా పత్రికల్లో పతాక శీర్షికన రావడం సమాజాన్ని తప్పుతో పట్టించడమే.. యువతను నాశనం చేయడమే... అనారోగ్య భారతాన్ని సృష్టించడమే అవుతుంది. ఇక ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలు ముఖ్యంగా సిటీలలో కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్వహిస్తే ఏ రకమైన సామాజిక ప్రయోజనం కూడా మనకు తారసపడదు. అశ్లీల అర్ధనగ్న దృశ్యాలు, అశ్లీల సాహిత్యము, ఆడంబరాలు మాత్రమే తప్ప మానవ జీవిత విలువలు, భవిష్యత్తు కర్తవ్యాలు, గెలుపు ఓటముల పునరాలోచన, భవిష్యత్తు పైన విశ్వాసంతో పనిచేయాలనే సందేశాలు కానీ చర్చలు కానీ ఏమాత్రం కన్పడవు. కేవలం తాత్కాలికంగా సంతోషపెట్టి మత్తులో ధించి ఆకృత్యాలకు పాల్పడే విధంగా ఆకర్షణను కొనసాగించడానికి మాత్రమే

> రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద నుండి సంపన్నులు కోటీశ్వరుల వరకు కూడా మొక్కుబడి వ్యాపకంగా ఈ సందర్భాన్ని కొనసాగిస్తే లక్ష్యాలను సాధించేది ఎప్పుడు?



తోడ్పడుతున్నటువంటి ఈ కార్యక్రమాలను ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించాల్సినటువంటి అవసరం ఉంది. పెద్ద మొత్తంలో టికెట్‌తో ఈవెంట్‌ను చూడాలంటే సామాన్యులకు సాధ్యం కాదు కదా అలాంటప్పుడు ప్రభుత్వ పరంగానే గ్రామాలలో పట్టణాలలో వీధులు వాడలు వార్డుల వారీగా నూతన సంవత్సర సందర్భంగా కార్యక్రమాలను ఉచితంగా నిర్వహించి అనుభవజ్ఞ చేత ప్రసంగాలు ఇప్పించడం ద్వారా తమ జీవితాలలో రావలసిన మార్పులకు సరైనటువంటి మార్గ నిర్దేశాన్ని పొందే అవకాశం ఉంటుంది. కొన్ని రంగాలలో లబ్ద ప్రతిష్టులైన వాళ్లు, నిపుణులు, మేధావుల ద్వారా స్ఫూర్తివంతమైన ప్రసంగాలను కొనసాగించినట్టయితే ప్రజలు ప్రజాస్వామ్యవాదులు పేదలు, విద్యార్థులు యువత ఎంతో స్ఫూర్తిని పొందే అవకాశం ఉంటుంది ఆ రకంగా ఈ కార్యక్రమాలను కొత్త సంవత్సర సందర్భాన్ని ప్రయోజనాత్మకంగా తీర్చిదిద్దాలి కానీ ఆడంబరాలకు తల పెడుతూ ఉంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం మూర్ఖత్వం.

**కొత్త జీవితానికి పరస్పర శుభాకాంక్షలు :**

సాధారణంగా 31 డిసెంబర్ రాత్రి మొదలయ్యే ఈ కార్యక్రమాలు రెండుమూడు రోజులపాటు కూడా పరస్పర శుభాకాంక్షలు తెలుపుకోవడంతో కొనసాగుతుంటాయి. కేవలం మొక్కుబడిగా అభినందనలు తెలుపడం వేరు అందులోని అంతరార్థాన్ని గుర్తించడం వేరు. ప్రతి సందర్భానికి ప్రయోజనం, సార్థకత ఉన్నట్టే ఈ సందర్భాన్ని కూడా మనం వినియోగించుకోవలసిన అవసరం ఉంది. అంటే ఒకరి అనుభవాలను మరొకరు గ్రహించడం, ఒకరి వైఫల్యాలు విజయాలను సేకరించడం, తమ పొరపాట్లు తప్పిదాలను సవరించుకోవడం, గతంలో జరిగినటువంటి అపశృతులు మళ్లీ కొత్త సంవత్సరంలో జరగకుండా చూసుకోవడానికి మార్గాలను అన్వేషించడం, వీలైతే ఇతరుల ద్వారా సలహాలను స్వీకరించడం, గత సంవత్సరం చేసినటువంటి తప్పులు ఏమైనా ఉంటే వాటిని పూర్తిగా ప్రక్షాళన చేసుకోవడానికి మనస్ఫూర్తిగా ప్రకటించడం వంటి కార్యక్రమాలతో ఈ నూతన సంవత్సర వేడుకలు జరగాల్సినటువంటి అవసరం ఉంది.విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలవారు, యువత, వృద్ధులు, మహిళలు, రచయితలు, కవులు, కళాకారులు, రైతులు, శ్రామికులు, విభిన్న వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూనే రాబోయే కాలంలో మరింత స్ఫూర్తివంతమైన జీవితాన్ని పొందడానికి, హక్కులను సాధించు కోవడానికి, బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి, అవసరమైతే చట్టబద్ధంగా పాలకులను ప్రశ్నించడం ద్వారా రాజ్యాంగబద్ధమైన హక్కులను పొందడానికి సంసిద్ధమై ఉమ్మడిగా సమాయత్తం కావలసిన సందర్భం కూడా ఇది.

ప్రణాళికలు ఏమిటి? లక్ష్యాలు, ఆచరణకు సంబంధించినటువంటి కార్యక్రమాలను ప్రకటించుకోవడం కూడా ఈ రోజున జరగాల్సిన అవసరం. కానీ ఇలాంటి అంశాలు ఏమీ లేకుండా కేవలం మద్యం తాగడం, మత్తు పదార్థాలతో ఊరేగడం, మాంసాహారంతో ప్రతి కుటుంబం కూడా వందలు వేల రూపాయలను ఖర్చుచేసి ఆడంబరంగా గడపడానికి మాత్రమే వెచ్చిస్తే కేవలం మొక్కుబడిగా లక్ష్యము లేని క్షణకాల ప్రయోజనాన్ని మాత్రం ఆశించే వ్యక్తులుగానే మిగిలిపోతారు.అసమానతలు, అంతరాలు, దోపిడీ పీడనతో అనేక రకాలుగా విచ్ఛిన్నమైనటువంటి సామాజిక వ్యవస్థను కనీసం ఈ సందర్భంగా నైనా ప్రస్తావన చేసుకోవడం ద్వారా మనుషులందరూ సమానమే, మానవతా విలువలను మనం సంతరించుకోవాలి, తోటి మనిషిని సాటి మనిషిగా చూడగలగాలి, పేదరికం నిర్మూలించే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలి. ఆవైపుగా యువత ప్రభుత్వాలను ప్రశ్నించాలి, చట్టసభల్లో అలాంటి చర్చలు జరగాలి అని కోరుకునే యువత విద్యార్థులు ఉపాధ్యాయులు మేధావులు ఈ రోజున శపథం తీసుకోవాల్సిన అవసరం కూడా ఎంతో ఉన్నది.ఇలాంటి కనీసమైన టువంటి ఆలోచన ఏదీ లేకుండా రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద నుండి సంపన్నులు కోటీశ్వరుల వరకు కూడా మొక్కుబడి వ్యాపకంగా ఈ సందర్భాన్ని కొనసాగిస్తే లక్ష్యాలను సాధించేది ఎప్పుడు? ప్రణాళికలు అమలుచేసి కొత్తదనాన్ని సాధించడం అసాధ్యమే కదా! అంటే చుక్కాని లేని నావలా ప్రయాణించే మానవ జీవితాలకు నూతన సంవత్సర సందర్భం ఒక మార్గాన్ని గమ్యాన్ని లక్ష్యాన్ని నిర్దేశించే విధంగా నిర్వహించుకోవ డానికి ఇకనుండి అయినా వ్యక్తులు శక్తులు, సంఘాలు, సమూహాలు చివరికి ప్రభుత్వాలు ప్రైవేటు సంస్థలు పూనుకుంటే మంచిది.



డాక్టర్.రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** రహదారి భద్రతపై జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విస్తృతంగా అవగాహన కార్య క్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టరు సిక్తా పట్నాయక్ ఆదే శించారు. గత నవంబరులో జరిగిన రోడ్ సేఫ్టీ మీటింగ్ లో చర్చించిన అంశాలు, చేపట్టిన పనుల గురించి శాఖల వారీ గా అధికారులను అడిగి తెలు సుకున్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జరిగిన రోడ్ సేఫ్టీ సమా వేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి జిల్లా కలె క్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో రోడ్డు ప్రమాదా లను నివారించేందుకు అధికా రులు చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ తో సమావేశానికి రావాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లా డుతూ పోలీసు శాఖపరంగా రోడ్డు భద్రత పై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల వారీగా చేప్పట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లాలోని 6 బ్లాక్ పాయింట్లను గుర్తించ డం జరిగిందని అందులో మాగనూరు మండలం గుడే బల్లూరు, మక్తల్ పట్టణం, మరికల్, పెద్ద చింతకుంట, అప్పంపల్లి, కోస్గి మండలం లోని నాచారం ఉన్నాయని తెలిపారు. అలాగే ఈ నెల 10న జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత పై అన్ని శాఖల అధి కారులు, పాఠశాల కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించాలని, ఈ నెల 18న జిల్లాలోని మక్తల్ నియో జకవర్గ కేంద్రంలో ఆటో డ్రైవ ర్లు, కమర్షియల్ టాక్సీ డ్రైవ ర్లకు ఓ ఫంక్షన్ హాల్లో పెద్ద ఎత్తున అవగాహన సదస్సు ను నిర్వహించేందుకు సమా వేశంలో కలెక్టర్, ఎస్పీ నిర్ణ యించారు. అదేరోజు ఆర్టీసీ డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మి ని కలె క్టర్ ఆదేశించారు. అయితే జిల్లా కేంద్రంతోపాటు, మక్తల్ కోస్గి సర్కిళ్ల పరిధిలో సీసీ కెమెరాల నిఘాతో పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. వైర్ లెస్ కెమెరాలను ఏర్పా టు చేసేందుకు కృషి చేస్తు న్నామని చెప్పారు. శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాల గురించి ఆరా తీసిన కలెక్టర్ కేవలం ఆర్టీవో కార్యాలయం పరంగా అవగాహన కార్యక్ర మాలు చేసి వదిలేస్తే ఎలాగని ఆర్టీవో మేఘా గాంధీని ప్రశ్నిం చారు. ఏదైనా కార్యక్రమం చేసే ముందు సంబంధిత శాఖల అధికారులకు సమా చారం ఇచ్చి వారిని ఆయ కార్యక్రమాలలోభాగస్వాములను చేయాలన్నారు. అలాగే ఆర్టీసీ పరంగా చేపట్టిన కార్య క్రమాల గురించి ఆర్టీసీ డీపో మేనేజర్ లావణ్య రోడ్డు భద్ర తా మాసోత్సవాల రోజూ వారి కార్యక్రమ ప్రణాళిక ను చదివి వినిపించారు. ఆర్టీసీ పరంగా చేపట్టిన అవగాహన కార్యక్రమాల ప్రచారం తక్కు వగా ఉంటుందన్నారు. ఇకపై చేపట్టే కార్యక్రమాలకు డిపి ఆర్ఓ కు సమాచారం ఇచ్చి విస్తృతంగా ప్రచారం చేయా లని డిపో మేనేజర్ కు సూచిం చారు. విద్యాశాఖ పరంగా అన్ని ఉన్నత పాఠశాలలలో కళాశాలలో రోడ్డు భద్రత పై విద్యార్థులకు విస్తృత అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని డీఈఓ గోవిందరాజులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ అధి కారిని శాలిని మాట్లాడుతూ జాతీయ రహదారిపై హైమాస్ట్ లైఫ్ లో ఏర్పాటు కోసం ప్రతి పాదనను పంపించడం జరి గిందని, మక్తల్ పరిధిలోని ఎన్ హెచ్ పై వాహనాలను పార్కింగ్ చేయకుండా పోలీ స్ అధికారులు చర్యలు తీసు కోవాలని కోరారు. మక్తల్ నుంచి నారాయణపేట రోడ్డు మరమ్మతులు చేపట్టడం జరిగిందని, అలాగే మాగనూరు రోడ్డుపై గుంతలను పూడ్చడం జరుగుతుందని ఆర్ అండ్ బి డి. ఈ. రాము లు కలెక్టర్‌కి తెలిపారు. పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లకు కూడా మరమ్మతులు చేస్తున్నామని, కల్వర్టులను నిర్మిస్తున్నామని పిఆర్ఈఈ హీర్యా నాయక్ తెలిపారు. ఇకపై ప్రతి నెలా రెండో శనివారం రోడ్ సేఫ్టీ సమావేశాన్ని తప్పక నిర్వహించాలని కలెక్టర్ ఆర్అండ్ బిడి. ఈని ఆదేశించారు. సమావేశంలో సీఐలు శివశంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ స్కేటింగ్ జాతీయ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు




**కాప్రా, జనవరి 7 (జనంసాక్షి) :** ఈనెల 31న మధురైలో జరగనున్న స్పీడ్ స్కేటింగ్ జాతీయ పోటీలకు విద్యార్థులు అర్హత సాధించారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాపుల లేక్ వద్ద గల స్కేటింగ్ స్టేడియంలో నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ పోటీలలో విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొనడానికి అర్హత సాధించారు. హైదరాబాద్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కాప్రా లో నిర్వహించిన వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్ ఏడు సిల్వర్ మెడల్స్, రజతం పథకాలను సాధించారు. జాతీయ స్థాయికి విద్యార్థులను తయారుచేసిన ఘనత విద్యార్థుల పట్టుదలకు కృషికి కోచ్ల పరిశ్రమకు తార్కానమని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ వినోద్ కుమార్ బంగ పేర్కొన్నారు. జాతీయస్థాయిలో సైతం విద్యార్థులు పథకాలను సాధించడం కోసం కృషి చేస్తున్నామని తెలంగాణ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తరుణ్ కిషోర్ పేర్కొన్నారు. చైర్మన్ ఆదిశేషారెడ్డి శ్రీకర్ వైస్ ప్రిన్సిపల్ మానస చౌదరి కేటింగ్ కోచ్ పవన్ కళ్యాణ్ లో మెడల్స్ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

## తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్..



**షాద్‌నగర్, జనవరి 7 (జనంసాక్షి) :** మీకంటే నిరుపేద కుటుంబం నుండే వచ్చిన గుడిసెలో నివాసం ఉంటూ కూలినాలి చేసుకొని బ్రతికిన ఎవరికి చేయి చాచలేదు కాయ కష్టం చేసుకుని జీవనం సాగించిన ఒక్కరోజు తిండితిని కడుపు మంటతో చదువుకున్న నడుచుకుంటూ వెళ్లి చదువుకునే వారిమి అని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తన సొంత ఖర్చులతో కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు సుమారు 800 మంది విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం పెట్టాలని దృఢ సంకల్పంతో నిర్ణయం తీసుకొని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను నిరుపేద కుటుంబం నుండే వచ్చిన వ్యక్తినని ఆకలితో ఎవరు బాధపడకూడదని కడుపు మంట ఎలా ఉంటుందో తనకు తెలుసునని తాను చదువుకునేటప్పుడు ఒక్కరోజు ఒక్క పూట తిండి తిని చదువుకున్నానని నడుచుకుంటూ వెళ్లి తన చదువును కొనసాగించానని అన్నారు విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తేవాలని అన్నారు ఎంతో మంది ప్రభుత్వ పాఠశాల ప్రభుత్వ కళాశాలలో చదువుకొని గొప్ప గొప్ప మేధావులు స్థాయికి ఎదిగారనీ అన్నారు.

## తాగునీటి సమస్యలపై భారాస వినతిపత్రం



**రాజేంద్రనగర్, జనవరి 7 (జనంసాక్షి) :** మణికొండ భారాస ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో మంచినీటి సమస్యలపై మంగళవారం జలమండలి అధికారులకు వినతి పత్రం అందజేశారు. హుడా కాలనీ లాల్లమ్మ గార్డెన్ కూడలి, అంజలి గార్డెన్ ల వద్ద త్రవ్వి వదిలేసిన రహదారుల నిర్వహణ సరిచేయాలని, కాండిట్, సుందర్ గార్డెన్ లీకేజీలు లేకుండా సరిచేయాలని భారాస అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో జల మండలి అధికారులు డి,ఇ ఏ.ఈ లను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రూపా రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, గుట్టమీది నరేందర్, జి.విఠల్, సంగం శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్, కిరణ్, షేక్ ఆరీఫ్, అరిఫ మహమ్మద్, బొడ్డు శ్రీధర్, విజయలక్ష్మి, సుమ, తిరుపతి తది తరులు పాల్గొన్నారు.

## పద్మశాలి టౌన్ షిప్ అభివృద్ధికి కృషి చేస్తా. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, జనవరి 7 (జనంసాక్షి) :** పద్మశాలి టౌన్ షిప్ అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అన్నారు. మంగళ వారం డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్ షిప్ లో స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి గారితో కలిసి ఎమ్మెల్యే కాంపౌండ్ వాల్ కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ అభివృద్ధికి తాము కృషి చేస్తానని, తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, డి ఇ బాలకృష్ణ ఏఇ కీర్తి,పద్మశాలి టౌన్ షిప్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, భరత్, చంద్ర శేఖర్ రెడ్డి, మురాలి, గణేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పోస్టల్ స్టాంప్‌పై అవగాహన కలిగి ఉండాలి







● మూడు రోజులపాటు ప్రత్యేక స్టాంపుల ప్రదర్శన

● వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** విద్యార్థులు చిన్నతనం నుండే పోస్టల్ స్టాంప్ లపై అవగాహనా కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారము వికారాబాద్ మునిసిపల్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో పోస్టల్ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రోజులపాటు జరిగే ప్రత్యేక స్టాంపుల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జనవరి 7 నుంచి 9వరకు అనంతగిరి ఫెక్స్ పేరిట తపాలా శాఖ ప్రత్యేక స్టాంపుల ప్రదర్శనను నిర్వహిస్తుందని, జిల్లా లో మొట్టమొదటి సారిగా ఫిలాసఫీ ఎక్స్ బిషన్ మూడు రోజుల పాటు ఏర్పాటు చేయడము జరిగిందని, ఎస్ ఎ రైటింగ్ ,క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగము చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నిత్య విద్యార్థులే, నేను కూడా నిత్య విద్యార్థి మాదిరి తెలుగు, కన్నడ భాషలు నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను. మొదటగా సంస్కృతం నేర్చుకొన్నాను. సికింద్రాబాద్ డివిజన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టల్ శాఖ వారి అనంతగిరి పేక్స్ పేరిట కార్యక్రమం ఎన్నో విషయాలు నేర్పిస్తుందని అన్నారు. నా పదవ తరగతిలో వున్నప్పుడు మా పెదనాన్న ఇళ్ళు ఖాళీ చేసే సమయం లో వారి దగ్గర ఒక పుస్తకం చూసి ఆశ్చర్య పోయాను. ఆ పుస్తకం లో దాదాపు 100 స్టాంప్ లు చూసి ఎన్నో విషయాలు అవగాహనా తెచ్చుకోడానికి 30 నుండి 40 రోజుల వరకు సమయం పట్టిందని , నా చిన్నతనంలో సంవత్సరములో రెండు సార్లు పోస్ట్ కార్డు, స్టాంప్ చూసే వాడినని, ఒకటి రక్ష బంధన్, రెండు దసరా పండుగలకు మా బంధువుల నుండి శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టల్ కార్డ్స్ వచ్చేవని, అప్పటికి ఇప్పటికి చాలా మార్పులు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు అందరు చిన్న తనం నుండే పోస్టల్ స్టాంపుల పై పూర్తి అవగాహనా కలిపించుకోవాలని, అందరు ఇలాంటి కార్యక్రమాలు వీక్షించి, మీతోటి వారికి అందరికి తెలిపి ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అనంతగిరి ఫెక్స్ లోగో తపాలా శాఖ అధికారులతో కలసి ఆవిష్కరణ చేశారు. తదుపరి గత కొంత కాలం నుండి సేకరించి ఏర్పాటు చేసిన ఫిలాసఫీ ఎక్స్ బిషన్ ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఎం బి ప్రసాద్, శ్రీనివాష్ పోస్టల్ శాఖ సిబంది , కేశవా రెడ్డి, న్యు గీతాంజలి, మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమం




● ప్రకటించిన గ్రాన్యూల్స్ ఇండియా, ఏఐజి హాస్పిటల్స్

**ఖైరతాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, ఏఐజి హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో తమ 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్' మొబైల్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వర్గాల ప్రజలకు అందించడానికి విస్తరింపజేస్తు న్నట్లు ప్రకటించాయి. ఏషియన్ మెడికల్ ఫౌండే షన్, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్‌ల సహకారంతో చేప ట్టిన ఈ కార్యక్రమం, సామాజిక-ఆర్థిక స్థితితో సం బంధం లేకుండా మహిళలందరికీ రొమ్ము క్యాన్సర్ నివారణ ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడానికి ఒక ముఖ్యమైన ముందడుగు దశను సూచిస్తుంది. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ యొక్క అత్యాధునిక సౌకర్యాలు, బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కోసం తాము రూపొందించిన కార్యాచరణ, ముందస్తుగా గుర్తించే సమగ్ర విధానా న్ని ప్రదర్శించారు. విలేకరుల సమావేశంలో మేడ్చ ల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, డాక్టర్ టి.రఘునాథస్వామి, అధునాతన రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను జిల్లాలోని మహిళ లందరికీ నేరుగా అందించడానికి రూపొందించిన కార్యక్రమాన్ని వివరించారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాతో మొ దలుపెట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ కార్యక్రమంను విస్తరించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. అవసరమైన స్క్రీనింగ్ సేవలను నేరుగా గ్రామీణ వర్గాల చెంతకు తీసుకు రావడం ద్వారా, మేము రొమ్ము ఆరోగ్యంపై అవగా హన పెంచుతూ ఆరోగ్య సంరక్షణకు అడ్డంకులను తొలగిస్తున్నామని అన్నారు. ఏఐజి వద్ద కన్సల్టెంట్ బ్రెస్ట్ ఆంకాలజిస్ట్, యుసి బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థా పకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి ఈ కార్యక్రమం యొక్క వైద్య ప్రాముఖ్యతను వివరించారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** నిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర దారుఢ్యంతోపాటు, మానసిక ఉల్లాసం పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం మైదానంలో జన మైత్రి, రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ అధికారుల జట్టు, మీడియా ప్రతినిధుల జట్లు తలపడ్డాయి. రసవత్తరంగా సాగిన ఈ పోరులో ఏడు పరుగులు తేడాతో మీడియా జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన వారికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.

### ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు జీపు ప్రారంభం

అనంతరం జిల్లాలో రోడ్డు భద్రత కోసం, ట్రాఫిక్ నియంత్రణకై పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన జీపును జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించే విధంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జనవరి నెలను జాతీయ రోడ్డు భద్రత మాసంగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో రోడ్డు భద్రత కు సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. బైక్ పై వెళ్లేటప్పుడు హెల్మెట్, కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి 8న సాయంత్రం నాలుగు గంటలకి కలెక్టరేట్ ఐడిఓసి నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్ల చెరువు వరకు చేరుకొని ర్యాలీ ముగిస్తుందని చెప్పారు. అందరికీ రోడ్డు భద్రత అవగాహన కల్పించేలా ప్రజలు, యువత బైకు హెల్మెట్‌తో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాను యాక్సిడెంట్స్ రహిత జిల్లా గా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, డిపిఆర్ఓ సీతారాం, డివైస్ ఓ సుధీర్ రెడ్డి, డిఇఓ అబ్దుల్ ఘని, ఇండస్ట్రీస్ అధికారి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు అనుమతులు ఇవ్వాలి

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయాక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** జిల్లా పరిశ్రమల శాఖకు దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులోపు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన టీజీ ఐ పాస్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నెల నెలా క్రమం తప్పకుండా సమా వేశాలు ఏర్పాటు చేయాల న్నారు. చివరగా టీజీ ఐపాస్ సమావేశం ఎప్పుడు జరిగిందని సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. సమావేశపు ఎజెండాలోని వివిధ అంశాల గురించి పరిశ్రమల శాఖ జిఎం మహేశ్వర్ కలెక్టర్‌కు వివరించారు. టీజీ ఐపాస్ కింద గత నవంబరు 7వ తేదీ నుంచి ఈ నెల 6 వరకు పరిశ్రమలకై 14 అనుమ తుల కోసం సంబంధిత శాఖలలో దరఖాస్తు చేసుకోగా వాటిలో 9 అనుమతులు మంజూరయ్యాయని, 2 ప్రాసెస్‌లో ఉన్నాయనీ, ఒకటి తిరస్కరించబడిందని, మిగతా 2 అభ్యంతరాలు ఉన్నా యని జీ.ఎం. తెలిపారు. అలాగే టీ ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లకు చెందిన 17 దరఖాస్తుదారులకు సబ్సిడీ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్టీవో మేఘా గాంధీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్, ఐ పీ వో నర్సింగ్ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ. అబ్దుల్ ఖలీల్, లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి, సబ్ రిజిస్టార్ రామ్ జీ, భూగర్భ జల శాఖ సీనియర్ అసిస్టెంట్ చైతన్య కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ రెడ్డి, మైనింగ్ శాఖ ప్రతాప్ రెడ్డి, కమర్షియల్ టాక్స్ అధికారి తాజుద్దీన్, కార్మిక శాఖ అధికారి తిలక్, తదితరులు పాల్గొన్నారు.

# భూమిలేని నిరుపేదలకు సైతం 12 వేల రైతు భరోసా..

- వ్యవసాయోగ్యమైన ప్రతి ఎకరాకు భరోసా అందుతుంది
- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





**వనపర్తి బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను పెద్ద జీతగాడిలా అహర్నిశలు పనిచేసి నియోజకవర్గ అభివృద్ధిలో మెఘా మార్కును చూపిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 473 మంది లబ్ధిదారులకు రూ. 1,12,47,500 విలువగల %జవీ=ఖీ% చెక్కులను, 215 మంది లబ్ధిదారులకు 2,15,24,940 విలువగల కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,10 లక్షల విలువ గల ఆరోగ్య శ్రీ పథకం, 200 యూనిట్ల విద్యుత్ ఉచితం, 500 కే వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ, రైతు రుణమాఫీ, లాంటి పథకాలు ఏ పార్టీకి అమలు అయ్యాయని,మరి కొద్ది రోజుల్లోనే వ్యవసాయోగ్యమైన సాగుభూమికి ప్రతి ఎకరాకు, భూమి లేని నిరుపేదలకు సైతం ఎకరాకు రూ 12000 చొప్పున అందజేయను ఉన్నామని చెప్పారు.మహిళలను మహారాణులను చేసేందుకు ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఈ క్రమంలోనే ఆర్టీసీ బస్సుల కొనుగోల్ల లోను విద్యార్థులకు బట్టలు కుట్టడంలోనూ వంట చేసే కార్యక్రమాలను మహిళలను భాగస్వామ్యం చేస్తుందని తెలిపారు.వనపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే 673 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.వనపర్తి జిల్లా కేంద్రంలో ఇప్పటికీ సొంతభవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు ఎన్నో ఉన్నాయని వాటన్నింటికీ సొంతభవనాలు నిర్మిస్తామని తెలిపారు. ఎలక్షన్ సమయంలో చెప్పినట్లుగానే తాను నిజాయితీగా నికార్సైన నాయకుడిగా పని చేస్తానని తప్పు చేస్తే చూపించాలని తలవంచుకొని పనిచేస్తారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో క్యాంపు కార్యాలయంలోకి ఎవరిని కూడా అనుమతించేవారు కాదని నేడు క్యాంపు కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొనడం సంతోషకరంగా ఉందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బలపరిచే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని, ఇతర వారికి అవకాశం ఇస్తే అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మన అభ్యర్థులను గెలిపించేందుకే కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మహిళలతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.మహేష్,వైస్ చైర్మన్ పి.కృష్ణ వనపర్తి పట్టణ, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చర్లపల్లిలో 'గ్రాండ్ ఇండస్ట్రీయల్ కాన్‌క్లేవ్'

- ప్రత్యేక ఉత్పత్తులతో ఆకట్టుకున్న ఎక్స్‌పో




**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** బీఎన్ఐ గ్రాండ్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామిక సంఘం హాలులో 'గ్రాండ్ ఇండస్ట్రీయల్ కాన్క్లేవ్' నిర్వహించారు. ఈ కాన్క్లేవ్‌లో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ 2.0 చాలెంజెస్, ఆపర్చ్యునిటీస్ వే అహెడ్' అనే అంశంపై ప్రత్యేకమైన ప్యానల్ చర్చ జరిగింది. ఈ చర్చలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) రంగంలో వ్యాపార వృద్ధి, వ్యూహాలు అన్వేషించడంపై దృష్టి సారించారు. ఈ ప్రతిష్టాత్మక ప్యానల్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ జే శ్రీనివాస్, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ నారాలా, నిచ్‌బ్రెయిన్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో లక్ష్మీ నరసింహమూర్తి, బిజ్‌రైట్స్ ఐపీ పార్ట్నర్స్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకుడు వీ రాజేష్, బ్రిడ్జ్‌గ్యాప్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు విపిన్ సింగ్, దియోస్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సందీప్ రెడ్డి, సింఫిన్స్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు హరి సూర్య తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చను ప్రముఖ మోడరేటర్, లిటిల్ స్పార్క్స్ గ్లోబల్ వ్యవస్థాపకుడు టీ సతీష్ కుమార్ సమర్థవంతంగా నడిపించారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ మెడ్చల్ సిద్దిపేట జోనల్ మేనేజర్ ఎం అనురాధ, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు గోవింద రెడ్డి, సీఐఏ కార్యదర్శి కే చంద్రశేఖర్ రెడ్డి, బీఎన్ఐ గ్రాండ్ వైస్ ప్రెసిడెంట్ రఘువర్, బీఎన్ఐ గ్రాండ్ కార్యదర్శి ప్రశాంత్ గార్లపాటి తదితరులు పాల్గొన్నారు.

## మరింత కష్టపడాలి... సత్వర సేవలందించాలి

- ఉద్యోగులకు ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ సూచన




**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్, టీజీవో, టీఎన్జీవో, ఫైనాన్స్ వింగ్ డైరీ, టేబుల్ క్యాలెండర్లను ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వినియోగదారులు ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది జలమండలి ఉద్యోగులు, సిబ్బంది అంతా కఠిన పరిస్థితులు ఎదుర్కొని నిలిచారన్నారు. వేసవిలో తాగునీటి డిమాండ్ ను సమర్థంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. జలమండలి ఉద్యోగుల విధి నిర్వహణలో రోజూవారీ సమస్యలను పరిష్కరించే పరిస్థితి ఉందని, ఉన్న శక్తి మొత్తం అందుకే ఖర్చవుతుందని అభిప్రాయపడ్డారు. దీని వల్ల ఇతర పనులపై దృష్టి సారించలేకపోతున్నట్లు చెప్పారు. రోజూవారీ సమస్యల్ని పరిష్కరించే బదులు.. అసలు వాటిని శాశ్వతంగా పరిష్కరించడమే ఉత్తమని యోచించి ఒక డ్రైవ్ మోడ్ లో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

# నార్సింగ్‌లో రూ.5.60 కోట్లతో అభివృద్ధి పనులు

- ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జనవరి 7 (జనంసాక్షి) :** నార్సింగ్ మున్సిపాలిటీని అభివృద్ధి లో పరుగులు పెట్టిస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రూ.5కోట్ల 60 లక్షలతో పలు అభివృద్ధి పనుల చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ లతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధి పనులు మంచిరేవుల లోని ఇంద్రమ్మ కాలనీ లో రూ.1 కోటి తో యుజిడి, విడిసిసి రోడ్ , మంచిరేవుల లోని ఇంద్రమ్మ కాలనీ లో రూ.30 లక్షలతో స్మశాన వాటిక అభివృద్ధి , మంచిరేవుల లో రూ.30లక్షలతో రోడ్డు బిజెఆర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం , మంచిరేవుల లో రూ.30 లక్షలతో అంబేత్కర్ కమ్యూనిటీ హల్ నిర్మాణం ,నర్సింగ్ లోని బాలాజీ నగర్ లో రూ . 2 కోట్లతో డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం, విడిసిసి రోడ్ నిర్మాణం కొరకు రూ .15 లక్షలు , మంచిరేవులా లోని 10వ వార్డ్ లో స్మశాన వాటిక అబివృద్ధి కొరకు రూ. 1 కోటి , సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుండి వైఎస్ఆర్ విగ్రహం వరకు డివైడర్ నిర్మాణ పనులకు రూ. 40 లక్షలు, గండిపేట్ సర్కిల్ వరకు వీధి దీపాల కొరకు రూ.15 లక్షల వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల విజయ్ , నార్సింగి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ కోట వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ , పిసిసి ప్రతినిధి ఎం. జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు పత్తి శ్రీకాంత్ రావు , పత్తి ప్రవీణ్ , కె లక్ష్మీ ప్రవల్లిక కిరణ్ , గోపాల సునీత గణేష్ కుమార్ , అమరేందర్ రెడ్డి , లంకల పద్మ , ఉషారాణి , నరేష్ మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి ,డిఈ నరేష్ కుమార్ , మేనేజర్ యోగేష్ ,ఎఇ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మద్దిగట్లలో రైతుల వినూత్న నిరసన

**వనపర్తి, జనవరి 7 (జనంసాక్షి) :** ఎకరాకు రూ15వేలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని పెద్దమందడి మండలం మద్దిగట్లలో రైతులు మంగళవారం వినూత్న నిరసనలు చేపట్టారు.యాసంగి వరిమళ్ళలో నాట్లు వేస్తున్న రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల ఆందోళనలకు సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతు భరోసా 15 వేల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పెద్దమందడి మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్,మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ శ్రీనివాస రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్,బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినితో వెట్టి చాకిరి




**బషీరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ ముందు ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థిని చేత మంగళవారం రోజున ఉదయం పూట పాఠశాల ఆవరణలో చీపురుతో చెత్తను ఊడిపిస్తున్నారని స్థానికులు తెలిపారు.పాఠశాలకు విద్యార్థిని,విద్యార్థులను చదువుకోవడం కోసం పంపిస్తే ఇలాంటి పనులను చేయిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల అంటేనే అలుసు అయిపోయిందని, చేతిలో పుస్తకాలు పట్టే వయసులో విద్యార్థిని,విద్యార్థులు చేత చీపుర్లతో ఇలాంటి పనులు చేపియ్యడం ఎంతవరకు సమన్వయమని ఇలాంటి వారి పైన ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పారదర్శక రెవెన్యూ పాలనే లక్ష్యంగా జిల్లాను ప్రథమస్థానం నిలపాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** పారదర్శక రెవెన్యూ పాలనే లక్ష్యంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తాసిల్దార్లను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ పారదర్శక పాలన పై ధరణి,ల్యాండ్ కే సులు, కోర్టు కేసులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఫారెస్ట్ భూ సమస్యలు, సంబంధిత అంశాలపై తాసిల్దారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల్లో భాగంగా ఆర్డీవోలు, తహసీల్దార్ స్థాయిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల్లోని మ్యుటేషన్, పీఓబీ, సక్సెషన్, కోర్టు కేసులు, టీఎం 33 మాడ్యూల్స్ ల పరిష్కారంలో వేగం పెంచి సత్వరమే పూర్తిచేయాలని సూచించారు. అలాగే వాటికి సంబంధించిన రికార్డులను సరైన విధంగా పరిశీలించి, ఆ ఫైల్ లను తిరిగి పంపించాలని ఆదేశించారు. అదే విధంగా ఆయా భూములకు చెందిన సంబంధిత పత్రాలతో పాటు ఫీల్డ్ పొజిషన్ నివేదిక తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జై చంద్ర రెడ్డి, సంబంధిత తాసిల్దార్లు పాల్గొన్నారు.

## మెట్రో ప్రయాణికులకు హెల్త్ ప్యాకేజీ

- ఇన్‌కార్న్ సంస్థ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి




**కూకట్‌పల్లి, జనవరి 7 (జనంసాక్షి) :** మెట్రో రైలులో ప్రయాణించే వారికి 399 రూపాయలతో కూడిన ఈసీజీ, చెస్ట్ ఎక్స్ రే, సి.బి.పి, ఆర్.బి.ఎస్ డాక్టర్ కన్సల్టెంట్ తో కూడిన హెల్త్ ప్యాకేజీను అందిస్తున్నట్లు ఇన్ కార్న్ సంస్థ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రైల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెట్రో అధికారులు ఓమ్ని హాస్పిటల్స్ యాజమాన్యం సంయుక్తంగా రాయితీలు కల్పించనున్నట్లు చెప్పారు. మంగళవారం కూకట్పల్లి ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో మెట్రో స్టేషన్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిబి రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులతో పాటు సంస్థ పనిచేసే కార్మికులకు పలు రకాల సేవలు అందించేందుకు ముందుకు వచ్చామని చెప్పారు. అలాగే ఇకనుండి కూకట్ పల్లి మెట్రో స్టేషన్ కు సంబంధించి ఓమ్ని హాస్పిటల్స్ కూకట్ పల్లిగా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్రో రైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లోకేష్ ,ఓమ్ని గ్రూప్ డైరెక్టర్ పూర్ణిమ రెడ్డి, ఓమ్ని హాస్పిటల్ సీఈవో దుర్గేష్ శివ, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అంకిత్ షా, యూనిట్ హెడ్ మెడికల్ సూపర్డెంట్ వారీస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డిస్ట్రిక్ట్ ఎక్స్‌పోర్ట్ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయండి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** డిస్టిక్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ ను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ప్రిన్సిపల్ ప్రైవేట్ సెక్రటరీ కెవిఎస్ శైలజ,లాజిస్టిక్ ఇండస్ట్రీస్ కామర్స్ రీజినల్ డైరెక్టర్ అపర్ణ, డిప్యూటీ డైరెక్టర్ సుదీప్ పాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్ పోర్ట్ ఆర్గనైజర్ కులకర్ణి, నాబార్డ్ అధికారి షణ్ముఖ చారి తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నారాయణపేట జిల్లా నుంచి విదేశాలకు ఎక్స్ పోర్ట్ చేసే వివిధ ఉత్పత్తుల గురించి చర్చించారు. జిల్లాలో ప్రధానంగా వరి ధాన్యం, పత్తి, హ్యాండ్లూమ్ (కాటన్ సిల్క్, జరీ) ఎక్స్ పోర్ట్ చేసేందుకు నిర్ణయించారు. అందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాకు చెందిన సంబంధిత అధికారులకు సూచించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాలో వంద ఎకరాలలో మునగ ఆకు కూడా సాగు చేస్తున్నారని, దాని పొడిని కూడా ఎక్స్ పోర్ట్ చేసే అవకాశం ఉంటే పరిశీలించాలని కోరారు. ఒక్కో జిల్లా నుంచి ఒక్కో ఉత్పత్తిని ఎక్స్ పోర్ట్ చేసే అవకాశం ఉందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మహేశ్వర్ తెలిపారు.జిల్లాలో శీతాఫలాల ప్రాసెసింగ్ కూడా జరుగుతుందని ఆ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలనీ నాబార్డు అధికారి షణ్ముఖ చారి వీసీ ద్వారా కలెక్టర్ ను కోరారు. డిస్టిక్ ఎక్స్ పోర్ట్ యాక్షన్ ప్లాన్ కమిటీ జిల్లాలోని ప్రధాన ఉత్పత్తుల గురించి పరిశీలించి వెనుకబడిన ఈ జిల్లాను ఆర్థికంగా అభివృద్ధి చేసే విధంగా ముందుకు తీసుకువెళ్లెందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. వీసీలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్,పీ. ఐ. ఓ నర్సింగ్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, చేనేత జౌళి శాఖ అధికారి బాబు, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలి

- రహదారి భద్రత సమిష్టి బాధ్యత
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** రోడ్ ప్రమాదాల నివారణ కి అన్నీ రకాల భద్రత చర్యలను తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్‌లో రోడ్ భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమనిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, అతివేగం వల్ల వాహనాలు అదుపుతప్పి.. ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. జిల్లా ఆరంభం అయ్యే దగ్గరి నుండి... ముగింపు ప్రాంతం వరకు.. పోలీస్, నేషనల్ హై వే, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ ద్వారా ప్రమాదాలు తరుచూ జరుగుతున్న ప్రాంతాలను గత సమావేశాలు చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని.. ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు.ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాలలో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్ సూచికలు తప్పనిసరిగా ఉండాలన్నారు.
జిల్లా మీదుగా వెళ్తున్న నేషనల్ హై వే ప్రధాన రహదారి మీద ఎక్కువ గా ప్రమాదాలు జరుగుతున్నాయని.. దీని పైన నేషనల్ హైవే అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రోడ్ ప్రమాదాల పట్ల కాలేజ్ యాజమాన్యం యువతకి అవగాహన కల్పించాలన్నారు.జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తుందని ట్రాఫిక్ ఉల్లంఘనలకు, డ్రంక్ అండ్ డ్రైవ్ పై తనిఖీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలను రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా పరిరక్షిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ సర్దార్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి,, మెదక్ మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని పోలీస్ యంత్రాంగం తరపున డీఎస్పీలు, సిఐలు, నేషనల్ హైవే, పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## తులం బంగారం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వ్యాఖ్య



**హత్నూర, జనవరి 7 (జనంసాక్షి) :** పేదింటి ఆడబిడ్డలను ఆదుకోవడం కోసం కళ్యాణ లక్ష్మి పథకం కింద అందిస్తున్న లక్ష రూపాయలతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామన్న హామీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు.మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 114 మంది లబ్ధిదారులకు ఆమె చేతుల మీదుగా కోటి 14లక్షల 13వేల 2వందల ఇరువై నాలుగు రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆడబిడ్డ పుడితేనే భారంగా భావించే తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం ఒక వరం లాంటిదని ఆమె అన్నారు.ప్రతి ఆడ బిడ్డ పెళ్లికి రూ.లక్షా నూట పదహారు సహకారమందించడం మూలంగా వారి కన్న తల్లిదండ్రులకు కొంత ఆర్థిక భారం తగ్గుతుందని ఆమె చెప్పారు.కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ దావూద్ హైమత్,దేవేందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ నర్సింలు, ఎంపీడీవో శంకర్,ఆర్ ఐ శ్రీనివాస్,దామోదర్ రెడ్డి, అజ్మత్ అలీ,కృష్ణ తదితరులు ఉన్నారు.

# బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు






బాల్య వివాహాలు జరిపిస్తే సమాచారం ఇవ్వండి

సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 07 (జనం సాక్షి )

బాలల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోహిర్ ఎస్సై సతీష్ హెచ్చరించారు. మంగళవారం కోహిర్, జహీరాబాద్ పాఠశాలల్లో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాలలో భాగంగా శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, విశాలలు దిగ్వాల్ జిల్లా పరిషత్ పాఠశాల, జహీరాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చెక్క వ్యతిరేకమని ఎక్కడైనా బాల్యవివాహాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వస్తే సమాచారం ఇవ్వాలని అన్నారు. బాలల హక్కులు, బాలికలను ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా, చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరిం చారు. ఆన్లైన్ ద్వారా మోసపోయిన, చైల్డ్ లేబర్, మాదక ద్రవ్యాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, వంటి అంశాలపై విద్యార్థులు అవగహన కల్గి ఉండాలని, బాలలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురైనా హెల్ప్ లైన్ నెంబర్స్ 181, 1098, 100, 1930 ల కు ఫోన్స్ చేయాలని జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి సూచించారు. కార్య క్రమంలో డి ఎచ్ ఈ డబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ విశాల, దిగ్వల్ స్కూల్ ఇంచార్జి ఎచ్ ఎం రవీందర్, ఉపాధ్యాయులు, జహీరాబాద్ స్కూల్ ఇంచార్జి ఎచ్ ఎం ప్రమీల , షి టీమ్ పోలీస్ భారత్, తయాబా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే గ్రామాలు పట్టణాలు అభివృద్ధి.



కల్వకుర్తి జనవరి 7(జనం సాక్షి )

**కల్వకుర్తి నియోజకవర్గానికి 91 కోట్ల 51 లక్షలు మంజూరు.**

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**

కల్వకుర్తి నియోజకవర్గం లోని కల్వకుర్తి, వెల్దండ చారకొండ మండలాల లోని వివిధ గ్రామాల రోడ్లకు సంబంధించి 91 కోట్ల 51 లక్షలు మం జూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల రోడ్లకు అధిక నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీ పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ముందుచూపుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామాలకు పట్టణాలకు అధిక నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలలోని రోడ్లు బ్రిడ్జిలు బాగు చేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రతి ఒక్కటి నెరవేస్తున్నామని గత ప్రభుత్వం గ్రామాలను ఏనాడు కూడా పట్టించుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమన్వయంతో గ్రామాలను పట్టణాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలను పట్టణాలను అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఎంతో ఉందని ఇందిరమ్మ రాజ్యం అంటేనే నిరుపేదలను రైతుల ను అభివృద్ధి పరచడమే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం కాలంలో రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిచ్చిందని దాని ద్వారానే ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బృంగి ఆనంద్ కుమార్. శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ ఉమా మనిలా సంజీవ్ యాదవ్. వైస్ చైర్మన్ పండితురావు,కల్వకుర్తి మాజీ జెడ్పిటిసి అశోక్ రెడ్డి, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయతి విజయ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల శ్రీనివాస్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్త అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసుల విచారణకు వెళ్లి నిజాయితీ నిరూపించుకో..

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

తూప్రాన్, జనవరి 7 (జనంసాక్షి)



కారు రేసు కేసులో తాను ఏ తప్పు చేయలేదని అదో లొట్ట పీస్ కేసు అని ప్రగల్బాల్ పలికిన కేటీఆర్ పోలీసుల విచారణ ఎందుకు భయపడుతున్నామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారుకోర్టులో క్యాష్ పిటిషన్ కొట్టేసేవరికి కేటీఆర్ కి భయం పట్టుకుందని దొంగ కేసులో దొంగకు లాయర్లు ఎందుకని పోలీసుల విచారణకు వెళ్లి నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 108 అంబులెన్స్ జెండ ఊపి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి డాక్టర్లను కలిసి ప్రజల ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్న ఆసుపత్రి చాలా నీట్ గా ఉందని విద్య వైద్యంకు తను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి సర్వీసు ఇచ్చి ప్రజల పొందాలని సూచించారు అనంతరం మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కి పోలీసుల దగ్గర వెళ్లడానికి సలి జ్వరం వస్తుందా అన్నారు. న్యాయవాదులను తీసుకొని దొంగలు ఎక్కడైనా పోలీస్ స్టేషన్కు వెళ్తారా వాళ్ళు రాణిస్తారా పదేళ్లు మంత్రిగా చేసిన కేటీఆర్ కి అప్పుడు తెలంగాణలో పోలీసు వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తుందన్న నువ్వు ఈరోజు పోలీసులను ఏరకంగా తప్పుపడుతున్నావ్ అని ప్రశ్నించారు. మొదటగా లొట్ట పీసు కేసుకి ఎవరు భయపడతారు అని దర్జాగా మాట్లాడిన కేటీఆర్ కు ఇప్పుడు విచారణకు రమ్మంటే న్యాయవాదుల అవసరం వచ్చిందని ఎద్దేవ చేశారు. న్యాయం చట్టం అందరికీ ఒకే విధంగా ఉంటాయని కోర్టులకి పోలీసులకి సహకరించి తప్పు ఒప్పులను న్యాయం నిర్ణయిస్తుందని ప్రతిపక్షమైన అధికారపక్షమైన కోర్టు తీర్పు కట్టుబడి ఉండాలని అన్నారు. అధికారపక్షంలో ఉన్నప్పుడు మీరు హింసించినప్పుడు గుర్తు లేదా ఈ చట్టాలు పోలీసుల ప్రవర్తన గురించి ప్రపంచ స్థాయిలో సోషల్ మీడియాలో మూడు కోట్లు ఖర్చుపెట్టి కేటీఆర్కేదో అన్యాయం జరిగింది ఏదో చేస్తుర్రు అన్న ప్రచారం చేపిస్తున్నావు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు జ్యోతి బిజెపి జిల్లా నాయకులు కలకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్, తూప్రాన్ పట్టణ బిజెపి అధ్యక్షులు జానకిరామ్ గౌడ్ వెంకటేష్, పురం రవి, అజయ్ కుమార్, నర్సింలు, సత్యనారాయణ సుధాకర్ ఆసుపత్రి సిబ్బంది ఏఎన్ఎంలు 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రతి డెలివరీ పీహెచ్సీలో జరగాలి



మల్దకల్ జనవరి 7 (జనంసాక్షి)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరాణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆశా కార్యకర్తల సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిద్ధప్ప హాజరై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం అందరూ ఆశా కార్యకర్తలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్దకల్ నందు సాధారణ డెలివరీలు చేపించాలని, ఏమైనా ఇబ్బందులు అవుతే 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి రావాలని ప్రైవేట్ హాస్పటల్లకు వెళ్లకుండా చూడాలని, తెలిపారు. జిల్లాకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి తెలిపారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లుడాక్టర్ సంధ్యా కిరణ్ మై,డాక్టర్ జి రాజు, డాక్టర్ ప్రసూన రాణి, వివిధ ప్రోగ్రాంల గురించి మాట్లాడారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి, ఏఎస్ఓ తిరుమలేష్ రెడ్డి, డిడియం రామాంజనేయులు,జిల్లా ఎన్సిడి కోఆర్డినేటర్ శ్యాంసుందర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది,వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 630 కేజీల బెల్లం, 50 కేజీల అలం స్వాధీనం

కారు, ఒక వ్యక్తి అరెస్టు




అచ్చంపేట, జనవరి 7 (జనంసాక్షి)

నాటుసారా తయారీ కోసం హైదరాబాద్ నుంచి ఉప్పునుంతల మండలం దేవదారికుంట గ్రామానికి కారులో బెల్లం తరలివెలుతుందానే సమాచారం మేరకు అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్ ఎస్హెచ్ఓ సూర కృష్ణ బృందం కలిసి అచ్చంపేట మండల పరిధిలోని హాజీపూర్ ప్రాంతంలో మంగళవారం మాటు వేసి కారును తనిఖీలు నిర్వహించగా 21 బ్యాగుల బెల్లం సంచులు కనిపించాయి. ఒక్కొక్క బెల్లం బ్యాగులో 30 కేజీల బెల్లం ఉంటుంది. మొత్తం గా 680 కేజీల బెల్లం, బెల్లంతోపాటు 50 కేజీల అలం, 10 లీటర్ల నాటుసారా లభించింది. శివ అనే వ్యక్తి తన మారుతి 800 అనే కారులో బెల్లం, అలంను తీసుక వెలుతున్నట్లు అంగీకరించాడు. పట్టుకున్న బెల్లం, అలం, కారుతో కలిపి రూ. 1.38 విలువ ఉంటుందాని అంచనావేశారు. బెల్లం కారును పట్టుకున్న టీమ్లో ఎస్హెచ్ఓతోపాటు ఎస్సై సతీష్, కానిస్టేబుళ్లు అంజనేయులు, బాలయ్య, నవీన్, బందీలాల్లు ఉన్నారు. బెల్లం ను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్మెంట్ డ్కెరెక్టర్వి.బి.కమలాసన్రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ డి.గాయత్రీ అభినందించారు.

# పార్టీలు మారిన కౌన్సిలర్ల బెర్తులు భద్రమేనా..?

అధికార పార్టీకి తప్పని టికెట్ల తలనొప్పి



వనపర్తి, జనవరి 07 (జనంసాక్షి)

రాష్ట్రంలోని మున్సిపాలిటీల పాలకవర్గాలకు ఈ నెలాఖరులగా పదవీకాలం ముగియనుంది. గ్రామ పంచాయతీలతో పాటే మున్సిపల్ ఎలక్షన్స్ జరుగుతాయని ప్రచారం ఊపందుకుంది. దీంతో పల్లెలతో పాటు పట్టణాల్లో కూడా ఎన్నికల సందడి మొదలైంది . ప్రస్తుత కౌన్సిలర్లు, గతంలో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులే కాకుండా ఈ సారి తాము కూడా పోటీ చేయాలని కొంత కాలంగా ఉవ్విళ్ళూరుతున్న ఆశావహులు ఇప్పటికే వార్డుల బాటపట్టారు. ఓటర్లతో గల బంధుత్వాలు, స్నేహాలు, పరిచయాలను గుర్తు చేసుకుంటున్నారు. మరికొంత మంది ఆశావహులైతే తమ మద్దతుదారులను కూడగట్టుకునే పనిలో తలమునకలు అవుతున్నారు. న్యూఇయర్ వేడుకల్లో వారికి మందు, విందు ఏర్పాటు చేయగా, రానున్న సంక్రాంతి పండుగకు మరింత ఖర్చు పెట్టడానికి సిద్ధం అవుతున్నారు .పట్టణాల్లోని చౌరస్తాలు, హెటళ్ళు తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మున్సిపాలిటీల ఎన్నికల చర్చలు కొనసాగుతున్నాయి. అయితే త్వరలో జరుగబోయే మున్సిపల్ ఎన్నికలు అధికార ప్రతిపక్ష పార్టీలకు తలనొప్పులు తెచ్చి పెట్టే అవకాశం లేకపోలేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పలువురు మున్సిపల్ చైర్మెన్లు కౌన్సిలర్లు అధికార పార్టీలో చేరారు మరి ప్రస్తుత ఎన్నికల్లో వారికి కాంగ్రెస్ టికెట్లు దక్కుతాయో లేదో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి అయారామ్ లకే టికెట్లు ఇస్తే గత పదేళ్ళ పాటు బీఆర్ఎస్ హయాంలో ఇబ్బందులెదుర్కొన్నామని పదవుల కోసమే పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న తమకు టికెట్లు ఇవ్వాల్సిందేనని పాత కాంగ్రెస్ శ్రేణులు పట్టుబడుతున్నారు అందుకే మున్సిపాలిటీల ఎన్నికలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు తలనొప్పులుగా మారనున్నాయి.

**పంచాయతీలతో పాటే మున్సిపల్ ఎన్నికలు**

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే 11 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి కుంటుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు సవరించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సంక్రాంతి తర్వాత రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. అయితే జనవరి 26న మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు కూడా ముగియనుంది. దీంతో రాష్ట్రం ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలతోపాటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఇప్పటికే సంక్రాంతి తర్వాత పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి.. ఫిబ్రవరిలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. కులగణన వివరాలు ఇప్పటికే బీసీ డెడికేషన్ కమిషన్కు చేరడంతో త్వరలోనే రిపోర్ట్ ప్రభుత్వానికి ఇవ్వనుంది. దీని ప్రకారం రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశం పెండింగ్లో ఉండడంతోనే ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఆ సమస్య లేదు. దీంతో పంచాయతీ ఎన్నికలతోపాటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**సకాలంలోనే మున్సిపల్ ఎన్నికలు**

పాలక వర్గాల పదవీకాలం పూర్తయిన మున్సిపాలిటీలకు సకాలంలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నట్లు రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు ఆలస్యం చేస్తే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందనే దిగులు ప్రభుత్వ వర్గాల్లో ఉందంటున్నారు ఎలాగూ బీసీ ఎస్సీల రిజర్వేషన్ల ప్రక్రియ ముగింపు దశకు వచ్చినందున మున్సిపల్ ఎన్నికల నిర్వహణను జాప్యం చేస్తే ప్రతిపక్షాల నుంచి ప్రజల నుంచి విమర్శలు వస్తాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఇప్పటికే 141 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవల కొత్తగా 12 మున్సిపాలిటీలు, రెండు(మహబూబ్నగర్, మంచిర్యాల) కార్పొరేషన్లను ప్రబుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో 129 మున్సిపాలిటీల పదవీకాలం జనవరి 26న ముగుస్తుంది. మరో ఏడు మున్సిపాలిటీలు కార్పొరేషన్ల టర్మ్ మే వరకు ఉంది. జీహెచ్ఎంసీ పదవీకాలం ఫిబ్రవరి వరకు ఉంది. ఈ ఏడాది డిసెంబర్, లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. గతంలో 138 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. 5 మున్సిపాలిటీలు(పాల్వంచ, జహీరాబాద్, మణుగూరు, ఆసిఫాబాద్, మంమ్మరి)కు ఎన్నికలు జరగలేదు.

**త్వరలో రిజర్వేషన్లు ఖరారు**

లోకల్ బాడీల్లో బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం ఇటీవలే కుల గణన చేపట్టింది. ఇందుకు సంబంధించిన డేటా ఎంట్రీ పూర్తయింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారంలోగా నివేదిక అందే అవకాశం ఉందని . దీని ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉంది. ఆ తర్వాత పంచాయతీ,మున్సిపాలిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతుందా,లేదా..? అనే ప్రశ్న తలెత్తుతున్నది . ఎందుకంటే.. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు ఏ పరిస్థితుల్లోనూ 50 శాతం దాటరాదు. ఈ నేపథ్యంలో బీసీ డిక్లరేషన్ అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అయితే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోయినా,ఎన్నికల నిర్వహణవైపు అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తాజాగా వచ్చిన ఆదేశాలను బట్టి తెలుస్తున్నది.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పేరు లేని నిరుపేదరాలు

అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందా?

హుస్నాబాద్, జనవరి 07(జనంసాక్షి)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో రాజాకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదల ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను అందించాలనే లక్ష్యంతో అధికారులతో నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం చెబుతుంటే అందుకు భిన్నంగా హుస్నాబాద్ పురపాలక సంఘం కమీషనర్, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం నిర్వాకం వల్ల పట్టణంలోని 13 వార్డులో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన దొంతరవేని రాజవ్వ ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం చేసిన సర్వేలో రాజవ్వ పేరు రాకపోవడం

ఏమిటని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజీవరెడ్డి మున్సిపల్ అధికారులను ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం నాడు పురపాలక కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ ను కలిసి వినతి ఇవ్వడానికి వెళ్లిన దొంతరవేని రాజవ్వకు నిరాశ ఎదురైంది. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో తనకు జరిగిన అన్యాయం గురించి పురపాలక కమిషనర్ కమిషనర్ కు తన గోడు చెప్పుకొవడాని 2 గంటలకు పైగ పురపాలక సంఘం కార్యాలయంలో వేచి ఉన్నప్పటికి కమిషనర్ కనీసం అగి నిలబడి వినతి పత్రం కూడా చూడకుండా ఆఫీస్ లో ఇవ్వండి అనుకుంటు వెళ్లడం సరికాదని పట్టణ ప్రజలకు పురపాలక ఆఫిస్ కు వచ్చిన పేదలకు జవాబు దారిగా ఉండాల్సిన కమిషనర్ పనితీరు మారలని కమిషనర్ పనితీరుపై సిపిఐ అసహనం వ్యక్తం చేస్తుందని అయిలేని సంజీవరెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో అధికారులు అవకతవకలకు పాల్పడి పేదలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని అర్హులు కాకుండా అనర్హులకు అనుకులంగా సర్వేలు రాసి నిరుపేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళన చెపడుతామని అయిలేని సంజీవరెడ్డి పురపాలక సంఘం అధికారులను హెచ్చరించారు. పురపాలక కమిషనర్ కు ఇవ్వాల్సిన వినతిపత్రాన్ని ఇన్ వార్డులో ఉన్న అధికారులకు దొంతరవేని రాజవ్వ వినతి పత్రం ఇచ్చి నిరాశాతొ వెళ్లినట్లు సమాచారం.



# నియోజక వర్గ అభివృద్ధి సంక్షేమంలో రాజీపడను

- నియోజకవర్గానికి 4500 ఇల్లు మంజూరు తీసుకొస్తా..
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**పినపాక, జనవరి 7 (జనంసాక్షి) :** మండల పరిధిలోని అమరారం గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరారం గ్రామస్థులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు తిలకం దిద్ది, హారతులు పట్టి, పూలు చల్లుతూ భారీ జన సందోహంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో రూ 20 లక్షల వెచ్చించి నిర్మించిన సిసి రోడ్ల ను ప్రారంభించారు. అనంతరం అమరారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో భాగంగా గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలు ప్రభుత్వ పథకాలు సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై రివ్యూ చేపట్టారు. శాఖల వారీగా తమ పనుల పురోగతిని వివరించిన అధికారులు, పెండింగ్ పనులను, ఆయా పనుల జాప్యానికి గల కారణాలను వివరించారు. ప్రధానంగా కొత్తూరు గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని, గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ శుభ్రం చేయడం లేదని, గేట్ వాల్ ల నిర్మాణం జరగలేదని, ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై బాధ్యతాయుతంగా పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధిదారులు మధ్యవర్తులను దళారులను ఆశ్రయించవద్దన్నారు. ఎవరైనా పథకాల పేరు చెప్పి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గానికి ఫస్ట్ ఫేజ్‌లో 3500 ఇల్లు మంజూరు వస్తున్నాయని, ఇవి కాక, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో అదనంగా మరో 1000 ఇల్లు మంజూరు కు ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే పాయం తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, పినపాక మండల ప్రత్యేక అధికారి బీ తాతారావు, పంచాయతీరాజ్ డిఇ సత్యనారాయణ, తహశీల్దార్ నరేష్ ఎంపిడిఓ రామకృష్ణ, ఎం పీ ఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ కొమరం నాగయ్య, ఐకెపి ఎపిఎం జ్యోతి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెదురు ఉత్పత్తుల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**చంద్రుగొండ, జనవరి 7 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చంద్రుగొండ మండలం బెండలపాడు శివారు కనకగిరి గుట్టలను సందర్శించిన నాటినుండి ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేయాలనే తపనతో పలుమార్లు ఆ ప్రాంతాన్ని సందర్శించటమే కాకుండా అధికారులను సైతం పంపించి అక్కడ విశేషాలను తెలుసుకొని అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తున్నారు. బెండలపాడుకు చెందిన వెదురు ఉత్పత్తుల కేంద్రం నుండి అనేక వెదురు ఉత్పత్తులను తయారు చేసే విధంగా ఆ క్లస్టర్ సభ్యులకు సూచనలు ఇస్తూ వారికి చేయూతనిస్తూ ఆదాయ వనరులను అందించే విధంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం తో పాటు పలు చోట్ల వెదురు ఉత్పత్తులతో తయారుచేసిన వస్తువులను వాడే విధంగా అధికారులకు ఆదేశాలిస్తూ తగు నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా అక్కడ వారికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి అందరి మన్నలను పొందుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎంతైనా అభినందనీయుడు. మంగళవారం బెండలపాడు వెదురు ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలించి వెదురు కర్రలతో బేస్ క్యాంప్ షెడ్డు గుర్తింపు గల స్థలాలకు నేమ్ బోర్డ్స్ ఏర్పాటుపై అక్కడ వారితో మాట్లాడారు. ఈనెల 11న బెండలపాడు కనకగిరి గుట్టల పర్యటనకు టూరిజం పర్యాటకులు సందర్శన ఉన్నందున ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. టూరిస్టులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. టూరిస్టుల సందర్శనతో స్థానికులకు మంచి ఆదాయం వనరులు కలుగుతాయని తెలిపారు. అనంతరం ఐకెపి మహిళలు తయారుచేసిన వంటకాలతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్ తాసిల్దార్ సంధ్యారాణి క్లస్టర్ కమిటీ సభ్యులు వేసం రాములు మల్లం కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్, ఫజల్ భక్ష్ ,ఆలకుంట రాందాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చైనా మాంజా వాడకం నిషేదం

- జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్




**నల్లగొండ బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** సంక్రాంతి సందర్భంగా జిల్లాలో చిన్నపిల్లలు,పెద్దలు సరద కొరకు ఎగరవేసే పతంగులకు నైలాన్,సింథటిక్ తో తయారు చేసినా చైనా మంజా వాడి పడేయడం వలన ప్రజలకు, పక్షులకు ప్రమాదాల వాటిల్లే అవకాశాలు ఉన్నాయని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో చైనా మాంజా విక్రయాలు,వినియోగాల పైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ, ఎవ్వరయిన నిలువ ఉంచిన,తయారుచేసిన,అమ్మిన, అమ్మడానికి ఎవ్వరయిన ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడుననని తెలిపారు.చైనా మాంజను పతంగులకు వాడి బయట పడేసినట్లయితే అవి చెట్లకు, ఎలక్రిక్ తీగలకు తగిలి వేలాడి ప్రజలకు,జంతువులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు.ఈ మాంజా తగిలి కొన్ని ప్రాంతాలలో ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కావున విక్రయదారులు ఎవ్వరయిన చైనా మంజా నిలువచేసిన,అమ్మిన,వాడిన డయల్100కి గాని సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలనికోరారు.వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటా మన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- ఏఎస్పీ పి.మౌనిక




**దేవరకొండ, జనవరి 7 (జనంసాక్షి) :** భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఏఎస్పీ పి.మౌనిక పేర్కొన్నారు. మంగళవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ పి.మౌనిక, సీఐ నరసింహులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చాలా పెద్ద బాధ్యత మీపై ఉందని అన్నారు. డ్రైవర్లకు మానసిక ఒత్తిడి ఉంటుందని, అయినప్పటికీ దృఢంగా ఉంటూ డ్రైవింగ్ లో జాగ్రత్తలు పాటించి ప్రయాణికులను గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే మీ కుటుంబంతో పాటు, ఎదురుగా వచ్చే వారి కుటుంబాలు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు మాట్లాడుతూ దేవరకొండ డిపో పరిధిలో గతంతో పోలిస్తే చాలావరకు ప్రమాదాలు తగ్గాయని అన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ.. ప్రయాణికులను సురక్షితంగా తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, ఎంఎఫ్ కృష్ణయ్య, వెల్ఫేర్ బోర్డు మెంబర్స్ పాపారాజు, సమద్, మరియు సిబ్బంది, పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 7 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు.మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేస్తుందన్నారు. గ్రామాలలో రెవెన్యూ అధికారులు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగేట్లు చూడాలని సూచించారు. ఫిర్యాదులు రాకకుండా గ్రామ సభల్లో చర్చించి లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. కొల్లూరు, తెల్లాపూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో బస్తీ దావఖానా, అంగన్వాడి కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వచ్చిన దరఖాస్తులను వ్యక్తిగత విచారణ జరిపి,గ్రామసభలలో చర్చించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిర మహిళలకు లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్,హౌసింగ్ పీడీ. చలపతి, మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, కాంట్రాక్టులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం జోలికి వస్తే ఊరుకోం..

- కడియం శ్రీహరి ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు..
- అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



**స్టేషన్ ఘన్పూర్, జనవరి 7 (జనంసాక్షి) :** మీడియా సమావేశాలు పెడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఅర్ఎస్ పార్టీ గురించి కానీ, కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావ్ ,కవిత గురించి గాని మాట్లాడితే తాట తీస్తాం అని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టుల విష యంలో కడియం శ్రీహరి అవలంబిస్తున్న తీరును రాజ య్య తీవ్రంగా తప్పుబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అగ్రశ్రేణిలో స్థానాన్ని కల్పించిందని, రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం 104 కోట్ల రూపాయలు ప్రాజెక్టుల కోసం కేటాయించిందని తెలిపారు. కడియం శ్రీహరి ఇలాగే తప్పుడు ఆరోపణలు చేస్తే తాట తీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్, నాయకులు తాటికొండ సురేష్ కుమార్, కర్ర సోమిరెడ్డి, రాజన్ బాబు, చల్ల చందర్ రెడ్డి, హీరా సింగ్, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, కుంభం కుమారస్వామి, చింత శ్రీనివాస్, మారపాక దేవయ్య,గోవిందు అశోక్, ఆకార పు అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 7 (జనంసాక్షి) :** ఇరవై ఏళ్లుగా పాఠశాల విద్య అభివృద్ధి కోసం పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరానికి హాజరై వారికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో దాదాపు 19600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఏండ్ల తరబడిగా వారు చాలీచాలని వేతనంతో జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని, అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదరిగానే విధులు నిర్వహిస్తున్నా కూడా వారికి పనికి తగిన వేతనం అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ గాలిగల్ల సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, తేజశ్రీ, స్నేహలత, రాంబాబు,సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పిన ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**మఖ్తల్, జనవరి 7 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రైతు భరోసా ఎకరానికి రూ.15000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మక్తల్ తాసిల్దార్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రైతులకు ఇచ్చిన హామీ ప్రతి ఏడాదికి ఎకరాకు 15000 రూపాయలు పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి ఇప్పుడు రూ.12000 వేలకు కుదించడం రైతులను నిలువుగా మోసం చేస్తున్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ చేతిలో మోసపోతున్న రైతన్నలేనని కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం పార్టీ అని మరోసారి రుజువైందని అన్నారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని ఈ ప్రభుత్వం నమ్మి ఓటేసిన పాపానికి మోసానికి పాల్పడిన కాంగ్రెస్ ను రైతన్నలుపాతరేస్తారని అన్నారు. ఈ కాంగ్రెస్ తీరు రైతాంగానికి పూర్తి వ్యతిరేకమని అన్నారు. ఈ రైతులకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామిలు నెరవేర్చాలని తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు పి.నర్సింహా గౌడ్, కె.రాజేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎ. మహిపాల్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు జె.చిన్నహన్మంతు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతికి కారణమైన హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు

**చెన్నారావుపేట, జనవరి 7 (జనంసాక్షి) :** విద్యార్థి మృతికి కారణమైన హాస్టల్ నిర్వాహకుడి పై కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని మగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్మల్ జిల్లా తాండూరు మండలం ఎల్వి గ్రామానికి చెందిన కొండల్ వాడి అవినాష్ రెడ్డి (18) డి ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఎదురుగా ప్రైవేటు హాస్టల్ లో ఉంటూ చదువును కొనసాగిస్తున్నాడు. హాస్టల్ లో ఉన్న విద్యుత్ మోటార్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. హాస్టల్ నిర్వాహకుడు వివేక్ నిర్లక్ష్యం మూలంగానే విద్యార్థి అవినాష్ రెడ్డి మృతి చెందినట్లు విద్యార్థి తండ్రి దత్తారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హాస్టల్ నిర్వాహకుడు వివేక్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి

- విద్య ప్రమాణాలు మెరుగుపరచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 7 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలల్లో ఆంగ్లాన్ని సులభతరంగా విద్యా బోధన చేయడంపై మండల విద్యాధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు సులభతరంగా అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఉంటారు కాబట్టి ఆంగ్ల భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో ప్రోజెక్టర్ల ద్వారా ఇంగ్లీష్ సినిమాలు చూయించడం వల్ల కూడా ఆంగ్లంలో ప్రావీణ్యత సాధించవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఇంగ్లీష్ భోధన చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ మాసం లోపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డిఇఓ రేణుకా దేవి, వయోజన విద్య అధికారి శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మహబూబా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కంప్యూటర్ ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- భద్రాచలం ఐటిడిఏ పిఓబి రాహుల్




**భద్రాచలం, జనవరి 7 (జనంసాక్షి) :** గిరిజన విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను పరుగులుచుకోవాలని, ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేసుకోవడానికి కంప్యూటర్ లు సరఫరా చేస్తున్నట్లు ఐటిడిఏ పిఓ బి రాహుల్ తెలిపారు. మంగళవారం తన చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే కంప్యూటర్ల టెండర్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు కంప్యూటర్లు సరఫరా చేయడానికి ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మహబూబాబాద్, అదిలాబాద్ నుండి 11 మంది ఏజెన్సీ దారులు టెండర్లు దాఖలు చేశారని, టెండర్లలో చూపిన రేట్లు కాక అతి తక్కువ ధర కోట్ చేసిన ఏజెన్సీలకు కంప్యూటర్ లు సరఫరా చేయడానికి కమిటీ సభ్యుల సమక్షంలో ఆమోదించడం జరిగిందని, టెండర్ సమయంలో చూపిన కంప్యూటర్ క్యాటలాగ్ ప్రకారము ఏసీఆర్ కంపెనీ 75, హెచ్ పి కంపెనీకి సంబంధించిన14 కంప్యూటర్లు మాత్రమే 20 ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని, నిబంధనలకు అతిక్రమించి వేరే కంపెనీల కంప్యూటర్లు సరఫరా చేసినట్లు మా దృష్టికి వస్తే ఏజెన్సీలను రద్దు చేయడమే కాక శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి మణెమ్మ, ఏ సీఎంవో రమణయ్య, ఏటీడీఓ అశోక్ కుమార్, డి ఎం జి సి సి సమ్మయ్య, రమణ మూర్తి, వివిధ ఏజెన్సీదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవల పట్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆరా..



**ములుగు/వెంకటాపూర్, జనవరి 7 (జనంసాక్షి) :** వెంకటాపూర్ మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం రోజున నిర్వహించిన ఆరోగ్య మహిళ క్లినిక్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు సందర్శించి, క్లినిక్ వచ్చే మహిళ రోగుల వివరాలను మరియు వైద్య సేవల పట్ల ఆరా తీశారు.మహిళా ఆరోగ్య క్లినిక్ లో మహిళలకు వచ్చే గర్భాశయ సమస్యలు, థైరాయిడ్, హైపర్ టెన్షన్, గర్భాశయం క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ మొదలగు సమస్యల గల, మహిళా రోగులకు ఓపికతో సేవలు అందించాలని,ఆరోగ్య సమస్యల పట్ల రోగులకు అవగాహన కల్పించిన తర్వాతనే చికిత్సను అందిస్తే ,మహిళా ఆరోగ్య క్లినిక్ పట్ల నమ్మకం ఏర్పడుతుందని డాక్టర్ రిషిత మరియు వైద్య సిబ్బందికి తెలియజేశారు. అటు తర్వాత మంగళవారం రోజున జరిగిన ఆశా డే మీటింగ్లో పాల్గొని,ఆరోగ్య కార్యకర్తల మరియు ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ,క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించుటలో మీరే ముఖ్యులని, ఆరోగ్య కార్యక్రమాల పట్ల ప్రజలలో అహగాన కల్పించి ఆరోగ్య సూత్రాలను పాటించేటట్లు చేసినప్పుడే ప్రజలు ఆరోగ్య అంతమైన జీవనాన్ని గడుపుతారని తెలిపారు. అసంక్రమిక వ్యాధులైన హైపర్ టెన్షన్ షుగర్ స్క్రీనింగ్ టెస్టులను ఈ మాసం చివర్లో కంప్లీట్ చేయాలని,అదేవిధంగా టిబి నియంత్రణ కార్యక్రమంలో ప్రతినెల ఆశ కార్యకర్త పదికి తక్కువ కాకుండా తెమడ పరీక్షలు చేయించాలని,వ్యాధి నిర్ధారణమైన వారికి టీబి మందులను సరఫరా చేసి చికిత్స తీసుకునేటట్లు చేస్తే టిబి వ్యాప్తి ని అరికట్టవచ్చునని ఆశా కార్యకర్తలకు తెలిపారు.తరువాత జిల్లా శిశు ఆరోగ్యము, వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రణధీర్ ఆరోగ్య కార్యకర్తలకు వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత మరియు వ్యాధి నిరోధక టీకాల పట్టికను,టీకా ఇచ్చే కేంద్రంలో పాటించవలసిన జాగ్రత్తల పట్ల శిక్షణ ఇచ్చినారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రిషిత,ఇంచార్జి డెమో సంపత్, కమిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ ,సంపద రావు, పిహెచ్ ఎన్. శోభ,మిడ్ లెవెల్ హెల్త్ ప్రోవైడర్స్ సంఘమిత్ర,భవ్య శ్రీ,సూపర్వైజర్ పుష్ప కుమారి,ఫార్మసిస్ట్ రాజమణి,స్టాఫ్ నర్స్ మున్ని,ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 108 వాహనాన్ని ప్రారంభించిన మంత్రి

**అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**మల్హర్, జనవరి 07(జనంసాక్షి)**



భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరది లోని కొయ్యూరు గ్రామంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన 108 అంబులెన్స్‌ను, అంగన్వాడీ సూపర్ వైజర్లు కు ఈ సి ఐఎల్ సీఎస్ఆర్ నిధులతో ఎలక్ట్రానిక్ స్కూటీలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ అంబులెన్స్ అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం యాస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సూపర్వైజర్లకు ఎలక్ట్రానిక్ స్కూటీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడి సిబ్బంది సేవలను మరింత మెరుగుపరచేందుకు అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలోని రెండు అంగన్వాడీ కేంద్రాల ప్రాజెక్టు పరిధిలోని సూపరవైజర్లుకు స్కూటీ లు అందచేస్తున్నట్లు తెలిపారు. మల్హర్ మండలానికి 5, భూపాలపల్లికి 15 స్కూటీ లు అందచేస్తున్నట్లు తెలిపారు. మల్హర్ మండల పరిదిలో 227 కేంద్రాలున్నాయని అన్ని కేంద్రాలను కవరు చేయాలని ఆయన సూచించారు.
అంగన్వాడి పిల్లలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన అనంతరం మంత్రి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడి కేంద్రాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, మాజి ఎంపిపి మాలహర్ రావు, పిఏసి ఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు వ్యక్తుల మృతి

**ఇద్దరు ఆత్మహత్య ఒకరు హత్య**
**వికారాబాద్ జిల్లాలో ఘటన**

**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 7 (జనం సాక్షి):**



నూతన సంవత్సరం మొదటి వారంలోనే హత్యలు ఆత్మహత్యలు ప్రారంభమ య్యాయి. గత ఏడాది నేరాల సంఖ్య పెరిగిందని వాటిని అదుపు చేయడానికి గట్టిగా ప్రయత్నిస్తామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ప్రకటించిన నేపథ్యంలో నూతన సంవత్సరం మొదటి వారంలోనే క్రైమ్ రేట్ మరింత పెరగడం కలవర పెడుతున్న విషయం. వికారాబాద్ జిల్లాలో నూతన సంవత్సరం మొదటి వారంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. అందులో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకోగా మరో వ్యక్తి దారుణ హత్యకు గురి అయ్యాడు. వివరాలు ఎలా ఉన్నాయి. వికారాబాద్ మండలం సిద్ధలూరు గ్రామానికి చెందిన గోపాల్ కొడుకు చేతిలో దారుణ హత్యకు గురి అయ్యాడు. పుట్టుకతో మూగ అయినా శ్రవణ్ కుమార్ కన్న తండ్రిని కర్రతో ఇష్టం వచ్చినట్లు చితకబాది దారుణానికి పాల్పడ్డాడు. రోజు పశువులు కాస్తున్న శ్రవణ్ కుమార్ గత రెండు రోజులుగా తండ్రి గోపాలతో గొడవ పడినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఒంటరిగా ఉన్న తండ్రి గోపాలపై దాడి చేసి హత్యకు కొనుకున్నారు. ఈ విషయమై వికారాబాద్ సీఐ భీమ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో సంఘటనలో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ధరూర్ మండలం చేరెల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై ధరూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యాలాల మండలంలో మరో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిస కావద్దని తల్లిదండ్రులు గట్టిగా మందలించడంతో మనస్థాపానికి గురైన ఆ యువకుడు చెట్టుకు వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు యాలాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం వారి శవాలను వారి బంధువులకు అప్పగించారు.

# కరీమాబాద్‌లో నకిలీ వైద్యుడి గుట్టు రట్టు

**ఫిజియోథెరపి చదివి డాక్టర్ ప్రాక్టీస్ చేస్తున్న నకిలీ వైద్యుడు దిలీప్**
**టీజీఎంసీ, ఐఎంఎ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు**

**వరంగల్ ఈస్ట్, జనవరి 07(జనం సాక్షి)**



వరంగల్ నగరం కరీమాబాద్ లో సోమవారం సాయంత్రం వరంగల్ జిల్లా మెడికల్ టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది .
వరంగల్ కి చెందిన ఎ. దిలీప్ ఫిజియోథెరపీ చదివి తాను డాక్టరు మరియు జనరల్ ప్రాక్టీషనర్ అని పేర్కొంటూ చట్ట విరుద్ధంగా ఆధునిక వైద్యం ప్రాక్టీస్ చేయడంతో పాటు ఔషద నియంత్రణ చట్ట వ్యతిరేకం గా సుమారు 3000 రూపాయల విలువ గల మందులు నిల్వ అక్రమంగా ఉంచినట్లుగా వరంగల్ మెడికల్ టాస్క్ ఫోర్స్ బృందం గుర్తించింది. సదరు ఫిజియో థెరపిస్ట్ ఎ. దిలీప్ ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్ ఏర్పాటు చేసి అశాస్త్రియంగా అధిక మోతాదు అంటిబయోటిక్ , స్టేరాయిడ్, నొప్పి నివారణ ఇంజెక్షన్స్ రోగులకు ఇస్తునట్టు మరియు తాను డాక్టరు అని పేర్కొం టూ ప్రెస్క్రిప్షన్ రాస్తునట్లు అధికారులు తగు ఆధారాలు సేకరించి ఎన్ ఎం సి చట్టం 34,54 ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా నరేష్ కుమార్ తెలియ చేశారు. ఔషద నియంత్రణ అధికారుల అనుమతి లేకుండా సుమారు 3000 రూపాయలు విలువ మందులు అక్రమంగా నిల్వ ఉంచినదుకు గాను డ్రగ్స్ , కాస్మెటిక్ చట్టం (1940 )సెక్షన్ 18సి ప్రకారంకేసు నమోదు చేయనున్నట్లు వరంగల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్ తెలియ చేశారు. ఫిజియో థెరపీ చదివిన వారు అసలు డాక్టర్స్ కాదని వారు డాక్టర్ అని బోర్డు పెట్టొద్దని, ఆధునిక వైద్యం చేసే అర్హత కాని, అనుమతి కాని వారికి లేదని మరియు వారు ఎటువంటి అల్లోపతి మందులు
రాయడం కాని, ఇంజెక్షన్స్ కాని ఇవ్వకూడదని, వారు చేసే ఫిజియో థెరపి ప్రాక్టీస్ కూడా జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల నుండి అనుమతి తీసుకోవాలని డా నరేష్ కుమార్ తెలియ చేశారు. మెడికల్ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలో టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా నరేష్ కుమార్, జిల్లా ఔషద నియంత్రణ అధికారి అరవింద్ కుమార్, ఐ ఎం ఎ రాష్ట్ర ఆంటీ క్వాకరీ చైర్మన్ డా అశోక్ రెడ్డి, వరంగల్ జిల్లా ఐ ఎం ఎ కోశాధికారి డా శిరీష్ లు పాల్గొన్నారు.

# రైతుల ఆనందం చూసి తట్టుకోలేక గగ్గోలు పెడుతున్న ప్రతిపక్షాలు..!

**మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, (జనంసాక్షి)**



రైతుల ఆనందం చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీలో 24 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. రైతు రుణమాఫి, బోనస్, రైతు భరోసా సంవత్సరానికి 12,000 ఇలా రైతులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి ప్రభుత్వ హయాంలో రైతు బంధు 10,000 ఇస్తే తాము 12 వేలకు పెంచితే, దానిపై కూడా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలు,ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన రైతుల వివరాలను గ్రామపంచాయతీల వారీగా రైతుల పేర్లతో బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంథని పట్టణంలో త్వరలో ఆధునిక హంగులతో బ్యాట్మెంటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

# నా లైఫ్ టర్నింగ్ మోడల్ స్కూల్ లోనే..

**నిజామాబాద్ జిల్లా గోవింద్ పెట్ లో మెరిసిన ఆణిముత్యం.**
**విద్యుత్ శాఖలోని జెన్కోలో ఏఈఈగా ఉద్యోగం సాధించిన సిరిపురం శ్వేత.**
**ఐఏఎస్ సాధించడమే లక్ష్యం.**

**ఆర్మూర్,జనవరి 7 ( జనం సాక్షి):**






చదివింది ప్రభుత్వ పాఠశాలే.. విద్యాబుద్ధులు నేర్పిన గురువులనే ఆదర్శంగా తీసుకుని వారి విలువైన సలహాలు సూచనలను పాటిస్తూ, తనకు తెలియని విషయాలను తెలుసుకోవాలన్న జిజ్ఞాసనా లైఫ్ టర్నింగ్ మోడల్ స్కూల్ లోనే జరిగిందంటూ తెలంగాణ జెన్కో ఏఈఈ గా ప్రభుత్వ ఉద్యోగంలో సిరిపురం శ్వేతను ఉన్నతమైన స్థానంలో నిలబెట్టింది. ప్రైవేట్ కంపెనీల్లో లక్షల జీతాలను తృణప్రాయంగా వదిలిపెట్టి తాను అనుకున్న లక్ష్యాన్ని త్వరలోనే తీర్చుకుంటానని దృఢ సంకల్పంతో చెప్పిన తీరు శభాష్ అనిపించింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం గోవింద్ పెట్ గ్రామానికి చెందిన సిరిపురం శ్వేత విద్యుత్ శాఖలోని జెన్కోలో ఏఈఈగా ఉద్యోగం సాధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. గోవింద్ పెట్ గ్రామానికి చెందిన సిరిపురం సాయేందర్, నాగమణి దంపతుల కుమార్తె శ్వేత ఒకటవ తరగతి నుంచి మూడవ తరగతి వరకు గోవింద్ పెట్ లోని శ్రీవాణి విద్యానికేతన్ లో 4 నుంచి 8వ తరగతి వరకు ఆర్మూర్ లోని సెంట్ ఆన్స్ స్కూల్, 9,10వ తరగతి ఆర్మూర్ లోని మోడల్ స్కూల్, ఇంటర్మీడియట్ (ఎంపీసీ) హైదరాబాద్ లోని శ్రీగాయత్రీలో విద్యనభ్యసించింది. ఎంసెట్ ఇంజనీరింగ్ లో 3,852 ర్యాంక్ సాధించి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో మెకానికల్ ఇంజనీరింగ్ లో సీటు సాధించారు. 2019 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తుండగా క్యాంపస్ సెలక్షన్ లో ఎల్ అండ్ టి, మారుతి సుజుకి కంపెనీలో రూ. 10 లక్షల ప్యాకేజీకి ఎంపిక కాగా శ్వేత జయిన్ కాలేదు. 2024 జులై లో విద్యుత్ శాఖలోని జెన్కోలో ఏఈఈ ఉద్యోగానికి పరీక్ష రాసింది. ఉద్యోగ సాధనకు కృషి చేస్తూనే కష్టపడి చదివి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు కళాశాలలో రోబోటిక్ అండ్ అటానమస్ కోర్స్ (పిఏఎస్) లో పీజీ సీటు సాధించింది. బెంగళూరులో పీజీ కోర్స్ చదువుతుండగానే విద్యుత్ శాఖలోని జెన్కోలో ఏఈఈగా ఉద్యోగం సాధించి సోమవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ లోని పాల్వంచలో ఏఈఈగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంజనీరింగ్ విద్యాభ్యాసం చేస్తుండగానే ఏఈఈగా ఉద్యోగం సాధించిన శ్వేతను తల్లిదండ్రులు సాయందర్ నాగమణిలు మిఠాయిలు తినిపించి హర్షం వ్యక్తం చేశారు. జెన్కోలో ఉద్యోగం సాధించిన శ్వేతను గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందించారు .తల్లిదండ్రుల కల ఐఏఎస్ గా చూడాలన్న లక్ష్యాన్ని మరింత కష్టపడి రాణిస్తానని శ్వేత తన మనసులోని మాటను చెప్పారు.

# అస్వస్థకు గురైన మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థినులను పరామర్శించిన సుడా చైర్మన్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 07 (జనం సాక్షి) :**



**అస్వస్థతకు గల కారణాలను తెలుసుకొని విచారణ జరుపుతామని భరోసా ఇచ్చిన సుడా చైర్మన్**
**దాదాపు అందరు విద్యార్థినులు స్వల్పంగా అస్వస్థ గురయ్యారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న హాస్పిటల్ సూపరింటెండెంట్ వీరారెడ్డి.**

మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో అస్వస్థకు గరై ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరామర్శించారు. అస్వస్థకు గల కారణాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కాలిఫ్లవర్ కూర తిన్నామని రాత్రి పదకొండు గంటల సమయంలో కొందరికి కడుపు నొప్పి , మరికొందరికి వాంతులు విరేచనాలు మొదలయ్యాయని నరేందర్ రెడ్డితో విద్యార్థినులు చెప్పారు. ముప్పై మంది విద్యార్థినులు అస్వస్థకు గురయ్యారని అందులో ఇరవై మంది స్వల్పంగా, మిగితా పది మంది కొంత ఎక్కువగా అస్వస్థకు గురయ్యారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. అస్వస్థకు గల కారణాలను ల్యాబ్ ద్వారా పరీక్ష చేయాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ వీరారెడ్డిని నరేందర్ రెడ్డి కోరారు. సూపరింటెండెంట్ వీరారెడ్డి మాట్లాడుతూ, స్వల్పంగా అస్వస్థకు గురైన విద్యార్థినులకు మందులు ఇచ్చి పంపించామని మిగితా వారికి చికిత్స చేసి పంపిస్తామని అస్వస్థ కు గల కారణాలను విశ్లేషించి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ వెంట తాజొద్దిన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మెరాజ్, అశ్రాఫ్, బషీర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, నదీమ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# రబీ కాలానికి సంబంధించిన సీఎంఆర్ త్వరగా సరఫరా చేయాలి-జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 7 (జనం సాక్షి)**




2023-24 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి సి.ఏం.ఆర్. త్వరగా సరఫరా చేయాలనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని రైస్ మిల్లర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం రబీ కాలానికి సంబంధించిన సి.ఏం.ఆర్. లక్ష్యానికి అనుగుణంగా మిల్లర్లు సరఫరా చేయలేదని, ఈ నెల 25 లోగా నిర్ణయించిన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ సరఫరా చేయని పక్షంలో సదరు రైస్ మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆయా రైస్ మిల్లులను తనిఖీ చేసి స్టాక్ లను పరిశీలించాలని తెలిపారు. సి.ఏం.ఆర్. త్వరితగతిన సరఫరా చేయాలని అన్నారు. గత ఖరీఫ్ లో సి.ఏం.ఆర్. సరఫరాలపై కలెక్టర్ వాకబు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయించిన తేదీ లోగా సి.ఏం.ఆర్. సరఫరా చేయని మిల్లర్లకు నోటీసులు జరీచేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు మిల్లర్లు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, మిల్లర్లు పాల్గొన్నారు.

# గరికపాటిపై అభ్యంతరక ప్రచారాలు

**చట్టప్రకారం చర్యలు తప్పవని బృందం హెచ్చరిక**

హైదరాబాద్: ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో
ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

# బంగారు పతకాలు సాధించిన కరీంనగర్ ముద్దు బిడ్డలకు ఘన సన్మానం

**కరీంనగర్ బ్యూరో, జనవరి 07 (జనం సాక్షి) :**




బంగారు పతకాలు సాధించిన కరీంనగర్ ముద్దు బిడ్డలు, కిషన్ రావు, రాధలకు , పతకాలు సాదించుటకు శిక్షణ ఇచ్చిన కోచ్ లక్ష్మణ్ లకు అంబేద్కర్ స్టేడియంలో వారికి ఘన సన్మానం చేసి, ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు బుర్ర జగదీశ్వర్ గౌడ్ తెలిపినారు. ఇంకా ఎంతో మంది మరుగున పడుతున్న క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సాహం అందించాలని కోచ్ ను కోరి, వారిని సన్మానించిన ఉమ్మడి జిల్లా ప్రతినిధి, జిపి గ్రౌండ్ ఫ్రెండ్లీ వాకర్ అసోసి యేషన్ గౌరవాధ్యక్షులు బుర్ర జగదీశ్వర్ గౌడ్. హైదరాబాదులో స్టేట్ 11వ నేషనల్ మాస్టర్ చాంపియన్స్ లో మొదటి స్థానంలో మూడు బంగారు పతకాలు వాకింగ్, రన్నింగ్ విభాగంలో సాధించిన 63 సంవత్సరముల కరీంనగర్ ముద్దు బిడ్డ పెంచాల కిషన్ రావు, రాధ లను అంబేద్కర్ స్టేడియంలో బుర్ర జగదీశ్వర్ గౌడ్ తోపాటు వారి మిత్రులు శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సుధాకర్ రావు, జగదీశ్వర్ గౌడ్, రవీందర్, రమణా రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అశోక్ సుమన్, వెంకటేష్ తదితర సీనియర్ , రెగ్యులర్ వాకర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుడి ఆవరణ స్థలం కబ్జా, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

**గద్వాల నడిగడ్డ, జనవరి 7 జనం సాక్షి**





జోగులాంబ గద్వాల పట్టణ సమీపంలోని 7వ వార్డ్ పిల్లిగుండ్ల కాలనీలో గల ముడుపుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని దేవాలయ పూజారి, మాజీ మున్సిపల్ చైర్మన్ గుడి ఆవరణ స్థలాన్ని కబ్జా చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారనీ మంగళవారం పెద్ద ఎత్తున కాలనీవాసులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, కురువపల్లయ్య, సిపిఐ ఆంజనేయులు కలిసి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అర్చకులకు మున్సిపల్ మాజీ చైర్మన్ కు సహకరిస్తున్న అధికారులు పిల్లిగుండ్ల కాలనీ ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం ఉదయం 10 గంటల నుండి కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించామని ,వారు చేస్తున్నది సరైనదేనని వారికి తగు న్యాయం చేయాలని లేకపోతే ఆయా పార్టీల నుంచి తాము ఉద్యమిస్తామని సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు కాలనీవాసులతో కలిసి విషయాన్ని వివరించామని స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ దీనిపైన విచారణ చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి





**మంచినీటి సరఫరా కొరకు 52 కోట్లు పనులకు భూమి పూజ నిర్వహించిన మంత్రి**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 7 (జనం సాక్షి)**



కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం బాన్సువాడ మున్సిపల్ ప్రాంతంలో అమృత్ పథకం క్రింద 52 కోట్లతో మంచినీటి సరఫరా పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,50 సంవత్సరాలకు సరిపడే త్రాగునీటి సౌకర్యాల పనులు చేపట్టడం అభినంద నీయమన్నారు. గడచిన 4 ఎండ్లలో ఒక వేయి కోట్ల రూపాయలతో నియోజక వర్గంలో పనులు చేపట్టడం జరిగిందని, తెలిపారు. నియోజక వర్గంలో 175 కోట్లతో పేదలకు 3500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, తెలిపారు. జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ శేట్కార్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమృత్ పథకం క్రింద 52 కోట్లతో త్రాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతం వంద శాతం ఇరిగేషన్ ప్రాంతమని అన్నారు. బాన్సువాడ నియోజక వర్గం శాసన సభ్యులు, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడ నియోజకవర్గంలో 70 వేలకు పైగా ఇళ్లు, మున్సిపల్ లో 8900 ఇళ్లు ఉన్నాయని ఆయా గృహాలకు సరిపడా త్రాగునీటి సౌకర్యాలకు గత స్కీమ్ ద్వారా ఉన్నప్పటికీ, పెరుగుతున్న జనాభా, అవసరాల దృష్ట్యా అమృత్ 2 పథకం క్రింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాబోయే తరాల వారికి నీటి ఎద్దడి సమస్యలు లేకుండా ఉండేందుకు పనులను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే ఉన్న నీటి ట్యాంకులకు తోడు మరిన్ని ఎక్కువ సామర్థ్యం గల ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. కోటగల్లి గుట్టమీద 18 లక్షలు లీటర్ల, ఇతర ప్రాంతాల్లో 8 లక్షలు,6 లక్షల, 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులను నిర్మించనున్నట్లు తెలిపారు. రాబోయే 50 సంవత్సరాల వరకు అవసరమయ్యే నీటి సౌకర్యాలను సమకూరుస్తున్నమని తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గంలో సాగు, త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఒకవేయి కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. గరీబొల్లకి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, త్వరలో ఆ ప్రక్రియ ప్రారంభం చేస్తామని తెలిపారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు భూములు మంజూరు చేయాలని కోరారు. అంతకు ముందు 40 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రోహిబిష్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు.రోడ్డు సేఫ్టీ కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ ను మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు, రైతు కూలీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**కరీంనగర్ బ్యూరో, జనవరి 07 (జనం సాక్షి)**



**ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో వ్యవసాయ కూలీలకు ధీమా.**

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి.**

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు వరంలాంటిందని, ఈ పథకం వారికి ధీమా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ పీసీసీ పిలుపు మేరకు కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లేక్సీకి పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆర్థికంగా అదుకునేందుకు ఈ కొత్త పథకం ప్రభుత్వం అమల్లోకి తెస్తున్నదన్నారు. రైతు, రైతు కూలీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా ఈ పథకాలను అమలు చేయనున్నదన్నారు. కూలీలకు ఇబ్బంది తలెత్తకుండా ఆనాడు కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఏటా రైతు బంధు కింద 10 వేలు ఇస్తే, ప్రజా ప్రభుత్వం నేడు 12 వెలు ఇవ్వనున్నదని, వ్యవసాయం చేసుకోవునే రైతులకు రైతు భరోసా ఇస్తున్నామన్నారు. కోనుగోలు కేంద్రాలలో గత ప్రభుత్వం దోపిడీ చేసిందని, గత ప్రభుత్వం హయాంలో రైతులు కోనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాసే వారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వం చెల్లించినట్లుగా రాళ్ల రప్పలు, రోడ్లు రహదారులకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా వర్తించదని, సాగు చేసే రైతులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జీ పురమల్ల శ్రీనివాస్, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, రాజేశం, మడుపు మోహన్, కర్ర ప్రసన్నరెడ్డి, ఎస్.ఎల్.ఎన్ గౌడ్, ఎండీ మోహసిన్ , శ్రావణ్, రాజేశం, పులి ఆంజనేయులు గౌడ్, రవీంద్రచారి, గోపగోని బసవయ్య గౌడ్, తాళ్లపల్లి సంపత్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కోంద్ర సురేశ్, శంకర్, ఇర్ఫాన్, బండారి రమేశ్, కొండల్ రావు, గంకిడి లక్ష్మారెడ్డి, పోల్ రమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు



**మంథని, (జనంసాక్షి) :**



**రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు**

**మంథని పట్టణానికి రింగ్ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు**

**6 నెలలో పురపాలక కార్యాలయం పూర్తి చేయాలి**

**24 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు**

మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మంథని లో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమా సురేశ్ రెడ్డితో కలిసి మంథని పట్టణంలో పర్యటించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 24 కోట్ల 5 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ. పట్టణంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 30 కోట్లతో రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. మంగళవారం పురపాలక కార్యాలయం, డంపింగ్ యార్డ్ నందు సేగ్రిగేషన్ షెడ్, కంపోస్ట్ షెడ్, ఆఫీసు రూమ్ సెక్యూరిటీ రూమ్, టాయిలెట్స్, వేయింగ్ బ్రిడ్జ్ పెద్దపల్లి, గోదావరిఖని, కాటారం నుండి మంథని పట్టణానికి వచ్చే రొడ్డు ప్రారంభంలో ఆర్చిలను 9 కోట్ల 20 లక్షలతో చేపట్టామని అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో శ్రీరామ్ నగర్ నుంచి మాత శిశువు హాస్పిటల్ , పోచమ్మ వాడ నుంచి గోదావరిఖని క్రాస్ రోడ్ , లైన్ గడ్డ, గంగాపురి క్రాస్ రోడ్, గిట్ల రమణారెడ్డి విగ్రహం, కూచి రాజు పల్లి క్రాస్ రోడ్ వద్ద 6 కోట్ల 71 లక్షలతో సెంట్రల్ లైటింగ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. మంథని పట్టణంలో సమీకృత వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ నిర్మాణం, వివిధ వార్డులలో సిసి రోడ్లు, సైడ్ డ్రైయిన్ నిర్మాణ పనులను 8 కోట్ల 14 లక్షలతో మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు. ఈరోజు మొత్తం పట్టణంలో 24 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. 6 నెలల కాలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని మంత్రి అధికారులకు సూచించారు. గత 10 సంవత్సరాలలో మంథని ప్రాంతం ఆశించిన అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి సహచర మంత్రుల సహకారంతో మంథని నుంచి మంచిర్యాలను కనెక్ట్ చేస్తూ 140 కోట్లతో గోదావరి నదిపై బ్రిడ్జి మంజూరు చేసుకున్నామని, అదే విధంగా మంథని పట్టణానికి రింగ్ రొడ్డు నిర్మాణం వల్ల పట్టణ విస్తరణ పెరుగుతుందని మంత్రి తెలిపారు. మంథని పట్టణ విస్తరణ జరుగడం వల్ల దేశ విదేశాలలో ఇతర ప్రాంతాలలో స్థిర పడిన ప్రజలు సొంత గ్రామాలలో ఇండ్లు నిర్మించుకునేందుకు, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రోడ్ల అభివృద్ధి ద్వారా వాణిజ్య సదుపాయాలు మెరుగవుతాయని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఆలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రాజయ్య, ఈఈ సంపత్ , ఏఈ. మౌనిక , సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి-**

**మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 7 (జనం సాక్షి)**





కామారెడ్డి పట్టణం లో గాంధీ గంజ్ లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నియామకమైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇచ్చి పదవులు ఇచ్చి గౌరవిస్తాం అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు మౌలిక సౌకర్యాలను మెరుగుపరచడానికి మరియు రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రభుత్వ నిధులను మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. రైతుల రుణమాఫీ ఎన్ని కష్టాలు వచ్చినా అమలు చేసి తీరుతామన్నారు.సంక్రాంతి నుండి రైతు భరోసా కూడా అందియ్యబోతున్నామన్నారు. కేటీఆర్ ముఖ్యమంత్రిని అగౌరపరిచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అబద్దాలతో బదనాం చేయాలనుకుంటున్నాడని ఆరోపించారు. తన అవినీతి బయటపడకుండా తప్పించుకునే ప్రయత్నం చేయగా కోర్టు మంగళవారం తన తీర్పుతో కేటీఆర్ కు బుద్ధి చెప్పిందని, సిబిఐ ఈడీ విచారణకు హాజరుకావాలని తెలిపిందని అన్నారు.ఇల్లు లేని అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రయత్నం చేస్తున్నామని,ఈనెల 28 నుండి కొత్త రేషన్ కార్డులు అర్హులకు మంజూరు చేయబోతు న్నామన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పదవులు అలంకార ప్రాయం కావద్దని, రైతుల శ్రేయస్సు కోసం కష్టపడాలని,రైతుల సమస్యల పరిష్కారం దిశగా ఎదగాలని, కరీంనగర్ లో ముల్కనూర్ సోసిటీని పాలకవర్గం సందర్శించి అక్కడి విధానాలను అమలు చేయాలన్నారు .ప్రతి పక్షాలు రకరకాల విమర్శలు చేస్తున్నాయని,అబద్దాన్ని వందసార్లు చెప్తే నిజమని నమ్మే ప్రమాదం ఉందన్నారు.నాటి పాలకులు చేసిన 8 లక్షల కోట్ల అప్పు ఫలితంగా నూటికి 10 శాతం వడ్డీ చొప్పున 6500 కోట్లు నెలకు వడ్డీ కడుతున్నామన్నారు.వెళ్లే ముందు 40 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని,దుర్భర పరిస్థితుల్లో కూడా ప్రతి మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఆరు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని,నాడు దండిగా ఆదాయం ఉండి కూడా కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని,ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారన్నారు.నాడు ప్రగతి భవన్ వెళ్ళడానికి వెళ్తే గేట్లు మూసివేశారని,విగ్రహాలు పెట్టడం గొప్ప కాదని,వాళ్ళను గౌరవించుకోవడం గొప్ప అన్నారు.అంబెడ్కర్ కు ఒక్కరోజైనా దండ వేయలేదని,కామారెడ్డి పెద్ద చెరువుకు సంబంధించి టూరిజంగా మార్చేలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు,విద్యార్థుల ఆటపాటలు, నైపుణ్యం పెంపొందించేందుకు 50 లక్షలు మంజూరు చేస్తానన్నారు. ఈ సందర్భంగా సురేష్ షెట్కర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదని,ఏపీలో కాంగ్రెస్ కు నష్టం కలుగుతోందని తెలిసి కూడా నాడు సోనియాగాంధీ హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు.ఫలితంగా వచ్చే ఆదాయంతో తెలంగాణ ధనిక రాష్ట్రంగా మారిందన్నారు.ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా కేసీఆర్ తీర్చిదిద్దారని ఎద్దేవా చేశారు.తెలంగాణ ఇచ్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ లాంటి గొప్ప వ్యక్తి చనిపోతే కేసీఆర్ ఎందుకు పోలేదని ప్రశ్నించారు.కెసిఆర్ కుటుంబానికి తెలంగాణను దోపిడీ చేయడం తప్ప తెలంగాణ ఇచ్చిన వాళ్లను గౌరవించడం రాదన్నారు.కామారెడ్డి మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టభద్రుల గొంతుకనై శాసనమండలిలో గర్జిస్తా

**పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు.**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 07 (జనం సాక్షి)**



ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాలో ఉన్న పట్ట బద్రులను కలిసి పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు మద్దతు కోరడం జరిగింది. వారు ఈ కార్యక్రమంలో భాగంగా పట్టభద్రులతో మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలకు సంరక్షణ చట్టం అవసరం ఉందని దీనికోసం 2018 లోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రైవేట్ బిల్లు పెట్టించామని తదనంతరం వచ్చిన గవర్నమెంట్ దానిని పట్టించుకోక మరుగున పడేసిందని ప్రశ్నించే గొంతుకను మండలికి పంపిస్తే తిరిగి ప్రైవేటు బిల్లు కై కృషి చేస్తానని అన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు కనీస వేతనములుకై కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల శ్రేయస్సే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నానని ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇన్సూరెన్స్ మంజూరు కై కృషి చేస్తాననిజాబ్ క్యాలెండర్ అమలుకై కృషి చేస్తానన్నారు.ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా కాలేజీలు మూతపడే స్థితిలో ఉన్నాయని ఫిజ్ రియంబర్స్మెంట్ విడుదలకు కృషి చేస్తానన్నారు. 22 సంవత్సరాలుగా ప్రజా సమస్యల కొరకు ప్రజాసేవకై పని చేస్తున్నానని, పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే నాయకుడిలా కాకుండా సేవకుడిలా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు పచ్చునూరి సురేందర్, బండ శ్రీకాంత్ వివిధ పాఠశాల కరస్పాండెంట్లు పండుగ రమేష్ , అనంతుల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ట్రస్మా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వంతెన ప్రారంభోత్సవంతో తీరిన ప్రజల చిరకాల సమస్య

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయం

### ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, జనవరి 7 (జనంసాక్షి)**





నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాలలో ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి తో పాటు కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. పట్టణంలో నూతనంగా 20 లక్షలతో నిర్మించనున్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కు ప్రజల కోరిక మేరకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే నేతకాని భవనానికి, ముదిరాజ్ భవనానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందని, ఇప్పటికే నియోజకవర్గంలో 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అనంతరం కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో లోతు వాగు వంతెనను 15 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టి ప్రారంభించడం జరిగింది. గ్రామస్తుల చిరకాల వాంఛ తీర్చడానికి గ్రామానికి 7 సార్లు వెళ్లి ఇచ్చిన హామీని నెరవేర్చి సమస్యల పరిష్కారానికి మార్గము చూపుతున్నారని గ్రామస్తులు కృతజ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా ఏమైంది వివేక్ మాట్లాడుతూ నక్కలపల్లి రహదారికి కూడా త్వరలో నిధులు మంజూరు చేసి బీటి రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటానని, కొన్నిచోట్ల ఫారెస్ట్ అనుమతుల కోసం ఎంపీ వంశీకృష్ణ తో కలిసి కేంద్ర మంత్రులతో మాట్లాడడం జరిగిందని త్వరలోనే అనుమతులు వస్తాయని దాని ద్వారా కొన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం అవుతుందని అన్నారు. మల్లంపేట గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో డప్పు చప్పులతో ర్యాలీ నిర్వహించారు.

గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వివేక్ పూలమాలవేసి సీసీ రోడ్ల డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రక్షణ గోడల నిర్మాణంతో రోడ్డు ప్రమాదాల నివారణ

**నిర్మల్ బ్యూరో, జనవరి07 (జనంసాక్షి)**



జాతీయ రహదారి నం (61) బ్రిడ్జిలపై రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే అధికారులు పాత సైడ్ వాల్స్ తొలగించి నూతనంగా కాంక్రీటు, సిమెంటుతో నాణ్యమైన రక్షణ గోడలు నిర్మిస్తున్నారు. నిర్మల్ నుండి భైంసా వైపు వెల్లే జాతీయ రహదారిపై గతంలో తరచు రోడ్డు ప్రమాదాలు జరిగి ఎందరో మంది మృత్యువాత పడేవారు. మృత్యువాత పడ్డ కుటుంబాలు వీడినపడ్డాయి. ప్రభుత్వం గుర్తించి హైవే అధికారుల చొరవతో నిర్మల్ నుండి భైంసా వరకు సేఫ్టీ లైట్స్,,మూలమలుపు సూచికల బోర్డులు,రోడ్డుపై మార్కింగ్ గుర్తులు ఏర్పాటు చేశారు.దీంతో మంజులపూర్,తలెవెద, సిర్గాపూర్, నర్సాపూర్, కల్లూరు, మటేగావ్ తదితర గ్రామాల ప్రజలు, వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలు నివారించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చైనా మాంజా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

## నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్ బ్యూరో, జనవరి 07 (జనంసాక్షి)**



చైనా మాంజా వాడడం వలన ప్రజలకు జంతువులకు ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉన్నదని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజ విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీ లు నిర్వహించాలని నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యవరణానికి విపత్తుగా మారడం తో పాటు చైనా మాంజ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని , చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు..చట్ట. విరుద్ధంగా ఎవరైనా చైనా మంజా నిలువచేసిన, అమ్మిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్న డయల్ 100 నంబర్కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలనీ జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.





# మంత్రి కొండా సురేఖ మాటలు బేఖాతరు

## తెలంగాణ కాలనీలో తీరని సమస్య

### డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

### మురుగు నీటి మధ్య గృహవాసుల జీవనం

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**వరంగల్ ఈస్ట్, జనవరి 07 (జనం సాక్షి)**

తెలంగాణ కాలనీ వాసుల సమస్యలు తీర్చండి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని వరంగల్ మున్సిపల్ కమిషనర్ తో పాటు సంబంధిత అధికారులను ఏడాది క్రితం రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించిన కూడా నేటి వరకు అక్కడి సమస్యలు అలాగే ఉండడంతో మంత్రి మాటలను బేఖాతరు చేసినట్టుగా తెలుస్తుంది. తెలంగాణ కాలనీవాసులు తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీటి మధ్య జీవిస్తున్నామని తమ సమస్య ఏళ్ల తరబడి అలాగే ఉందని పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి కాలనీవాసులు గత ఏడాది డిసెంబర్లో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమస్యపై స్పందించిన మంత్రి తాను తెలంగాణ కాలనీకి వస్తానని చెప్పి వరంగల్ నగరంలోని 42 వ డివిజన్ రంగసాయిపేటలోని తెలంగాణ కాలనీకి గత ఏడాది డిసెంబర్ 23న వచ్చి అక్కడి సమస్యను పరిశీలించారు. అక్కడి ప్రజలకు డ్రైనేజీ వ్యవస్థ సమస్య తీరుస్తానని హామీ ఇవ్వడమే కాకుండా పక్కనే ఉన్న అపార్ట్మెంట్ నుండి కిందికి బైపాస్ రోడ్డుకు కలిసే విధంగా మోరి నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు ఒకవేళ అపార్ట్మెంట్ వాళ్లు ఒప్పుకోకపోతే వారి యొక్క ఆక్యుపేషన్ సర్టిఫికెట్( ఓసి) ఇవ్వద్దని అధికారులకు చెప్పారు. ఇప్పటికీ ఏడాది కావస్తున్నా ఆ సమస్య అలాగే ఉంది.మోరీల్లో మురుగునీరు పేరుకుపోయి పక్కనే ఉన్నటువంటి గృహాల్లోకి వెళ్లడమే కాకుండా గృహవాసులు తమ ఇండ్లలోకి వెళ్లకుండా రోడ్డుమీదనే మురుగునీరు నిలవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు గృహవాసులయితే తమ ఇండ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లడమే కాకుండా తమ ఇండ్లను అమ్ముతున్నట్లు ఇంటిముందు బోర్డులు పెట్టడం కనిపిస్తుంది.ఈ కాలనీలో ప్లాట్లు చేసి విక్రయించినటువంటి వారు ప్లాన్ ప్రకారం నీరు ఎటు వెళ్లాలో ఉన్నా కూడా పట్టించుకోకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైనట్లు గృహవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ కాలనీకి ఒక్క



తెలంగాణ కాలనీ వారు వాడుకునే వాటరే కాకుండా రంగసాయిపేటలోని వాటర్ ట్యాంకు, సగర వీధి, పెరిక వాడ, హరిజనవాడకు చెందిన నీరు కూడా ఇటువైపే రావడం వల్ల ఇక్కడ నీరు నిలిచి తీవ్ర దుర్గంధ భరితమైన పరిస్థితి ఏర్పడింది. ఇక వర్షాకాలం వస్తే ఇంకా పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కాలనీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు తీసుకోవాలని గృహ వాసులు కోరుతున్నారు.

# శేరిలింగంపల్లిలో మెరుగైన మౌలిక వసతుల కల్పన





## హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి

**శేరిలింగంపల్లి, జనవరి 07 (జనంసాక్షి) :**

హైదరాబాద్ విశ్వ నగరానికి మకుటాయ మానంగా విరాజిల్లుతున్న శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని సకలహంగులతో తీర్చిదిద్దడానికి, ఆధునిక మౌలిక వసతుల కల్పనకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తామని హైదరాబాద్ నగర మేయర్, నగర ప్రథమ పౌరురాలు గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు చందానగర్ డివిజన్ పరిధి విశ్వేశ్వరయ్య కాలనీలోగల నాలా ను రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీతో కలిసి మేయర్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య కాలనీ మరియు ఆదర్శ్ నగర్ కాలనీ ప్రాంత ప్రజల నుండి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ద్వారా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి శేరిలింగంపల్లిలో నాలాల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకై హలో విజ్ఞప్తులు అందిన దరిమిలా ఆయా నాలాల విస్తరణ పనులను త్వలోనే చేపట్టనున్నామని తెలిపారు. శేరిలింగంపల్లి పరిధిలో నాలాల పరివాహక ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులను కలగకుం డా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలంలో ప్రతిసారి కొద్దిపాటి వర్షానికే నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆస్తి నష్టం, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని , మియాపూర్ పటేల్ చెరువు ఔట్ లెట్, ఎస్టిపి ఔట్ లెట్ నీటి ప్రవాహం నాల నుండి వెళ్తుందని, ప్రజలకు నాలా పొంగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని భరోసాలు వ్యక్తంచేశారు. రాబోయే వర్షాకాలంలోపు నాలా విస్తరణపనులు చేపట్టి పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వారు పునరుద్ఘాటించారు. చెరువుల సుందరీకరణ మరియు వాటి సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ప్రధానంగా విలువైన చెరువు స్థలాల సంరక్షణ, చెరువు కట్టల పటిష్టం, మురుగునీరు చేరకుండా డైవర్షన్ ఛానెళ్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం సహా పలు మౌలిక సదుపాయాలతో కూడిన ఇతర అభివృద్ధి పనులతో అనతికాలంలోనే చెరువుల రూపురేఖలు మార్చి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు కృషి చేస్తామని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో జంట సర్కిళ్ల కమిషనర్లు మోహన్ రెడ్డి, ముకుంద రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, జిహెచ్ఎంసి అధికారులు ఎస్ఇ శంకర్ నాయక్, ఈఈ కెవిఎస్ రాజు, డిఈ దుర్గ ప్రసాద్, ఏఇ సంతోష్ కుమార్, ఇరిగేషన్ డిఇ నళిని, ఏఇ పావని మరియు కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**శేరిలింగంపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి త్వరలోనే అందుబాటులోకి...**

చాలాకాలంగా ప్రయాణికులకు వర్షాకాలం లో పలు సవాళ్లు విసురుతున్న శేరిలింగంపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే ప్రజలకు దానిని పూజిస్తాయిలో అందుబాటులోకి తీసుకురానున్నామని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తదితరులతోకలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వర్షం పడిన ప్రతిసారి బ్రిడ్జి కిందకు నీరుచేరి ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర తలనొప్పులు ఎదురయ్యేవని, దీనిని దృష్టిలో ఉంచుకొని నాలుగు కోట్ల రూపాయల నిధులతో బాక్స్ కల్వర్టు మరియు వరద నీటి కాలువ నిర్మాణం పనులను చేపట్టడం జరిగిందన్నారు. పనులన్నీ ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే అవి పూర్తయి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని మేయర్, ఎమ్మెల్యే అరికెపూడి అన్నారు. పనుల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తిచేసి అనుకున్న మేరకు శాశ్వత పరిష్కారం లభించేలా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. అనంతరం నల్లగండ్ల కూరగాయల మార్కెట్ ను పరిశీలించి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. నల్లగండ్ల రైతు మార్కెట్ ఆధునిక సదుపాయాలతో అందుబాటులోకి వస్తే రైతులకు, వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మోహన్ రెడ్డి, ముకుంద రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చందానగర్ సర్కిల్ పరిధిలో చెరువుల ఆక్రమణలు అరికట్టండి

## హైడ్రాకు మదర్ సేవాసమితి వినతి

**శేరిలింగంపల్లి, జనవరి 07 (జనంసాక్షి)**

: శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ సర్కిల్ పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పరిరక్షించాలని కోరుతూ మంగళవారం మదర్ సేవాసమితి చైర్మన్ బి. కొండల్ రెడ్డి హైడ్రాధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం శేరిలింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ చందానగర్ పరిధి గంగారం, హఫీజ్పేట్, మియాపూర్ తదితర డివిజన్ల పరిధిలోని పలు చెరువులు కబ్జా కోరల్లో చిక్కి తమ ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొందని, ఇదే విషయమై హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ని కలిసి పలు ఆధారాలతో సహా నివేదించడం జరిగిందన్నారు. దీప్తి శ్రీనగర్, గూగుల్ ఫ్లాట్స్, మియాపూర్, మదినగూడ, మాతృ శ్రీ నగర్, హఫీజ్పేట్ ప్రాంతంలోని వందల కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమి అక్రమార్కుల భూ దాహానికి ఆవిరైపోయిందని, దానిని తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రభుత్వానికి మంచి ఆర్థిక వెసులుబాటు లభించే అవకాశం ఉందని కొండల్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే పాపం అన్నట్టు శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు కబ్జారాయుళ్లతో చేతులు కలిపి వేలకోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని దిగమింగేసారని, హైడ్రా అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా వాస్తవాలను నిగ్గుతేల్చి ఇటు ప్రభుత్వ భూములను, అటు చెరువులను పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములను ఇప్పుడు కాపాడుకోకపోతే మరి ఎప్పటికీ చరిత్రలో పేజీలుగా మిగిలిపోయి దళారుల పాలవుతాయని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మదర్ సేవాసమితి ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆవడంను మండలంగా ప్రకటించాలని ఎమ్మెల్యేకు వినతి

**బెల్లంపల్లి, జనవరి 7 (జనంసాక్షి)**

బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలంలోని అవడం గ్రామపంచాయతీని మండలంగా ప్రకటించాలని చేయాలని కోరుతూ మంగళవారం ఆవడం మండల సాధన సమితి సభ్యులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతిపత్రాన్ని అందజేశారు. నెన్నెల మండలంలోని ఆవడం గ్రామపంచాయితీని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల ఆవడం, గంగారం, చిన్న వెంకటాపూర్, కొత్తూరు, జెండవెంకటాపూర్, చిత్తాపూర్, మెట్పల్లి, నార్వాయిపేట, గుండ్ల సోమారం, గ్రామ పంచాయితీలలో సుమారు 15,000 నుండి 20,000 వరకు జనాభా ఉందని వివరించారు. విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీసు స్టేషన్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అన్ని పనుల కోసం నెన్నెల మండల కేంద్రానికి వెళ్లాలంటే సరైన రవాణా సౌకర్యం లేక, ఆటోలు ఎంగేజ్ తీసుకుని వెళ్ళాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. నెన్నల మండలంలో సగం కంటే ఎక్కువ జనాభా ఈ గ్రామపంచాయతీలలోనే ఉందని, మండల కేంద్రానికి వెళ్ళాలి అంటే సుమారు 16 కిలో మీటర్ల నుండి 20 కిలో మీటర్ల దూరంలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సాధన సమితి సభ్యులు అన్నారు. ఆవడం గ్రామపంచాయితీని నూతన మండలం కేంద్రంగా ఏర్పాటు చేస్తే పది గ్రామపంచాయితీలకు మధ్యలో ఉండి అందుబాటులో ఉంటుందని, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మండలాల విభజన ప్రక్రియలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సౌలభ్యంగా అందేలా నూతన మండలంగా అవడం గ్రామమునకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. బీమారం, మందమర్రి, నెన్నెల మండల కేంద్రాలకు మధ్యలో ఉన్నందున ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. దీనికి గాను ఎమ్మెల్యే గడ్డం వినోద్ సానుకూలంగా స్పందించారు. ఆవడంను మండలంగా ప్రకటించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచులు సింగతి తిరుపతి, జనగామ తిరుపతి, నాయకులు దుర్గం రవీందర్, ఉయ్యాల మల్లికా దేవి, మహ్మద్ జలీల్, జలంపల్లి భీష్మయ్య, ఉయ్యాల లింగయ్య, శ్రీరాముల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి హామీతో హమాలీ కార్మికుల సమ్మె విరమణ

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జనవరి 7 (జనం సాక్షి)**

హమాలి కార్మికులు (సివిల్ సప్లై విభాగం) గత 7 రోజులుగా చేస్తున్న సమ్మెను ఈరోజు విరమించారు. మంగళవారం హైదరాబాద్ లో జల సౌదా లో రాష్ట్ర పవర్ సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నీ సిపిఐ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ కలిశారు. ఈ సందర్భంగా హమాలి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత 7 రోజులుగా చేస్తున్న ఈ విషయాన్ని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వివరించారు. దీంతో గత సంవత్సరం అక్టోబర్ 4న హమాలి కార్మికులకు ఇచ్చిన హామీ



ప్రకారం కూలిరేట్లను పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే వారికి ఇచ్చే బోనసును రు.7 వేల 5 వందలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు మరికొన్ని డిమాండ్ల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమించినట్లు హమాలి కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి ఉపేందర్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
08 జనవరి 2025

## విద్యుత్ శాఖలో ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ప్రజావాణిలో

# నిరుద్యోగ అభ్యర్థుల అర్జీలు

- అధికారులతో మాట్లాడి భరోసా ఇచ్చిన చిన్నారెడ్డి, దివ్య



**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** గత అక్టోబర్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లో జూనియర్ లైన్మెన్, అసిస్టెంట్ ఇంజనీర్స్ కి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ నిరోద్యోగ వంద మంది అభ్యర్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఉద్యోగాల కోసం ఇప్పటికే పలు కోచింగ్ సెంటర్ లలో సిద్ధం అవుతున్నట్లు వారు తెలిపారు. నోటిఫికేషన్ విషయమై సంబంధిత అధికారులతో ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఫోన్ లో మాట్లాదారు. త్వరలోనే నోటిఫికేషన్ జారీ అయ్యేలా చూస్తామని చిన్నారెడ్డి, దివ్య హామీ ఇచ్చారు. దీంతో నిరుద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇండ్ల కోసం, రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తరలి వచ్చారు. దుబాయ్ లో గల్ఫ్ ఏజెంట్ చేసిన మోసాలపై పలువురు బాధితులు ప్రవాసీ ప్రజావాణిలో అర్జీలు అందజేశారు. మాయమాటలు చెప్పి దుబాయ్ లో బ్యాంక్ క్రెడిట్ కార్డులు తీసుకుని వాటిపై అప్పులు చేసి ఏజెంట్ పరార్ అయ్యారని, ఆ అప్పుల కోసం దుబాయ్ బ్యాంకు అధికారులు తమపై ఒత్తిడి పెంచుతున్నారని , పోలీస్ కేసులు నమోదయ్యాయి అని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ప్రవాసీ ప్రజావాణిలో అర్జీలు అందజేశారు.

**ప్రజావాణిలో 450 అర్జీలు దాఖలు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 450 అర్జీలు అందాయి. ప్రజావాణి ఇన్చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు ఎండార్స్ మెంట్ చేసి, సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడిన చిన్నారెడ్డి పలు దరఖాస్తులను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం రేషన్ కార్డులు పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ద్వారా స్వీకరించారు. దరఖాస్తులను అధికారులు ఆన్ లైన్ లో నమోదు చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 150 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 119, రెవెన్యూ శాఖకు 68, ప్రవాసి ప్రజావాణికి రెండు, ఇతర శాఖలకు సంబంధించి 113 దరఖాస్తులు అందాయి.

## రాష్ట్రంలో గుండాయిజం

# నడుస్తోంది

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్కుమార్
- భూములు కోల్పోతున్న బాధితులకు పరామర్శ



**మంచిర్యాల, జనవరి 7 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంచిర్యాలలో ప్రేమ్ సాగర్ రావు గుండాయిజం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గుడిపేట, వేంపల్లి గ్రామ సరిహద్దులో సుమారు 276 ఎకరాలలో ఏర్పాటు చేయబో యే ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజల భూముల ను ఎలాంటి నోటిఫికేషన్లు, జీవోలు లేకుండా గుంజుకుంటున్నారని ఆరోపించారు. మంచిర్యాలలో మీడియాపై బహిరంగంగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బెదిరింపులకు పాల్పడు తున్నాడు. కాంగ్రెస్ నాయకుల భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని సవాల్ విసిరారు. పేద దళిత వర్గాలకు చెందిన రైతుల భూముల్లో ఎలా ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తారని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో ఎస్సీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో దళితుల భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, బాధితుల వెంట కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, స్థానిక నేతలు ఉన్నారు.

## బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన

- ఏం జరుగుతుందనే ఆరా!

**హైదరాబాద్, జనవరి7 (జనంసాక్షి) :** హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. కేటీఆర్ అరెస్ట్పై స్టేను సైతం ఎత్తివేయడంతో టెన్షన్ పెరిగింది. దీంతో నంది నగర్ నివాసంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ భేటీ అయ్యారు. మాజీ మంత్రి లీగల్ టీమ్స్తో సంప్రదింపులు జరుపుతున్నారు. హై కోర్టు ఫుల్ బెంచ్కు వెళ్లాలా సుప్రీంకోర్టుకు వెళ్లాలా అనే దానిపై సమాలోచనలు చేస్తున్నారు. ఇప్పుడు ఏసీబీ ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానిపై బీఆర్ఎస్లో ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అరెస్ట్ చేస్తే ఇప్పటికిప్పుడు ఏమి చేయాలి అనే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఫార్ములా ఈ-రేసు కేసును అటు ఏసీబీ, ఇటు ఈడీ విచారిస్తున్నాయి. విచారణకు హాజరు కావాలని ఈడీ మాజీ మంత్రికి తెలిపింది. జనవరి 7న తమ ఎదుట హాజరుకావాలని ఈడీ ఇప్పటికే కేటీఆర్కు నోటీసు ఇచ్చింది. మంగళవారం తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో తనకు సమయం ఇవ్వాలని ఈడీని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈడీకి కేటీఆర్ మెయిల్ పంపారు. హైకోర్టుపై ఉన్న గౌరవంతో.. తీర్పు వచ్చేంత వరకు సమయం ఇవ్వాలని విన్నవించారు. అయితే కేటీఆర్ విజ్ఞప్తిపై ఈడీ అధికారులు స్పందించారు. విచారణకు మరో తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈడీ తదుపరి చర్యలపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్కు ఏసీబీ అధికారులు మరోసారి సోమవారం నోటీసులిచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం

# క్యాలెండర్ ఆవిష్కరణ

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)



మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి పోచారం మున్సిపల్ కార్యాలయంలో "సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్"వారి నూతన సంవత్సర క్యాలండర్లను మున్సిపల్ చైర్మన్ బి.కొండల రెడ్డి చేతుల మీదుగా అవిష్కరించారు.అలాగే "తెలంగాణ ఆల్ స్టేట్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సభ్యుల గుర్తింపు కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్,తెలంగాణా ఆల్ స్టేట్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సుప్రభాత్ టౌన్ షిప్ కొర్రెముల యూనిట్ అధ్యక్షులు బంగారి రాజయ్య, మాజీ వార్డ్ సభ్యులు మన్యం, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కంచె బీరయ్య, చుక్కల నర్సయ్య,రాజ నర్సు, సత్యనారాయణ, రఫిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మున్సిపల్ చైర్మన్ నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ వయోధికులు,సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందని, త్వరలో వయోధికులకు సుప్రభాత్ టౌన్ షిప్ కొర్రెములలో గ్రంథాలయం కొరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థలో ఖాళీలు

- 65 ఐ.టి, రెండు పీఆర్ఓల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐటి ఇన్స్ట్రక్టర్, ఇద్దరు పీఆర్ఓ పోస్టులను భర్తీ చేయడానికి నేటి నుండి ఈనెల 10 వతేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఐ.టి. ఇన్స్ట్రక్టర్లకు ఎంటెక్, బీటెక్, ఎంసీఏ లలో కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు, పీఆర్ఓ పోస్టులకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం పది సంవత్సరాల అనుభవం ఉన్నవారు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు ఆసక్తి చూపే అభ్యర్థులు ఈనెల 10 వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా మాసబ్ ట్యాంక్ లోని దేశోద్ధారక భవన్ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరకాస్తుఫారాలను పొంది అప్లై చేయాలని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సంస్థ నేడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

## రాజకీయ కక్షతోనే కేటీఆర్పై అక్రమంగా కేసు

- రేవంత్రెడ్డివి బ్లాక్మెయిల్ రాజకీయాలు : కిశోర్గౌడ్

**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** కేవలం రాజకీయ కక్షతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తప్పుడు కేసులు పెడుతున్నదని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె.కిశోర్ గౌడ్ ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోవడంతో వారి ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలతో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కిశోర్ గౌడ్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దుర్మార్గాలను ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటామని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేంతవరకూ కేటీఆర్ నాయకత్వంలో నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కాగా, ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించుకున్నది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్లోని తన నివాసంలో తన లీగల్ టీమ్లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేపట్టారు.

## అత్యంత ప్రభావశీలురైన భారతీయ ముస్లింల జాబితాలో చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్

**హైదరాబాద్, జనవరి 7 (జనంసాక్షి) :** ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్కు న్యూఢిల్లీ నుండి వెలువడుతున్న ముస్లిం మిర్రర్ ప్రకటించిన అత్యంత ప్రభావశీలురైన వంద మంది భారతీయ ముస్లింల" జాబితాలో స్థానం లభించింది. ఈ విషయాన్ని 'ముస్లిం మిర్రర్' ప్రధాన సంపాదకులు జుబైర్ మంగళవారం నాడు వెల్లడించారు. ఈ మేరకు నశీర్ అహమ్మద్కు ఆయన అంతర్జాలం ద్వారా సమాచారం అందజేశారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు నిర్వహించిన మహత్తర త్యాగమయ పాత్రను వివరిస్తూ 25 ఏండ్లుగా నశీర్ అహమ్మద్ పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రాస్తూ, ఆ సమాచారాన్ని ప్రజల ఏరుకలోకి తీసుకరావడానికి పలు విభిన్న ప్రచార పద్ధతుల ద్వారా నిరంతరం కృషి చేస్తున్నందున, ఆయన కృషికి గుర్తింపుగా 2024 నాటి ఈ జాబితాలో నశీర్కు స్థానం కల్పించినట్లు జబైర్ ప్రకటించారు. భారత దేశంలో మరెవ్వరూ చేయని విధంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర మీద శ్రీ నశీర్ ఇప్పటి వరకు 25 గ్రంథాలు రచించి వెలువరించారని, ఈ గ్రంథాలు దేశంలోకి పలు భాషల్లోకి అనువాదం చేయబడి ప్రచురితం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. గ్రంథ రచన ప్రచురణ చేయడం మాత్రమే కాకుండా దాతల, ప్రజా సంఘాల సహకారంతో నశీర్ వేలాది పుస్తకాలను ప్రచురించి ప్రజలకు, ఎంపిక చేసిన గ్రంథాలయాలను కానుకలుగా అందించచం నశీర్ కృషిలోని విశేషాంశమని జుబైల్ తెలిపారు. చరిత్ర రచన ప్రచురణ కార్యక్రమాలు మాత్రమే కాకుండా శ్రీ నశీర్ ప్రజాజీవనలోని వివిధ రంగాలలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తూ ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న ఉదాత్త సేవలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆయనను 2024 నాటి భారతీయ ముస్లింలలోని వంద మంది ప్రతిభాశీలుర జాబితాలోకి ఎంపిక చేసినట్టు జుబైర్ వివరించారు. ఈ వందమంది వివరాలతో కూడిన బృహత్గ్రంథాన్ని త్వరలో ప్రచురించ నున్నామని జుబైర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ తనను కలసిన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ హామీద్ అన్సారి, అసదుద్దీన్ ఓవైసీ, ముహమ్మద్ మదని, అజం ఖాన్, శ్రీ ఏ ఆర్ రెహమాన్, అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్, బుర్హనుద్దీన్ అజ్మల్, అబ్దుల్ ఖదీర్, ఇమ్రాన్ ప్రతాప్గరి, ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, అజీమ్ హాష్మీ ప్రేమ్ జీ, రాణా అయూబ్, మెహబూబా ముఫ్తీ లాంటి విభిన్న రంగాలలో ప్రముఖులైన వంద మంది భారతీయ ముస్లిం ప్రముఖుల సరసన తనకు చోటు లభించటం ఆనందంగా ఉందన్నారు.



## విద్యుద్ఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

**జయశంకర్ భూపాలపల్లి, జనవరి 7 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్తో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన కొత్తపల్లి (ఎస్ ఎం) గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాలుక రవి (50) అనే ఎలక్ట్రీషియన్ కరెంటు మోటార్ రిపేరు చేస్తూ విద్యుత్ షాక్తో మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామంలో మొరంచ వాగు వద్ద ఓ రైతు కరెంటు మోటార్ చెడిపోవడంతో రిపేరు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, రవి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## టీజీ జెన్కో ఏఈగా సుధీర్ కుమార్



**ఖానాపూర్ జనవరి 07 (జనంసాక్షి) :** 2024 జూలై నెలలో టీజీ జెన్కో ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజనీరు పోటీ పరీక్షల్లో పట్టణానికి చెందిన తిరునగరి సుధీర్ కుమార్ అర్హత సాధించాడు. ఈ నేపథ్యంలో ఇటీవల రాజధాని నగరంలోని సచివాలయ ప్రాంగణంలో గల రాజీవ్ గాంధీ విగ్రహ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క చేతుల మీదుగా నియామక పత్రాన్ని సుధీర్ కుమార్ అందుకున్నాడు. కాగా టీజీ జెన్కో భూపాలపల్లి స్టేషన్లో ఏఈ (కెమిస్ట్) గా విధులు నిర్వహించనున్నట్లు సుధీర్ కుమార్ తెలిపాడు. జన్కో లో ఉత్తమ ఉద్యోగం సాధించిన సుధీర్ కుమార్ ను బంధుమిత్రులు, పట్టణ ప్రజలు అభినందించారు.

# ఎవడయ్యా మహాసభ పెట్టింది?

- కనీసం సీఎం పేరు తెలీయదా.? : ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,జనవరి 7 (జనంసాక్షి) :** తెలుగు మహా సభల్లో సీఎం రేవంత్ రెడ్డి పేరు మర్చిపోయిన యాంకర్ బాలాదిత్యపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎవరో తెలవని వాళ్లుయాంకర్ అవుతారా అంటూ మండిపడ్డారు. తెలుగు మహాసభలు పెట్టిన వారికి బుద్ధి లేదా, అసలు ఆ సభలు పెట్టింది ఎవరంటూ ఫైరయ్యారు. ఎంపీగా ఉన్న నేనే పేపర్లలో రాసుకుని చదువుతున్నా.. ఒక ముఖ్యమంత్రి వస్తున్నప్పుడు ఏ సీఎం వస్తున్నడో తెలియకుండా యాంకర్ చదువుతడా అని విమర్శించారు. ముఖ్యమంత్రి పేరు చెప్పకపోవడం వెనుక ఏదో కుట్ర ఉందన్నారు.

**అసలేం జరిగిందంటే..**

హైదరాబాద్ హైటెక్స్లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని హోస్ట్గా వ్యవహరిస్తున్న సినీ నటుడు బాలాదిత్య ఆహ్వానించారు. అప్పుడు మన ప్రియతమ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కిరణ్కుమార్ గారు అంటూ ఉచ్చరించాడు. యాంకర్ నోటి నుంచి సీఎం కిరణ్కుమార్ అని రావడంతో సభ కింద ఉన్నవారంతా ఒక్కసారిగా కేకలు వేశారు. దీంతో తాను చేసిన తప్పును యాంకర్ గ్రహించాడు. ఆ వెంటనే తన తల పట్టుకుని స్టేజిపై నుంచి పక్కకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మళ్లీ వచ్చి తన క్షమాపణలు చెప్పాడు. సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఉచ్చరించాడు.

## గరికపాటిపై అభ్యంతరక ప్రచారాలు

- చట్టప్రకారం చర్యలు తప్పవని బృందం హెచ్చరిక



**హైదరాబాద్, జనవరి7 (జనంసాక్షి) :** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370